జనవరి 01-15, 2022

సంపుటి 02, సంచిక 05

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



సంక్రాంతి శుభాకాంక్షలు....



**రహత్ ఇండోరి**

**ఉర్దూ కవి, సినీ గీత రచయిత**

**(01 జనవరి 1950)**

*Printed, Published and Owned by : **KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium  Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

## విషయ సూచిక




కామవాంఛకు లోనైన పురుషునికి, కన్యకు దిక్సూచిలా నిలిచిన **మరో స్త్రీ** కథ **ఊటుకూరి రంగారావు** కలం నుండి నాటికథగా... 05



23 విద్యార్థికి తోవచూపిన ఉపాధ్యాయుని కథ... **కోటిదీపాల వెలుగు...**



35 సాంప్రదాయాన్ని, ఆధునికాన్ని సమన్వయం చేసిన **చెన్నప్ప**తో రమేష్ బాబు **ముఖాముఖి...**



11 **సినిమాలతో హరికథా గాన** ప్రశస్తిని వివరించిన **సత్యనారాయణ** వ్యాసం...



31 కానిస్టేబుల్‌ని మార్చిన సాహస కథను కథీకరించిన వైనం... **తురుంఖాన్.. గోపికృష్ణ**



17 చిన్న ప్రయత్నం జీవితాన్ని మార్చివేస్తుందని తెలిపే కథ **చుక్క పొడిచింది...**




21 క్షమాగుణం ఉన్నతిని తెలిపే **షేక్స్పియర్** నాటకాన్ని వివరిస్తున్న వ్యాసం...



43 నాటి విషాదాలను గుర్తులను తలపోస్తున్న **బుగులు** సమీక్ష...

**కడారు యదార్థకావ్యాల** లోతులని విశ్లేషించిన వ్యాసం... పేజీ 41

నలుదిశలా శాంతి బావుటా ఎగరవేయడానికి కవితా విజయదుందుభి మ్రోగిస్తున్న **రంగుచక్రపాణి...** పేజీ 16

**పురుషార్థాలను** తెలిపే **రావికంటి** పద్య సంవేదన... పేజీ 40

**వసంతంలా విచ్చుకునే** చైతన్యం తెలిపిన **గోపగాని** కవిత... పేజీ 4

**ఆదిత్యునికి అంజలిస్తున్న రమేశ్వర రాజు** కవిత... పేజీ 44

కొట్టిన వెంటనే **కొత్తగా మొలిచే చెట్టు ఔన్నత్యం** చెప్పిన కవిత... పేజీ 30

**కరోనా సమయంలో ఇంటి నుండి పనిచేసిన** వైనం తెలిపిన **సంధ్యా సూత్రావె** కవిత... పేజీ 26

**సూర్యునిలా ప్రకాశించే** మరువని కలను చిత్రించిన **బాణాల శ్రీనివాస్** అనువాద కవిత... పేజీ 46

**ఇంకా...**

సాహితీశిఖరం, దృశ్యసాహిత్యం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

పుస్తక పఠనం అలవాటు ఉన్న వ్యక్తిని పరిపూర్ణ మనిషిగా మార్చేస్తుంది పుస్తకం అంటారు. ప్రముఖుల ఎందరికో వెలుగు పంచింది. వారిని వెలుగులోకి తెచ్చింది పుస్తకాలే. ముఖ పుస్తకం పట్టుకుని నిజ పుస్తకాన్ని మరిచాము. చదవాలి అనే ఆలోచనా ఆసక్తి ఉంటే చాలు ఎన్నో మంచి పుస్తకాలు వేలల్లో ఉన్నాయి చదవండి, చదివించండి.

ఒక కోటి రూపాయలు మీకు దొరికితే మీరేం చేస్తారు అని అడిగితే... ఒక గ్రంథాలయాన్ని కట్టేస్తా అన్నారు మహాత్మాగాంధీ

ఎవరూ లేని ఒక దీవిలో మిమ్మల్ని ఒంటరిగా వదిలేస్తే ఏమి చేస్తారు అని అడిగితే... పుస్తకాలతో ఆనందంగా గడిపి రెట్టింపు సంతోషంతో తిరిగి వస్తా అన్నారు నెహ్రూ

జీవితం విరక్తి చెందినప్పుడు లేదా కొత్త జీవితం ప్రారంభించాలి అనుకున్నప్పుడు ఒక మంచి పుస్తకం చదవడం మొదలుపెట్టు అన్నారు ఇంగర్సాల్

మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది ఏది అన్నప్పుడు కొంచం కూడా ఆలోచించకుండా పుస్తకం అని చెప్పారు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

వ్యాయామం ఎలా శారీరక ఆరోగ్యమో, అలా పుస్తక పఠనం మనసుకు వ్యాయామం ఆరోగ్యం అన్నారు సిగ్మెంట్ ఫ్రాయిడ్

నేను ఇంతవరకు చదవని పుస్తకాన్ని తీసుకువచ్చి నన్ను కలిసిన వ్యక్తి నా ప్రాణ స్నేహితుడవుతాడు అన్నారు అబ్రహం లింకన్

పుట్టినరోజు కానుకగా ఏమి కావాలని కోరినప్పుడు... పుస్తకాలు కావాలని కోరుకున్న వ్యక్తికి లక్షల పుస్తకాలు వచ్చి పడ్డాయి కానుకగా ఆ వ్యక్తి లెనిన్

ప్రపంచపటంలో కనిపించే ప్రతి మూలకు వెళ్లాలని ఆశపడుతున్నావా, అయితే గ్రంథాలయానికి వెళ్ళమన్నారు డెస్కార్డ్స్

ఇంకే స్వేచ్ఛ నాకు వద్దు జైలులో పుస్తక పఠనానికి అనుమతి కావాలని కోరారు నెల్సన్ మండేలా

ఒక పిల్లాడికి మీరు ఇవ్వాల్సిన గొప్ప బహుమతి ఏది అంటే పుస్తకమే అన్నారు విన్సెంట్ చర్చిల్

భయంకరమైన యుద్ధ ఆయుధాలు ఏవి అని అడిగినప్పుడు పుస్తకాలని చెప్పారు మార్టిన్ లూథర్ కింగ్

తనకు ఉరివేసే క్షణం ముందు వరకు పుస్తక పఠనం చేస్తూ ఉన్న వ్యక్తి భగత్ సింగ్

మరిచిపోకుండా నా సమాధిపైన రాయండి ఇక్కడ పుస్తకాల పురుగు శాశ్వత నిద్రలో ఉన్నదని అన్నారు బ్రెడ్రంట్ రసెల్

ఒక్కో చిత్రం నటించాక తనకు వచ్చిన పారితోషికంతో మొదట 100 డాలర్లకు పుస్తకాలను కొనేవారు చార్లీ చాప్లిన్

సంపాదకీయం


తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 జనవరి, 2022

సంపుటి 02 సంచిక 05





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి


# తెలంగాణ సంస్థానాలు - సాహిత్య సేవ

తెలుగు సాహిత్యానికి మొదటినుండి చక్రవర్తులు, రాజులే పోషకులు అనేమాట వేరే చెప్పాల్సిన అవసరం లేదు. తెలంగాణ - ఆంధ్ర ప్రాంతాలలో ఆంగ్లేయులు భారతదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో ఎన్నో సంస్థానాలు వెలయడం. నాటి సంస్థాన పాలకులు కళాసాహిత్యరంగాలకు అనితరమైన సేవ చేయడం చరిత్ర విస్మరించలేని విలువైన అంశాలు. సంస్థానాల పరిపోషణలో ప్రధానంగా పౌరాణిక వస్తువుతో వచ్చిన పద్య కావ్యాలే ఎక్కువగా కనిపిస్తాయి.

సంస్థాన పరిపోషణలో కొన్ని కాలపరీక్షకు తట్టుకోలేకపోయినవి కూడా ఉన్నాయి. అనేకమంది బహుజన కులాల కవులు కూడా ఆ కాలంలో కనిపిస్తారు. కాని చెప్పుకోదగ్గ కవుల స్థాయిలో వాళ్ళ రచనలు నిలవకపోవడానికి, బహుశా వాళ్ళకు ప్రచారకాంక్ష లేకపోవడమో నాటి సమాజంలో ఇతరుల అంతచ్ఛేతనలో నాటుకున్న విచక్షణో కారణం కావచ్చు.

కాగా తెలుగు సాహిత్యంలోని క్షేత్ర మాహాత్మ్యాలు, చారిత్రక కావ్యాలు, పురాణాలు ప్రబంధాలు, యక్షగానాలు, నాటకాలు, శతకాలు, చిత్రబంధ గర్భ కవిత్వాలు నిండిన కావ్యాలు తాత్విక రచనలలాంటి అనేక ప్రక్రియలు మనకు ఈ కాలంలో కనిపిస్తాయి. నిఘంటువులు, దర్శన గ్రంథాలు, సంగీత శాస్త్ర గ్రంథాలు అనేకం ఆయా సంస్థానాలలో రికార్డులుగా నిలిచాయి.

తెలంగాణ ప్రాంతంలో అలంపురం, ఆత్మకూరు, గద్వాల, గోపాలపేట, జటప్రోలు, దోమకొండ, పాల్వంచ, బొరవెల్లి, వనపర్తి లాంటివి గుర్తించదగిన సంస్థానాలు. మంథాన భైరవుడు, పెదసోమభూపాలుడు, ఎల్లూరి లక్ష్మీనర్సయ్య, బాలసరస్వతి, కామినేని మల్లారెడ్డి, శ్రీనాథుని వేంకటరామకవి, వేంకట కుమార గోపాలరావు, రామరాజు, శ్యామరాజు లాంటి ఎందరో జ్ఞాత, అజ్ఞాత కవులు ఈ సంస్థానాల్లో దర్శనమిస్తారు.

ఆ కాలంలో వచ్చిన సాహిత్యమంతా అనివార్యంగా సాంప్రదాయక భావజాలాన్నే ప్రదర్శించినా చారిత్రక పరిణామానికి సంకేతాలుగా నిలిచినవనేది కూడా ఒక విస్మరించలేని సత్యం. మన సాంస్కృతిక వైభవానికి నాటి సాహిత్య సాంస్కృతిక రంగాలకు ఇవి కేంద్రాలుగా నిలబడి స్ఫూర్తి ప్రదానం చేస్తున్న విషయం కూడా ఒక స్మరణీయాంశం. ఇలాంటి సంస్థానాల మీద ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉంది. అనేక సామాజిక పరిణామాలకు దోహదంగా నిలిచిన కళారూపాలను వెలికి తీయాల్సి ఉంది.

సామాజిక పురోగనంలో సాహిత్యానిది తిరుగులేని పాత్ర. అది ఏకాలంలోనైనా గుర్తుంచుకోవలసిన సత్యం. నాటి సంస్థానాల సాహిత్యం, నాటి సామాజిక పరిస్థితులను ప్రతిఫలించింది. ఎన్ని లోపాలు, ఆరోపణలు ఉన్నా సంస్థానాధీశుల సాహిత్యాభిరుచిని గుర్తించక తప్పదు. మినహాయింపులను పరిహారాలను గమనిస్తూనే సంస్థానాలు చేసిన సాంస్కృతిక సేవను మరింతగా నేటి సమాజానికి ఉపయోగపడేలా తీర్చి దిద్దుకోవల్సి ఉంది.

కవిత
కల్వకుంట్ల

కవిత

# వసంతంలా విచ్చుకుందాం..!



గోపగాని రవీందర్, 9440979882

మనస్సును ఆవరించిన
ఇక్కట్ల చీకట్లను పారద్రోలే
సూర్యోదయాన్నే ప్రేమిస్తాను
మిత్రునిలా అలుముకున్న
కిరణాల వెచ్చదనాన్ని
తన్మయత్వంతోనే ఆస్వాదిస్తాను
సల్పుతున్న జీవన గాయాలకు
చిగుళ్ళ వంటి ఆలోచనలతోనే
సునాయాసంగా వైద్యం చేస్తాను
పుంఖాను పుంఖాలుగా ఎన్ని చెప్పిన
మడమ తిప్పని మాటల
వాగ్దానాలనే నమ్ముతాను..!

పల్లకిలో ఊరేగుతున్న ఆశావాదులు
నిలువనీయని రంగులమయమైన ఆకాంక్షలు
అంతుబట్టని మానసిక సముద్ర రహస్యాలు
ఆర్థిక బంధనాలతో వర్ధిల్లుతున్న ఇల్లు
సమస్యల సందడితో హోరెత్తుతున్న రోడ్డు
పచ్చని ఆకులను రాల్చిన చెట్టు పోరాటం
దృష్టి మారని చూపుతో నిచ్చలంగున్న కొండ
అంతుపట్టని దిగులుతో పలకరిస్తున్న ఊరు
అరాచకానికి నిలువెత్తు రూపమైన రచ్చబండ
సమసిపోని నిచ్చెనమెట్ల వ్యత్యాసాల కొట్లాట
కలుసుకునే మిత్రులు పాత వాళ్ళే కావచ్చు
శత్రువుల సంఖ్య పెరుగుతూనే ఉంటున్నది
పాటల్లోని సొగసును ఆస్వాదించడమొక వరం
చర్చల్లో పాల్గొనాలనే తహతహలు తనివితీరనివి
అన్నిట్లో తలదూర్చడమొక నిత్య కృత్యమే కదా..!

ఎక్కడో ఒక దగ్గర
ఏదో ఒక సందర్భంలో
మెరుపులా తళుక్కుమంటాయి
భూగర్భాన్ని కాపాడుకోవాలనే
నినాదమైన పిడికిల్లు
తలలెత్తిన మొలకలను
కాపాడుకుందామని అస్త్రాలతో
సిద్ధపడి అడుగుల వేసినంతటనే
బంధిస్తాయి అపరిచితమైన సంకెళ్లు..!

మన ప్రయత్నం లేకుండానే
కొన్ని జ్ఞాపకాలు దూరమైనట్లుగానే
గందరగోళమైన మనసుతో
ఏ పనిని పూర్తి చేయనట్లుగానే
గోడ మీద క్యాలెండర్ కూడా అంతే
కొత్తది వచ్చినప్పుడల్లా
పాతది అంతర్థానమవుతుంది
కాలమొక రమ్యమైన కావ్యంలా
మనల్ని హత్తుకుంటుంది
తోటలోని సుమాలు వికసించినట్లుగా
మనమంతా వసంతంలా విచ్చుకుంటూనే
కాలచక్రానికి హారతులు పడుదామిక..!



నాటి కథ

# సుప్రభాతం

ఆకర్షణతో వివేకం కోల్పోయిన పురుషుని వైనం తెలిపే కథ....

ఊటుకూరు రంగారావు

'జానకి మంచి అందగత్తె. బాగా చదువుకుని విజ్ఞానం అంతోయింతో సంపాదించింది కూడాను. చిన్నప్పటినుంచీ స్వేచ్ఛా వాతావరణంలో పెరిగి పెద్దదై తన మంచిచెడ్డలు తను నిర్ణయించుకునే శక్తి సామర్థ్యాలు పొందిన వికసిత పుష్పం. తనో ఎందులోనూ ఆవిడకి సాటిరాడు. ఇటు తన అందం చూడబోదామంటే ఆ ఎత్తుపళ్ళూ, మిట్ట నొసలూ, వంగిపోతూన్న శరీరం. తనని అంతా ఇరవైనాలుగేళ్ళ ముసలాడని పిలుస్తారు మిత్రులు. ఆవిడకున్నంత చదువూ సంస్కారం కూడా లేవు తనకు. నిజం ఆలోచిస్తే జానకి క్లాస్‌మేట్స్‌కన్నా, పరిచితులకన్నా, స్నేహితులకన్నా తను అన్నింటిలోనూ తీసికట్టే అయినప్పుడు, తనలో ఏంచూసి జానకి యిలా ఉత్తరం రాసింది? ఈ వుత్తరం తనని పరిహసించడానికా, లేక పరిశోధించడానికా జానకి రాయడం?' ఎంత ఆలోచించినా విశ్వేశ్వరరావు బుర్ర ఈ సమస్యని పరిష్కరించుకోలేక పోయింది. విశ్వేశ్వరరావు రెండు గంటలనుంచీ మథన పడుతున్నాడు. తర్కశక్తినంతా ఉపయోగించి 'యిప్పుడేంచేస్తే ఏ ఫలితం లభిస్తుంది. అని చూసి విఫలుడైపోయాడు. ఏదీ తోచడం లేదు.

సర్వర్‌కి మంచి 'స్ట్రాంగ్ టీ' ఆర్డరిచ్చి సిగరెట్టు వెలిగించాడు విశ్వేశ్వరరావు. అటూఇటూ ఎవరన్నా వుండి తనని పరిశీలిస్తున్నారేమోనని చూశాడు. ఆ మూలన కూర్చున్న తనమీద ఎవరి దృష్టీ ప్రసరించకపోవడం గమనించి జేబులోంచి ఓ కాగితాన్ని తీసి తనలో తనే మళ్ళీ ఓసారి చదువుకున్నాడు. ఆ కాగితం తనకుచేరిన ఈ రెండు గంటల నుంచి ఎన్నిసార్లు దాన్ని విప్పి చదివాడో లెక్కలేదు. ఆలోచిస్తూనే టీనికాస్తా గడగడా తాగేసి బలంగా ఒకసారి సిగరెట్టు దమ్ముపీల్చి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు విశ్వేశ్వరరావు. మిత్రులతనికి 'సర్వజ్ఞుడనే బిరుదునూ, 'మహాకవి' అనే పట్టానూ యిచ్చారు; కాని, అతను దేన్నీ పరిష్కరించుకోలేకపోతున్నాడు.

'రాజారావు'తో తనకి రెండేళ్ళ నుంచీ పరిచయం. ఈ రెండేళ్ళలో తను వాళ్ళింటికి ఎన్ని వందలసార్లో వెళ్ళి వుంటాడు. వెళ్ళినప్పుడల్లా జానకినీ, ఆవిడ పరిస్థితుల్ని తను చూస్తూనే వున్నాడు. కాని ఎలాంటి అభిప్రాయమూ తనకేర్పడలేదు. అప్పుడప్పుడు వాడి చెల్లెళ్ళ చదువునూ, చురుకుదనాన్ని గురించి రాజాయే చెబుతుండేవాడు. పెద్దమ్మాయి సరళని యమ్మేదాకా చదివించాలనీ, చిన్నమ్మాయి జానకిని డాక్టర్‌గా చేయాలని అంటూండేవాడు.

రాజాకు తనంటే ఎంతో ఆదరమూ అభిమానమూను. అతని తల్లి కూడా చాలా ఆప్యాయంగా ప్రవర్తించేది. గంటలకొద్దీ ఏదో విషయాన్ని గురించి తామిద్దరూ చర్చించేటప్పుడు జానకి అతిచనువుగా విషయంలో జోక్యం కల్పించుకుని తనూ పాల్గొనేది. కాని ఎన్నడూ ఇలాంటి వాంఛ ఆవిడకున్నట్లు ప్రస్ఫుటమవలేదు. సామాన్య స్త్రీలలాగే ఆవిడలోకూడా వాంఛలూ, ప్రేరేపణలూ వుంటాయని ఎన్నడూ అనుకోడానికి ఆస్కారం లభించలేదు. సరళ మొదటినుంచీ తనతో చాలా ముభావంగా వుండేది. అనవసరంగా మాట్లాడ్డంగానీ, చర్చల్లో పాల్గొనడంగానీ ఆవిడ కిష్టంలేదు. సరళది శిక్షిత స్వభావం. జానకి సురక్షితమైన ఆచార వ్యవహారాలు వంట జీర్ణించుకున్నదేకాని సరళలో గల మాంద్యం ఆవిడలో లేదు. ఒకేయింట్లో ఒకే తల్లికడుపున పుట్టిన వీళ్ళ ముగ్గురివీ మూడు వింత ప్రకృతులు. ఈ విషయాన్ని గురించే సరదాగా తను అప్పుడప్పుడు ఆలోచిస్తుండేవాడు కూడాను.

ఇవాళ జానకి వుత్తరం విశ్వేశ్వరరావుకి విపరీతాశ్చర్యం కలిగించడంతోపాటు, సందిగ్ధావస్థలో పడేసింది. ఆవిడ తనని మనసారా వాంఛిస్తున్నట్లు యీ వుత్తరం కంటే యింకా ఋజువేంకావాలి? ఆ వాంఛ ఏ స్వరూపంలో, ఏ దశలో గుప్తీకరించబడివుందో కూడా ఇట్టే

తెలిసిపోతుంది వుత్తరం చూస్తేనే - కాని, సమస్య అది కాదు జానకి పంపిన యీ ఆహ్వానాన్ని అంగీకరించడమా తిరస్కరించడమా అన్నదే.

"-సముద్ర కెరటాల్లా ఉప్పొంగిపోయే యౌవనాన్నీ, వాంఛలనీ చంపుకుని గాలికి తేలిపోయే చిరుకాగితం ముక్కలాంటి మీ జీవితం, మీ ఏకాంత మనోవేదన నాకు బాగా తెలుసు. మనస్సులో మండే మహాగ్నిని చల్లార్చుకోవడానికి మీరు అనుసరించే విపరీత ధోరణి జీవితంలో మీకు స్థాయినీ, సుఖాన్ని కలిగించలేదు. మీరీస్థితిలోనే కొన్నాళ్లుంటే, ప్రపంచాన్ని ముఖ్యంగా స్త్రీజాతిని సంపూర్ణంగా ద్వేషించి, విలువను కోల్పోయే దశ వస్తుందేమోనని అనుమానం. మీ బ్రతుకులో ఒక అలంకారిక ఘట్టాన్ని మెరుగును సృష్టించి, స్థానత్వాన్నుంచి, చలనదశలో మిమ్మల్ని ప్రవేశపెట్టగలననే ధైర్యంతో జాలిగా, సానుభూతితో మిమ్మల్ని అర్థంచేసుకుంటున్నాను. ఎందుకు మీకీ ఏకాంతవాసం? ఏదేవుడు విధించిన శిక్ష యిది? ప్రపంచాన్ని అనుభవించడానికి తాపత్రయపడాలి. ప్రపంచం మనల్ని అనుభవించమని తనకుతానై కోరి పాదాల ముందు వాలడానికి నిరీక్షించడం అంత తేలిక కాదు.. క్షమించండి! మిమ్మల్ని నేను పూర్తిగా అభిమానిస్తాను. ఏకాంతంగా మీతో మాట్లాడి కొన్ని విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను. సాయంత్రం ఆరుగంటలకి, సరిగ్గా ఆరు గంటలకి మా యింటికి రండి, తగిన వాతావరణం కల్పించబడి వుంటుంది. - మీ జానకి".

> **జానకిలో ఇన్నాళ్ళూ కనిపించని ఏదో ఊహాకందని ప్రకృతిని ఇవాళ అతనూ హిస్తున్నాడు. ఇందాకటిదాక అతను తన ముందు పరచుకున్న జానకి సౌందర్యపు వలలో, భావపదాన్ని వుంచలేదు. కాని ఇప్పుడవి పూర్తిగా ఆ వలలో తగులుకోవడంతో విశ్వేశ్వర రావుకి ఆలోచనాశక్తి నశించి పోయింది. క్షణంలో ముఖకవళికలు మారి పోయాయి. పోకేం జేస్తాయి? విశ్వేశ్వరరావు సామాన్య మానవుడేకాని భీష్ముడూ, ఆంజనేయుడూ కాడు.**

ఇంత నిర్భయంగా తమ అభిప్రాయాలని వ్యక్తీకరించే అవివాహితలు, కన్యత్వం వీడని కామినులు చాలా అరుదుగా కనిపిస్తారు. సాధారణ స్త్రీలకన్నా చదువుకున్న ఆడవాళ్ళల్లో ఇంకో ముఖ్యవిశేషం వుంది. మామూలు స్త్రీలు తమకేర్పడే విపరీత భావాలను జగుత్సుకు వెరచి అణచుకుంటారు. విజ్ఞానవతులు, మంచైనా చెడైనా ఓవాంఛ, ఒక అభిప్రాయం ఏర్పరచుకున్నారంటే, ఎంతో అఘాతం పొందందే బలాన్ని కోల్పోరు. అలానే అయింది జానకి పని. ఆవిడ పందొమ్మిదేళ్ళ కన్య. కాలేజీ ఆవరణలో విశ్వేశ్వరరావుచే బోధింపబడే విద్యానామక విషయంతో ఆర్జించుకుని, పెంపొందించుకుంటూ వస్తున్న విజ్ఞానం ఆవిడ కీపని సబబైందేనని నచ్చజెప్పి వుండవచ్చు. అయినా విశ్వేశ్వరరావుని గురించి, ఈ యిరవైనాల్గేళ్ల ఘోటక బ్రహ్మచారిని గురించి, ఈ వర్ధమాన మానవమాత్రుని గురించి ఆవిడ లోలోపల ఇంకా ఎన్ని అభిప్రాయా లేర్పరచుకొని వుందో కాని, ఇవాళ, ఈ విధంగా, అవి విజృంభించి, కట్టలు తెంచుకొని, విశ్వేశ్వరరావును ముంచెత్తినవి. కొందరి మనస్తత్వాలు అర్థంకాని దశలో వుంటాయని ఊహిస్తున్నాడతను.

జానకి రూపాన్నీ యౌవనప్రాంగణంలో అడుగెడుతూన్న ఆవిడ పరిపుష్ట శోభనీ ఒక్కసారి మనసులో ఊహించుకునేసరికి విశ్వేశ్వరరావులో ఏదో విద్యుత్ప్రవాహం పొంగింది! ఇన్నాళ్ల నుంచీ అతనికి తెలియకుండానే అతనిలో అణిగి వున్న వాంఛలు తాచుపాముల్లా పడగలు విప్పినై, సహించలేని ఆవేదనతోపాటు మానసిక పరిస్థితి కూడా మారిపోజొచ్చింది. జానకిలో ఇన్నాళ్ళూ కనిపించని ఏదో ఊహాకందని ప్రకృతిని ఇవాళ అతనూహిస్తున్నాడు. ఇందాకటిదాక అతను తన ముందు పరచుకున్న జానకి సౌందర్యపు వలలో, భావపదాన్ని వుంచలేదు. కాని ఇప్పుడవి పూర్తిగా ఆ వలలో తగులుకోవడంతో విశ్వేశ్వరరావుకి ఆలోచనాశక్తి నశించి పోయింది. క్షణంలో ముఖకవళికలు మారిపోయాయి. పోకేం జేస్తాయి? విశ్వేశ్వరరావు సామాన్య మానవుడేకాని భీష్ముడూ, ఆంజనేయుడూ కాడు. కనీసం దండకారణ్యంలో వున్న శ్రీరాముడూ కాదు. ఇక ఎందుకు మారడు? వున్న అవకాశాన్ని సద్వినియోగపరచుకుని

జీవితంలో ఏనాడూ పొందని అమరసుఖాన్ని పొందడానికి ఎవడు వెనుదీస్తాడు? తను చేయబోయేపని 'మిత్రద్రోహం' అనిగానీ, తన స్వార్థానికి ఓ యువతిశీలాన్ని, బలిచేయబోతున్నానని గాని అతడూహించలేకపోయాడు. ఒకోసారి ఒకోమనిషిలో అంకురించిన



సాహసాన్ని తరతరాలనాటి ఆత్మ సంస్కారం కూడా అడ్డుకోలేదు.

విశ్వేశ్వరరావు నిశ్చయించుకున్నాడు- 'స్వయంగా ఆవిడ అర్థిస్తోంది. ఆవిడేమో తెలివి తక్కువదీ, లోకజ్ఞానం లేనిదీ కాదు. అలాంటప్పుడు తన కర్తృత్వంగాని, తన కంటబోయే పాపంగాని ఇందులో యేమీలేదు. పాపం, ద్రోహం అని విచారించి, అత్యంత సౌఖ్యప్రదమైన అవకాశాన్ని జార్చుకోవడం అవివేకం'. నిశ్చయం జరిగాక క్షణం నిలబడలేక పోయాడు. హెూటలు బిల్లు చెల్లించి, జానకి ఉత్తరాన్ని అతిభద్రంగా జేబులో మడిచిపెట్టుకుని తిన్నగా బయల్దేరాడు.

సరిగా సాయంత్రం ఆరు గంటలయ్యే సరికి విశ్వేశ్వరరావు జానకి యింటి గేటు ముందుకు చేరుకున్నాడు. ఈ లోపల అతనిలో ఎన్ని లక్షల ఊహలు దండలు దండలుగా పెనవైచుకున్నవో. ఎన్ని లక్షలసార్లు అతని గుండెలు స్పందించాయో లెక్కలేదు. గేటు తెరచుకుని చిన్నగా వరండాలోకి అడుగెట్టాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. విశ్వేశ్వరరావు గుండెలు టక్కుటక్కు మంటూన్నై. ఏకాంతం కల్పిస్తానని జానకి అన్నమాటల్లో అర్థంయేమిటి? అంతా యెటన్నా వెళ్ళారా? ఏదీ తోచడంలేదు అతనికి. ఇంతలో లోపల నుంచి యెవరో వస్తున్న అడుగుల చప్పుడయింది. బహుశా జానకే వస్తూండవచ్చు

> **విశ్వేశ్వరరావు గుండెలు టక్కుటక్కు మంటూన్నై. ఏకాంతం కల్పిస్తానని జానకి అన్నమాటల్లో అర్థంయేమిటి? అంతా యెటన్నా వెళ్ళారా? ఏదీ తోచడంలేదు అతనికి. ఇంతలో లోపల నుంచి యెవరో వస్తున్న అడుగుల చప్పుడయింది. బహుశా జానకే వస్తూండవచ్చు ననుకుని, ఆవిడతో ఎలా మాటాడాలా అని ఆలోచి స్తున్నాడు.ఓరవాకిలిగా వున్న తలుపు తెరచుకుంది.**

ననుకుని, ఆవిడతో ఎలా మాటాడాలా అని ఆలోచిస్తున్నాడు.

ఓరవాకిలిగా వున్న తలుపు తెరచుకుంది. విశ్వేశ్వరావు గుండెల్లో జలపాతం దూకినంత పనయింది. ఒక్కసారి తడబడిపోయాడు. 'అరే! జానకి



కాదు. సరళ'. అతని నరాలు ఒక్కసారి వణకుతో కుంచించుకు పోయినై.

"ఓ! మీరా? అలా కంగారుపడతారేం? కూర్చోండి" అంది సరళ చిరునవ్వుతో.

విశ్వేశ్వరరావు కింకా కంగారెక్కువ యింది. ఏదో బాధపడుతూ దాన్ని బయటికి రానీయకుండా వుండాలని ప్రయత్నిస్తూ, "ఎబ్బెబ్బే! కంగారెందుకు? ఊరికే అలా చూసిపోదామని వచ్చాను" అన్నాడు నాటకంలో అభినయిస్తున్న వాడిలా.

సరళ యీమారు నవ్వకుండా వుండలేకపోయింది. "కృతజ్ఞురాల్ని. కూర్చోండి. ఇప్పుడే టీ పట్టుకొస్తాను" అంటూ నవ్వుతూనే లోపలికెళ్ళింది.

విశ్వేశ్వరరావుకి కొంచెం గాభరా వేసింది. జానకి అసలుందా లేదా? మధ్య యీవిడ తారసపడిందేమిటి? ఇంకేమన్నా అనుకోదు గదా? భుజాలు తడుముకుంటున్నాడు. ఈ సత్కారానికర్థంయేమిటో?

టీతో సహా సరళ ప్రత్యక్షమయింది. కుర్చీ లాక్కుని విశ్వేశ్వరరావు పక్కన కూర్చుని, టీ కలిపి అతనికందిస్తూ అంది... "కులాసా? అలావున్నారేం ఇవాళ"

"ఏం? బాగానే వున్నాను. కాని ఈ సమయంలో టీ ఎందుకు చెప్పండి" అన్నాడు.

**మిమ్మల్ని అనేంలాభం? మిమ్మల్ని తయారుచేసిన విద్యావిధానాన్ని, వాతావరణాన్నీ అనాలి" అంది నిట్టూరుస్తూ. ఆ కొంచెం నిశ్శబ్దంలో విశ్వేశ్వరరావు ఘోరనరకాన్ని చూశాడు. సరళ యీమారు కొంచెం కటువుగా "జానకికి మీరు ఎంతకాలం నుంచీ వుత్తరాలు రాస్తున్నారో కొంచెం సెలవీయండి" అంది. విశ్వేశ్వరరావు ప్రాణాలు అటకెక్కి పోతున్నై. "నేనా? క్షమించండి! జానకికి ఉత్తరాలు రాసేంత అవసరం నాక్కలగ లేదు.**

"మంచి టీ దొరికిందంటే వీడా ప్రాంతాన్నిక వదలడనీ, వీడికిదో దురభ్యాసమనీ మా రాజా మిమ్మల్ని గురించి చెబుతూండేవాడు. టీ లేందే మీకు మెదడు పనిచేయలేదని కూడా అంటారు. మీరేమో సమయాసమయాలు అంటూ బుకాయిస్తున్నారు" అంది సరళ చాలా సరదాగా.

విశ్వేశ్వరరావుకి ఆశ్చర్యం వేసింది. సరళ తనతో ఎన్నడూ యింత ఫ్రీగా మాట్లాళ్లేదు. ఇవాళ ఏదో కారణం వుండకపోదు. అతనికింకో భావం కూడా తోచింది. కొంపతీసి జానకి పేరుతో యీవిడ కాదు కదా ఉత్తరం రాసింది? అనుకొని భయపడ్డాడు.

నెమ్మదిగా టీ అందుకొని ఒక్క నిమిషంలో ఖాళీ కప్పుని కింద వుంచాడు. జేబులో చేయి పెట్టి ఎందుకో ఆగిపోయాడు-

గతుక్కుమని సరళ నవ్వుతూ.. "ఊ...! అభ్యంతరంలేదు బయటికి తీయండి!" అంది.

విశ్వేశ్వరరావు వళ్లు జలదరించింది. "ఏమిటి?" అన్నాడు.

"సిగరెట్లూ అగ్గిపెట్టేనూ, టీ త్రాగి ఒక్క సిగరెట్ వెలిగించారంటే ప్రపంచం మీరు చెప్పినట్టు వింటుందనీ- లేదూ ప్రపంచం చెప్పినట్టు మీరు లోబడతారనీ మీ నోటంటే ఓ శుభోదయాన వినడం జరిగింది. కాల్చండి పరవాలేదు"

చకితుడైపోయి వద్దనుకుంటూనే సిగరెట్టు వెలిగించాడు విశ్వేశ్వరరావు. సరళలో వచ్చిన యీ మార్పుకి అర్థం కనిపెట్టలేక బుర్ర బద్దలవుతోంది.

సరళ తన కుర్చీని కొంచెం వెనక్కి జరుపుతూ "ఏమో బ్రహ్మాండంగా ఆలోచిస్తున్నారే" అంది.

విశ్వేశ్వరావు ఉలిక్కిపడి "ఎబ్బెబ్బే! ఏంలేదు" అన్నాడు.

"మనస్సు ఏదో వైజ్ఞానిక పరిశోధన చేస్తోందనుకుంటాను" అంది సరళ సంభాషణ పెంచే ధోరణిలో.

"పరిశోధనాలేదు పాడూలేదు. ఈ రోజుల్లో పరిశోధనలకి విలువ ఎక్కడేడిసింది. కాలేజీ ఆవరణల్లో తప్ప?" అన్నాడు విశ్వేశ్వరరావు.

"ఐతే యిప్పుడు నేర్చుకునే ఈ విద్యలన్నీ కాలేజీ దాటితే ఎందుకూ అక్కరకు రావనా మీ అభిప్రాయం?"

"ఎందుకూ? నిత్యజీవిత గమనంలో తోడువడని విద్యలూ, పరిశోధనలూ, కేవలం అలంకారప్రాయంగా తగిలించుకోవడానికే పనికొస్తాయిగాని లోకానుభవం సంపాదించి పెట్టలేవు" అన్నాడు సీరియస్‌గా విశ్వేశ్వరరావు.

"ఈ అభిప్రాయం అందరికీ వర్తిస్తుందా? పట్టుదలగా అడిగింది సరళ.

"అంటే"

"ఈనాటి విద్యావిధానంలో కొట్టుకునిపోయే స్త్రీలు, పురుషులూనని నా అభిప్రాయం"

"ఓ! స్త్రీలైతేం, పురుషులైతేం? విద్యావిధానంలోనే లోటున్నప్పుడు అంతా సమాన విజ్ఞానంతోనే వుంటారు. హృదయం వికసింపజేసి, లోకాన్ని పూర్తిగా చేసుకునే తెలివిని వ్యక్తిలో సృష్టింపజేయలేదు ఈ విధానం" అంటూ చప్పరించాడు విశ్వేశ్వరరావు.

" ఇంకావున్న లోపాలేవిటో విశదీకరించండి" సావధానంగా, అంది సరళ.

"ఎన్ని లోపాలున్నా మీరు గమనించాల్సిన విషయం ఇంకోటుంది ముఖ్యమైంది. ఇందులోనే పెరిగి బ్రహ్మాండాన్ని చిటికెనవేల్తో తిప్పగల మేధావులూ వున్నారు సుమండీ!"

"అందుక్కారణం ఏవిటంటారు?"

"కాలేజీలో ఆర్జించిన కాస్తో కూస్తో విజ్ఞానాన్ని పెడదారి బట్టనీయకుండా, వాస్తవిక జీవిత రంగంలో ఎదుర్కొంటున్న సమస్యల అనుభవాన్ని దానికి జతచేసుకుని జీవితాన్ని సమన్వయ పద్ధతిలో నడిపేవాళ్ళంతా పైకొస్తారు. ప్రస్తుతం వాతావరణంలో పెరిగిపోతూన్న నీచాభిరుచుల్ని ప్రోత్సహిస్తూ, వాటికింకా బలాన్ని చేకూర్చే లోకంలో పరిసరాలకి లోబడకుండా జీవించడం దుర్లభం. ఎన్ని డిగ్రీలు సంపాదించినా మనిషి సహజమైన లోకానుభవాన్ని గడించలేడు. కృత్రిమం

పెరిగిపోయి, సాధ్యాసాధ్యాలూ, ఆచరణ అనాచరణలూ గ్రహించకుండా మనుషులు కేవలం అభిరుచులకే దాసులవుతారు. అవుతూన్నారు కూడా".

"ఇంతకీ మీరనేది మనిషిలో స్వతహాగా బలహీనత వున్నప్పుడు ఎంత చదువుకున్నా లాభం లేదని. అంతేగా?"

"అవును"

"మరి దానికింత ఉపన్యాసం ఎందుకూ ప్రత్యక్షంగా కనిపిస్తుంటేనే"

"ఏవిటి కనిపించేది?" విశ్వేశ్వరరావు మల్లా ఉలిక్కిపడ్డాడు. ఏదో తీవ్రాలో చనతో మనస్సు సతమతమ వుతుంది. రెండుమూడు నిమిషాల పాటు నిశ్శబ్దం.

"ఏదో ఆలోచిస్తున్నారు. జానకిని గురించా? అది యిందాకే అమ్మను తీసుకుని సినిమా కెళ్ళిందిలెండి" అంది సరళ అతన్ని పరీక్షిస్తూ.

"జానకిని గురించా? ఎబ్బే... లేదే... ఏదో మనస్సు బావుండలేదు" అన్నాడు తత్తరపాటుతో.

"మీరు బలేచక్కగా అతకని అబద్ధాలా డతారు కదూ?" అంది సరళ నవ్వుతూనే.

"నేనెందుకాడాలి అబద్ధం? నాకేం భయం?" అన్నాడు విశ్వేశ్వరరావు.

"పాపం! మీరు సరిగ్గా సమయానికే వచ్చారుగాని, పాపిష్టిదాన్ని నేనే కొంచెం యింట్లో పనుండి వుండిపోయి, జానకిని అమ్మకుతోడుగా పంపాను సినిమాకి. అది నన్నెంత దూషించుకుంటోందో మనస్సులో విచారంగా అంది సరళ.

"మీరంతా యివాళేదో కొత్తగా, వింతగా మాట్లాడేస్తున్నారు" అన్నాడు విశ్వేశ్వరరావు ఆశ్చర్యంగా చూస్తూ.

"రోజా జరిగేదానికి కొత్తేముంది? రోజూ నేనిలానే మాట్లాడేస్తానే"

విశ్వేశ్వరరావుకి ఏం జవాబు చెప్పాలో అర్థం కావడం లేదు. ఎందుకోవస్తే, ఏదో అయిందన్నట్టయిందాతని పని. వాతావరణం అతనికి కల్మషపూరితంగా కనపడింది.

"ఏమో. మీ మాటలు నాకేవీ అర్థం అవడం లేదు" అన్నాడు.

"అవును. అర్థంకావు. మనస్సులో, అట్టడుగునవున్న మాట పైకంటే అర్థంకాదు. కప్పిపుచ్చుకుని, కృత్రిమంగా మాట్లాడితే అందరికీ అర్థమవుతాయి. అలా మాట్లాడేవాళ్ళే ఆభిజాత్య సంపన్నులుగా చలామణీ అవుతారు. కళ్లల్లో పాపాల్ని తీయగలుగుతారు" సరళ కొంచెం ఉద్రేకంగా అంది.

విశ్వేశ్వరరావు గుండెలు వేగంగా కొట్టుకుంటూన్నై. అసలు సరళ దేన్ని గురించి మాట్లాడుతోందో తెలీడం లేదు. "అవును" అన్నాడు అప్రయత్నంగా.

"ఏవిటి అవును? మీరు అవునని ముద్రవేయకపోయినా అది అయేతీరుతుంది".

బుర్ర బద్దలు కొట్టుకున్నా విశ్వేశ్వరరావుకిది అర్థం కావడంలేదు.

"క్షమించండి! మీరు మనసులో ఏదో వుంచుకుని మాటాడుతున్నట్టుంది. కొంచెం భరించి చెబితే తెలుసుకుం టాను" అన్నాడు వినయంగా.

"ప్చ్.. ఇంకా వివరం కావాలా? అర్థం కాలేదూ? మిమ్మల్ని అనేంలాభం? మిమ్మల్ని తయారుచేసిన విద్యావిధానాన్ని, వాతావరణాన్నీ అనాలి" అంది నిట్టూరుస్తూ.

ఆ కొంచెం నిశ్శబ్దంలో విశ్వేశ్వరరావు ఘోరనరకాన్ని చూశాడు. సరళ యీమారు కొంచెం కటువుగా "జానకికి మీరు ఎంతకాలం నుంచీ వుత్తరాలు రాస్తున్నారో కొంచెం సెలవీయండి" అంది.

విశ్వేశ్వరరావు ప్రాణాలు అటకెక్కి పోతున్నై. "నేనా? క్షమించండి! జానకికి ఉత్తరాలు రాసేంత అవసరం నాక్కలగ లేదు. ఇక ముందు కలగదు. మీరు చాలా పొరపాటు పడుతున్నారు. ఏదో ఊహించుకుంటున్నారు" అన్నాడు చిక్కబట్టుకుని.

"అవును కనిపెట్టి వుండకపోవడం పొరపాటే, కాని, నిజం చెప్పండి? మీరు వుత్తరం రాసే అవసరం కలగలేదంటే మీభావం?"

"ఇందులో భావానికేముంది తావు?"

"ఏమీలేదా? చూడండి! కొందరిని విశ్వాసపాత్రులుగా నమ్మి మోసపోతాం. వాళ్ల హృదయాలు పైకి చాలా పరిశు భ్రంగా వుంటాయి. లోపలంతా కల్మషం. మంది బలహీనతను సాకుగా తీసుకుని ఆనందం పొందాలనే స్వార్థం. స్వార్థం కోసం ద్రోహం... ద్రోహంలో ఆనందం... విశ్వాసంలో కల్లోలం... ప్రతిఫలం జీవితాల్లో నరకం" సరళ ఉద్రేకంగా చెప్పుకుపోతోందేవిటో...

విశ్వేశ్వరరావుకీమారు ముఖం నిజంగా తెల్లబడింది. తననిగానీ, జానకినిగానీ సరళ కనిపెట్టిందనేభయం ఆక్రమించు కుని అతను కలవరపడు తున్నాడు. "మీ మాటల అంతరార్థం బోధపడ్డం లేదు నాకు" అన్నాడు.

"బోధపడే విజ్ఞానాన్ని మీకు మీ విద్య ప్రసాదిస్తేగద? ఇందాకటి నుంచీ మీరిచ్చిన ఉపన్యాసం మీకే వర్తిస్తుంది అక్షరాలా".

"నేనేంచేశానంటారిప్పుడు?" అన్నాడు విశ్వేశ్వరరావు చిరాకుగా.

"ఏమిటా? ఎదుటివాళ్ల బలహీనతని వాతావరణానికి గురిచేసి మీ అవసరాలు తీర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. లోకానుభవంలేని వాళ్ళని, అనుభవం నేర్పిన నీచాభిరుచులతో లోబరచుకోవడం చేశారు. బాధ్యతలూ, నియమాలూ గమనించకుండా ఆకాశాన్నందుకున్న దాని ముఖాన శాశ్వతంగా చీకటి పూయాలని వాంఛిస్తున్నారు.

జానకి జీవితాన్ని భవిష్యత్తుని ధ్వంసం చేయాలని వచ్చారు కాదూ?" సరళ కళ్లు నిప్పుల్లా మెరుస్తున్నై.

విశ్వేశ్వరరావు వూపిరి ఏదో చెట్టుకొమ్మకి తగులుకున్నట్టయింది. అయినప్పటికీ మగాడుగాబట్టి విపరీత ప్రయత్నంతో సర్దుకుని, గొంతు సవరించుకుని "మీరు మోపుతూన్న యీనేరం నాకు తెలియందీ, నే చేయందీను" అన్నాడు.

"ఋజువు కావాలంటారా యీ ప్రత్యక్ష చర్యకి?" గంభీరంగా అంది సరళ.

"కావాలని నేననను! కాని చూపిస్తే నమ్మకుండా వుండను" అన్నాడు తాపీగా.

"ఇవాళ మధ్యాహ్నం నౌకరి కుర్రాడిద్వారా జానకి మీకు పంపిన

పుత్తరం ఏవిటో నాకు తెలీదనుకున్నారా? మీరిద్దరూ నన్ను మోసం చేయగలుగు దురేమో గాని వాడు మోసం చేయడానికి సాహసించడు. వాడీ విద్య నేర్చుకోలే దింకా. అడగ్గానే ఇచ్చేశాడు. జానకిలో కలుగుతున్న యీ విపరీత పరిణామాలని కొన్నాళ్ళ నుంచీ గ్రహిస్తున్న నేను, ఇవాళే ఈ నాటకంలో అంతిమఘట్టం అయిపోవాలని పట్టుదలతో జానకిని సినిమాకు పంపి, తమతో ఈ విషయం మాట్లాడుదామని నిరీక్షిస్తున్నాను".

అంత భయంలోనూ ఈమాట వినగానే విశ్వేశ్వరరావుకి చికాకెత్తింది. "ఎదుటివాళ్ళ పుత్తరాల్ని అలా పరీక్షించడం విజ్ఞానవంతుల లక్షణమే ననుకుంటారా?" అన్నాడు.

"కాదు - కాని, నమ్మి స్నేహం చేసే ప్రాణమిత్రుడి చెల్లెల్ని, బలహీనతలు సాకుగా ద్రోహం చేయబోవడం మాత్రం విజ్ఞానమూర్తుల లక్షణం అవునా?" అంది.

కొరడా దెబ్బలాంటి ఆ మాటకి విశ్వేశ్వరరావు సగం చచ్చిపోయాడు. ఏ కొంచెమో మిగిలిపోయిన పౌరుషం అప్పుడే మేల్కొంటున్నది. సరళ ఎక్స్‌రే కళ్లు అతని ప్రతి భావాన్ని లాగేస్తున్నట్లనిపించింది.

"నేను జానకికి అన్యాయం చేయడానికే వచ్చానో, మందలించడానికే వచ్చానో మీరు తెలుసుకోకుండానే దూషించడం మంచిదికాదు" అన్నాడు.

"ఇందాకటి నుంచీ మీరు చేసే వ్యర్థ ప్రయత్నాలు అందుకు తోడ్పడవు. సరిగ్గా యిదే వేళకి రావడం అవసరం లేదు. చాలా మందలించే సద్బుద్ధి మీలో వుంటే ఎప్పుడో ఒకమారు సమయం చూసి బోధించేవాళ్లు. అయినా మీరీమాట హృదయపూర్వకంగా చెప్పండి. 'దైవసాక్షిగా నేను జానకిని మందలించడానికే వచ్చాను' అని అనేయండి. నేనీక్షణంలో మిమ్మల్ని క్షమాపణ వేడుకుని నా తప్పుకి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను" అంది సరళ ఆవేదనతో.

విశ్వేశ్వరరావులో ఇంకా మానవత్వం ఉంది. అతను కేవలం పశువు కాలేక పోయాడు! ఈమారు పూర్తిగా తను ఓడిపోయాననుకున్నాడు. దీనంగా ముఖం పెట్టి "క్షమించండి. ఇక మీతో నేను అబద్ధమాడలేదు. నా సంగతి అలావుంచి ఆలోచించండి. ఇందులో జానకి మీద ఆరోపించగల నేరమేమీ లేదా? కర్తృత్వమంతా నాదేనా?" అన్నాడు.

జానకి పసిపిల్ల. ఏళ్ళొచ్చాయి. చదువుకున్నది. కానీ, ఇందాక మీరన్నట్లు ఆ చదువు దాన్ని పరిసర వాతావరణ ప్రభావం నుంచి తప్పించి లోకానుభవం ఇవ్వలేకపోయింది. మనస్తత్వాలను విశదీకరించలేకపోయింది. బాధ్యత గల మీరు, మా కుటుంబానికి స్నేహితులైన మీరు, నిజాన్ని గమనించి జానకిని సరిదిద్దవలసి వున్నప్పటికీ ఇలా

**చాలా మందలించే సద్బుద్ధి మీలో వుంటే ఎప్పుడో ఒకమారు సమయం చూసి బోధించేవాళ్లు. అయినా మీరీమాట హృదయపూర్వకంగా చెప్పండి. 'దైవసాక్షిగా నేను జానకిని మందలించడానికే వచ్చాను' అని అనేయండి.**

దయచేశారు కాబట్టే మీ రెక్కువ పాలు అనుభవించాలి. జానకి స్వతహాగా బలహీనురాలు" సరళ చాలా సాఫీగా అంది.

విశ్వేశ్వరరావుకి మళ్ళీ ముంచు కొచ్చేంత ఆలోచన వచ్చేసింది. రెండు నిముషాల కాలం స్తంభించిపోయాడు. అతని కళ్ళవెంట జలజల నీళ్ల ప్రవహించ నారంభించాయి. రెండు చేతులు జోడించి "క్షమించండి! పొరపాటు జరిగింది. ఈ విషయం రాజాకి తెలిస్తే విపరీతమైన బాధ పడతాడు. జరిగిందాన్ని విస్మరించాలని నా ప్రార్థన" అన్నాడు.

సరళ కొంచెం పశ్చాత్తాపస్వరంతో, "విశ్వేశ్వరబాబూ! మీరు పసిపిల్లలు సుమండీ! హిప్నటైజ్ చేయబడ్డ వ్యక్తిలా ఇలా మీతప్పును మీరు ఒప్పుకునేటంత బలహీనులనీ, విశాల హృదయం వున్నదనీ నేను భావించలేదు. వజ్రం కాని మీ మనస్సుకి, మీస్నేహపు విలువలకీ నా కృతజ్ఞతలు. చూడండి! జానకి ప్రపంచజ్ఞానం లేని అవివాహిత, దాని భవిష్య జీవితానికి సంబంధించిన ఆలోచనా, బాధ్యతా నన్నిలా చేయమని ప్రబోధించాయి. ఇవాళే ఈ విషయం అరికట్టకుంటే ముందు ముందు ఇది గౌరవ ప్రతిష్టలు కలచివేసే సమస్య కావచ్చు. దీన్ని మీరు నా స్వార్థమనుకోండి ఇంకేదయినా అనుకోండి. కాని, నన్ను క్షమిస్తారని కోరుతున్నాను".

"అలా కోరవలసింది నేను. మీరు కాదు" అంటూ కుర్చీలోంచి లేచాడు విశ్వేశ్వరరావు. గట్టిగా ఒక నిట్టూర్పు విడిచి, "నమస్తే!" అంటూ తలవంచుకొని బయటపడ్డాడు. ఈ విచిత్ర వ్యక్తిత్వాన్ని గురించి సరళ కూడా ఎందుకో నిట్టూర్చకుండా లేకపోయింది.

ఇందుకా వెళ్ళేప్పుడూ విశ్వేశ్వరరావు హృదయం స్పందించింది. ఇప్పుడూ స్పందిస్తూనే వుంది. ఇందాకటిలా బుర్ర వేడెక్కే వుంది. ఇందాక ఎలా అదృశ్యశక్తి మెడ పట్టి జానకి యింటికి గెంటిందో, అంతకంటే బలమైన శక్తి ఇప్పుడతనిలో పనిచేస్తోంది.

'ప్రపంచాను భవంలేని శుష్క భావుకతకీ, జీవితాదరణకీ యెంత తేడా వుంటుందో జానకినీ, సరళనీ చూస్తే తెలుస్తుంది' అనుకుంటున్నాడు విశ్వేశ్వరరావు.

అతని మనస్సు పూర్తిగా అలసిపోయింది. ఆరు నెలలు జైలు చీకటి కొట్లో వుండి. సుప్రభాత సూర్యోదయాన్ని చూస్తున్న ఖైదీ కళ్ళలా అతనికళ్ల మూతలు పడుతున్నాయి. మనస్సు విశ్రాంతిని కోరుతోంది.

ఎక్కడా తనకు విశ్రాంతి? ఎటు తను వెళ్లుతూంట?

ఏదీతోచని స్థితిలో విశ్వేశ్వరరావు దగ్గరనే వున్న హోటల్లో ప్రవేశించి, ఓ మూలనకుర్చీలో అతుక్కుపోయాడు.

**("పరిసరాలు 2" కథా సంకలనం నుండి)**

వ్యాసం

# తెలుగు హరికథా వైభవం - సినిమా హరికథా గీతాల వైనం

**సాంప్రదాయిక కళారూపాన్ని సినిమా మాధ్యమంగా పరిచయం చేసిన వ్యాసం....**



వై.సత్యనారాయణ
93472 26379

హరి లీలలను వర్ణించి చెప్పే కళారూపమే హరికథ. ఆనాడు హరికథ ప్రజాదరణ పొందిన కళారూపం, కథను ప్రదర్శించే వారిని హరిదాసు, భాగవతార్ అని వ్యవహారం. హరిదాసే అన్ని పాత్రలలో (నటించి జీవించి, రసవత్తంగా 3 గంటలు కథను ప్రదర్శిస్తారు. చక్కగా మాట్లాడుతూ, మధురంగా పాడుతూ, ముఖంలో సాత్వికాభినయం ప్రదర్శిస్తూ, చేతులతో అంగికాభినయం చేస్తూ, కాళ్లతో నృత్యం చేస్తూ, ఆహార్యంతో అభినయిస్తారు హరిదాసు. ప్రేక్షకులకు విసుగు కలిగించకుండా హాస్య కథలతో, మధ్యలో హాస్య రసాన్ని పోషిస్తూ సమాజంలో దుర్మార్గాలను ఎత్తి చూపిస్తూ, భక్త జనరంజకంగా హరికథను గానం చేస్తారు.

హరిదాసు వేషధారణ సాధారణమైంది. చేతిలో చిరుతలు, కాలికి గజ్జెలు, పట్టు పంచకట్టు, పట్టు కండువా నడుముకు కట్టి, మెడలో ఒక పూలమాల ధరించి, నుదుట తిలకం దిద్దుకుంటారు. పౌరాణిక సంప్రదాయం ఇలా అలంకారంతో ఉన్న నారదుణ్ణి మొదటి హరిదాసుగా వ్యవహరిస్తారు. హరికథకుడు ప్రతిభతోనే ప్రేక్షకులను సంతోషపరుస్తారు. పురుష కళాకారులే కాక, స్త్రీలు కూడా అద్భుతంగా ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తున్నారు.

సినిమా, టీ.వి., అంతర్జాలం లేని రోజుల్లో పల్లెలలోని ప్రజానికానికి హరికథ, బుర్రకథలే కాలక్షేప సాధనం. గ్రామ పెద్దలు గణపతి, దసరా నవరాత్రులు, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి పర్వ దినాలలో హరికథ ఏర్పాటు చేసేవారు. ఆ రోజుల్లో రాత్రిపూట ప్రదర్శింపబడేది హరికథ. ఊరిలోని పెద్దబజారులోగాని, విశాల ఆవరణంలోగాని, గుడి ముందర గాని పందిరివేసి ఎత్తైన గద్దెపై గాని, స్టేజిపై కాంతివంతమైన పెట్రోమాక్సు లైట్లను అమర్చేవారు. ఆరుబైట ప్రేక్షకులు కూర్చొని చూసేవారు. ఈకథలు వరుసగా పదిహేను రోజులూ, నెల రోజుల వరకు కొనసాగుతాయి.

## హరికథ నేపథ్యం...

హరికథల స్వరూపం వేద కాలం నాటిదనీ, అంతా తెలిసిన మహర్షులు ఈ హరికథా రూపాన్నీ మొట్టమొదటగా సృష్టించారంటారు. నారదుడే భక్తి సూత్రాల'ను ఉపదేశిస్తూ హరికథా గానం చేశాడంటారు. నారదుడు " వేద విభజన చేసినా, అష్టాదశ పురాణాలను రచించినా మనశ్శాంతి లేదనిన వ్యాసున్ని భాగవతం రచించి హరికథామృతం పంచి మానవోద్ధరణ చేయమని" ఆదేశించారు.

నారద భక్తి సూత్రాలు హరికథ పుట్టుకకు మూలమని కొందరు, లవకుశుల రామాయణ పారాయణమే హరికథ అవతరణకు మూలమని మరి కొందరి భావన. యక్షగానమే హరికథగా రూపాంతరం చెందిందంటారు. హరికథ మూలమేదైనా తెలుగు ప్రాంతాలలో హరికథా కళారూపం ప్రదర్శనలు విభిన్నంగా నవరస సమ్మేళనంగా రాగాలను పలికిస్తున్నాయి. 'లవకుశ సినిమాలో కూడా లవకుశల చేత రామాయణ కథా గానం చేయబడింది.

17వ శతాబ్దంలో హరికథను మహారాష్ట్రలో 'అభంగ్' అని పిలిచేవారు. యక్షగానాలే హరికథలుగా రూపాంతరం చెందాయనే పండితుల అభిప్రాయాన్ని, పరిశోధకులు ఏకీభవించలేదు. యక్షగానానికి, హరికథకు మధ్య ఎన్నో తేడాలున్నాయనీ రెండూ వేరు వేరు ప్రక్రియలని అన్నారు. హరికథల్ని తమిళ, మళయాళ, కన్నడ భాషల్లో కాలక్షేపాలు' అంటారు.

## హరికథ అభిప్రాయాలు...

జమ్మలమడక మాధవరాయశర్మ "హరికథాగానము మూలం సామగానమే, దేవకథాకథనము లోకమున హరికథ నామముగా ప్రసిద్ధం" అని పేర్కొన్నారు. "హరిని కీర్తించుటయే హరికథ- 'క' బ్రహ్మం, 'థ' ఉండేది. దేని యందు బ్రహ్మ ఉండునో, దేని యందు బ్రహ్మం తెలియబడునో, దేని యందు బ్రహ్మాన్ని పొందునో అదే కథ. దీనిని గానం

వ్యాసం

చేయుటయే హరికథాగానము అని "తంగిరాల సుబ్రహ్మణ్యశాస్త్రి అభిప్రాయపడ్డారు.

ఆదిభట్ల నారాయణదాసు "ఆస్తిక్యమును, ధర్మాధర్మములను, సర్వజన మనోరంజకముగా నృత్యగీత వాద్యములతో నుపన్యసించుట హరికథ యనబరగును" అని పేర్కొన్నారు. తూమాటి దోణప్ప 'హరికథా సర్వస్వం'లో "హరికథా ప్రక్రియ ఇతర భారతీయ భాషలలో ఉంది. తమిళుల కథా కాలక్షేపం సంగీత ప్రధానమైంది. కన్నడ హరికథ ప్రవచనాభరితమైంది. మరాఠీ కీర్తనలు భక్తి ప్రధానమైనవి. కాని తెలుగు హరికథ భక్తి, సంగీతం, సాహిత్యం, అభినయాల మేలు కలయిక" అని వివరించారు. 1965 ఫిబ్రవరి 'నాట్యకళ సంచికలో' శుకదేవుడు, సౌనకాది మహర్షులు, సూతుడు హరికథా రూపమైన భాగవతాన్ని భారతదేశమంతా ప్రచారం చేశారని" పాతూరి ప్రసన్నం రాశారు.

**తెలుగు హరికథ(కు)లు...**

తెలుగులో మొట్టమొదటి హరికథ మునిపల్లె సుబ్రహ్మణ్యకవి రచించిన "ఆధ్యాత్మక రామాయణం" అని పరిశోధకుల అభిప్రాయం. ఆయన రచించిన 'ఆధ్యాత్మిక రామాయణ' సంకీర్తనలను హరికథలుగా చెప్పారు. యక్ష గానం నుంచి ఆధునిక రూపంగా మారిన ప్రక్రియ హరికథ. హరిదాసులు రామాయణం, భారతం, భాగవతం వంటి ఆధ్యాత్మిక సంబంధ కథలను హరికథలని చెప్తారు. గోగులపాటి కూర్మనాథకవి రచించిన 'మృత్యుంజయ విలాసం', ఓబయ్య 'గరుడాచల మహాత్మ్యం' యక్షగానాలు హరికథలు కావని పరిశోధకులు తెల్పారు.

ఆదిభట్ల నారాయణదాసు జానకీ శపథం, రుక్మిణీకల్యాణం, అంబరీష చరిత్ర, గజేంద్రమోక్షం, ప్రహ్లాదచరిత్ర వంటి హరికథలు రచించారు. సంస్కృతంలో 'శ్రీ కృష్ణ కథామృతమ్' హరికథ రాశారు.

**హరికథా ప్రచారం...**

హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసు హరికథా కళాకారులు, వాగ్గేయకారులు, సుప్రసిద్ధులు. గాత్ర సంగీతంలో, వీణా వాద్యంలోనూ నృత్య గీత వాదంలో విద్వాంసులు. "హరిదాసుల్లో ఆద్యుడు ఆదిభట్ల నారాయణదాసు భక్తి దేహం, భావం దేవుడు, రసజ్ఞత రూపంతన బ్రతుకంతా ఒక సుదీర్ఘ హరికథ" అని యస్వీ జోగారావు పేర్కొన్నారు. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి "నారాయణ దాసు పండితులలో పండితుడు. కవులలో కవి. గాయకులలో గాయకుడు. ఆశువులో అప్పటికప్పుడు చెప్పుటయే ఆయనకు అలవాటు" అని కొనియాడారు.

ఆదిభట్ల విజయనగరం జిల్లా అజ్జాడ గ్రామంలో 31 ఆగస్టు, 1864న జన్మించారు. కవితా రంగంలో కృషి చేస్తే ప్రముఖ కవిగా ఎదిగేవారు' హరికథకులు'గా స్థిరపడ్డారు. సంస్కృత, తెలుగు, ఆంగ్ల, అరబ్బీ, ఉర్దూ, పారశీక భాషలో ప్రావీణ్యం గల బహుభాషావేత్త. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషులో కవిత్వం రాశారు. యక్షగానాలు రచించారు. షేక్స్పియర్, కాళిదాసు రచనలను అనువాదం చేశారు. 'నా యెఱుక' అనే స్వీయ చరిత్ర ఆదర్శ జీవనాన్ని వివరిస్తుంది.

స్త్రీ పురుషులు ఇద్దరూ గజ్జెకట్టి మరాఠీ హరికథ కళారూపాన్ని మార్చి, కొత్తగా తెలుగులో హరికథా కళారూపాన్ని రూపొందించారు. నారాయణదాసు హరికథలలో చెప్పిన చమత్కారాలు,



**బరంపురం** జయంతి కామేశం 1888 లో విజయనగరం వేణుగోపాల స్వామి గుడిలో మొట్టమొదటగా ఆదిభట్ల నారాయణదాసు హరికథా కళారూపం ఏర్పాటు చేసి సన్మానించారు. మైసూర్, పిఠాపురం, వెంకటగిరి, ఏలూరు, విజయవాడ, బళ్ళారి, మద్రాసు వంటి సంస్థానాల్లో హరికథా గానం చేశారు. మైసూర్ లో ఆదిభట్ల చేసిన హరికథాగానాన్ని గురించి పత్రికలో చదివి ఆనందగజపతి మహారాజు ఆదిభట్ల నారాయణదాసును విజయనగర ఆస్థాన విద్వాంసునిగా నియమించారు.

కథలు ప్రచారంలో ఉన్నాయి. హరికథను ఎంతో ప్రసిద్ధ కళారూపంగా తీర్చిదిద్ది దానికి గౌరవాన్ని, విశిష్టతను చేకూర్చారు ఆదిభట్ల నారాయణదాసు.

ఆదిభట్ల హరిదాసుగారు తెలుగు సాంప్రదాయ పంచెకట్టు, నుదుటి బొట్టు, మెడలో దండ కూర్చారు. కోస్తా, ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల యాస భాషలతో ప్రత్యేకతను చాటారు. బరంపురం జయంతి కామేశం 1888లో విజయనగరం వేణుగోపాలస్వామి గుడిలో మొట్టమొదటగా ఆదిభట్ల నారాయణదాసు హరికథా కళారూపం ఏర్పాటు చేసి సన్మానించారు. మైసూర్, పిఠాపురం, వెంకటగిరి, ఏలూరు, విజయవాడ, బళ్ళారి, మద్రాసు వంటి సంస్థానాల్లో హరికథా గానం చేశారు. మైసూర్‌లో ఆదిభట్ల చేసిన హరికథాగానాన్ని గురించి పత్రికలో చదివి ఆనందగజపతి మహారాజు ఆదిభట్ల నారాయణదాసును విజయనగర ఆస్థాన విద్వాంసునిగా నియమించారు.

అంతేకాక 1919లో శ్రీ విజయ రామ గణపతి సంగీత పాఠశాలను స్థాపించి నారాయణదాసు ను ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ పాఠశాలలోనే ఘంటసాల, రాజేశ్వరరావు, సుశీల సంగీతాన్ని అభ్యసించారు. విజయ నగరంలో చొప్పెళ్ళ సూర్యనారాయణ, చేవూరి ఎరకయ్యదాసు, ఉమాచౌదరి, మంత్రి ప్రగడ లలితా కుమారి, రమాకుమారి, ఇందిరాబాల, వీరగంధం వేంకట సుబ్బారావు, కోట సచ్చిదానందం, అమ్ముల విశ్వనాథం, కడాలి వీరదాసు హరికథా కళాకారుల తయారు చేశారు.

### హరికథా ప్రభావం...

సాహితీ ప్రియులపై హరికథల ప్రభావం బలమైనది. ఆదిభట్ల నారాయణదాసు విషయంలో తెలిసిందే. ప్రముఖ కవిగా, సినీ గీత రచయితగా పేరు పొందిన డా.సి.నారాయణరెడ్డి చిన్నతనం నుంచి హరికథలు విని కవిగా రూపొందారు. హరికథల్లోని గీతాలు పాడుకుంటూ కొత్త మాటలలో పాటలు అల్లుకున్నారు.

**నిర్మాతల ఆదరణ, సంగీత దర్శకుల అభిరుచి, నటుల అభినయం, రచయితల రచనా పటిమ వలన దర్శకులు హరికథ లను గీతాలుగా ప్రవేశ పెట్టారు. చిత్రం సన్నివేశాలు, నేపథ్యాలు గీతాలకు ప్రజాదరణ తెచ్చాయి. హరికథల్లో కీర్తనలతో పాటు వివిధ స్థాయిల్లో రాగాత్మకంగా వినిపించే వచనాలు, వచన కీర్తన సమ్మిశ్రితమైన సంవిధానం ఉంటుంది. మధ్య మధ్యలో కొన్ని పాడి మాటలు ఉంటాయి.**

'పాటలో ఏముంది నా మాటలో ఏముంది' స్వీయ సినీ గీత చరిత్రలో "వేములవాడలో ప్రదర్శితమయ్యే హరికథలు వేములవాడ నుంచి మా ఊరు హనుమాజీపేటకు దేవీ నవరాత్రుల్లో హరి కథలు చెప్పే ఉత్తమ శ్రేణి హరికథకులు నాలోని శ్రుతులను రాగాలుగా, రాగాలను గీతాలుగా ఎగరేశాను. ఆ రోజుల్లో పల్లె పాటలు, వీధి భాగోతాలు నన్ను ఎంతగా కదం తొక్కించాయో, హరికథలు అంతగా నన్ను కదిలించాయి" అని డా.సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. యాభైయో జన్మదినోత్సవం వేడుక సందర్భంగా సి. నారాయణరెడ్డి హరికథలకు కృతజ్ఞతగా....

*"నీ యవ్వా అరె అంటూ, నీల్గె నా గొంతుకలో*

*కవితలు స్వరపరచిన, హరికథలకు ఈ సన్మానం"*

ఈ గేయం రాసుకున్నారు. సినీ గీత రచయితగా డా. సి. నారాయణరెడ్డి కొన్ని సినిమాలలో హరికథా గీతాలను రాశారు.

### చలనచిత్ర హరికథా గీతాల ప్రస్తావన...

తెలుగు సినిమా రంగంలోకి నాటక, మిమిక్రీ కళాకారులు, అలాగే జానపద, హరికథ వంటి కళారూపాలు సినిమాలోకి ప్రవేశించాయి. మనోరంజక కళారూపం హరికథ. నిర్మాతల ఆదరణ, సంగీత దర్శకుల అభిరుచి, నటుల అభినయం, రచయితల రచనా పటిమ వలన దర్శకులు హరికథలను గీతాలుగా ప్రవేశ పెట్టారు. చిత్రం, సన్నివేశాలు, నేపథ్యాలు గీతాలకు ప్రజాదరణ తెచ్చాయి. హరికథల్లో కీర్తనలతో పాటు వివిధ స్థాయిల్లో రాగాత్మకంగా వినిపించే వచనాలు, వచన కీర్తన సమ్మిశ్రితమైన సంవిధానం ఉంటుంది. మధ్య మధ్యలో కొన్ని పాడి మాటలు ఉంటాయి. 3 గంటలు ప్రదర్శితమయ్యే హరికథను 5 నిమిషాలలో గీతంగా ప్రదర్శించేవారు. ఆనాటి సినిమాలో హాస్య నటులపై క్యారెక్టర్ నటులపై గీతాల చిత్రీకరణ ఉండేది. ఇలాంటి వైవిధ్య గీతాలు చిత్రీకరించబడ్డాయి.

### ప్రసిద్ధ హరికథా గీతాలు...

విజయాసంస్థ నిర్మించిన 'షావుకారు' చిత్రానికి ఎల్.వి. ప్రసాద్ దర్శకులు . ఈ సినిమా 1950 లో విడుదలైంది. చిత్రంలో (షావుకారు జానకి, ఎన్.టి. రామారావు నాయిక నాయకులు. 'శిభి చక్రవర్తి' కథను హరికథా గీతం సముద్రాల (సీనియర్) రాఘవాచార్య రచించారు. మోపర్రుదాసు ఈ గీతంలో అభినయించారు.

*"శ్రీలుచెలంగే భారత భూమిన*
*పాలించిన భూపాలులలో*
*హృషి నగరంబు శిబి రాజేంద్రుడు"*

అంటూ ఘంటసాల స్వీయ సంగీతం గానం చేశారు. మధ్యలో మోపర్రుదాసు వ్యాఖ్య ఉంది. హరిదాసులే హరికథా గీతాలలో నటించడం, నృత్య గీతాలలో నృత్యం వచ్చిన తారలే నటించేవారు.

శిభి చక్రవర్తి దానగుణాన్ని వివరిస్తూ, ఆ రాజ్యంలో పిసినారి నారాయణ శెట్టి ధనవంతునికి సంబంధించిన చిన్నకథను వివరిస్తూ శ్రోతలను నవ్విస్తారు. సత్యనారాయణ వ్రతం చేయటానికి కొబ్బరి కాయ కొనటానికి వెళ్లి కొనక, కొబ్బరిచెట్టు ఎక్కి తెంపుకోబోయి ప్రాణం

మీదికి తెచ్చుకుంటాడు. ఈ కథాగానం సినిమా పేరుకు తగినట్లుగా ప్రదర్శింపబడింది.

'కుచేలోపాఖ్యానం' హరికథ గీతం 'శ్రీకృష్ణమాయ' చిత్రంలో ఉంది. శ్రీరాజ రాజేశ్వరీ ఫిల్మ్ కంపెనీ నిర్మించిన ఈ చిత్రం 1958లో విడుదలైంది. సి.ఎస్.రావు దర్శకత్వం వహించాడు. ఈ గీతం ఘంటసాల గానం చేశారు. టి.వి. రాజు సంగీత దర్శకులు. ఈ గీతాన్ని వారణాసి సీతారామ శాస్త్రి రచించారు. ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు, జమున ప్రధాన పాత్రలు. ఈ సినిమాలో హరిదాసుగా ఎఎన్ఆర్ అభినయించడం విశేషం.

"కలడు కుచేలండను
విప్రోత్తముడొకడు
వాని కలిగెను చింత కూర్చుసంతానము"

శ్రీకృష్ణుని, కుచేలుని స్నేహానికి 'కుచేలోపాఖ్యానం' ప్రసిద్ధి. ఇంట్లోని దారిద్ర్యం పొగొట్టుకోవడానికి కుచేలుణ్ణి ద్వారకకు వెళ్లి శ్రీకృష్ణున్ని దర్శించి రండని భార్య చెప్పగా వెళ్తాడు. కుచేలున్ని ఆదరించి అతిథి సత్కారం చేస్తాడు కృష్ణుడు. కుచేలుడు తెచ్చిన అటుకులు తింటాడు. కుచేలుడు ఇంటికి తిరిగి వెళ్లగా దారిద్ర్యం తొలగిపోతుంది. వ్యవహారంలోని హరికథ వలె సినిమాలోని

> **జగ్గయ్య, జమున, జయంతి ప్రధాన తారాగణం. దీనిలో సి.నారాయణరెడ్డి 'కుచేలోపాఖ్యానం' హాస్య హరికథా రచించారు. ఈ హరికథా గీతం గురించి " చిన్ననాటి అనుభవం ఈ హరికథా రచనకు నాకు ప్రేరకమైతే, కన్నతండ్రి నుంచి సంక్రమించిన గుణం కూడా కారణమైంది. బాల సుబ్రహ్మణ్యం ఇతర గాయకులతో కలిసి సమర్థంగా గానం చేసారు.**



గీతంలో సాగి పోతుంది.

ఆచార్య ఆత్రేయ గీత, కథా, మాటల రచయితగా ప్రసిద్ధులు, ఆయన 1961లో నిర్మించి, దర్శకత్వం వహించిన చిత్రం 'వాగ్దానం'. అక్కినేని నాగేశ్వరావు, కృష్ణకుమారి, చలం, రేలంగి, సూర్యకాంతం, పద్మనాభం నటించారు, ఆత్రేయ గీత రచయితయై ఉండి ఈ చిత్రంలో శ్రీశ్రీ, దాశరథి చేత పాటలు రాయించడం విశేషం.

"శ్రీ నగజా తనయం సహృదయం
చింతయామి సదయం
త్రిజగన్మహెరీదయం"

"అంటూ 'సీతాస్వయంవరం' గీతం శ్రీశ్రీ రాశారు. పెండ్యాల నాగేశ్వరరావు సంగీతం చేశారు. ఘంటసాల గాత్రంలో రేలంగి నరసింహారావు అభినయంలో హరికథ అంటే ఇలా ఉండాలి అని పిస్తుంది. సూర్యకాంతం, పద్మనాభం వేదికపై వాద్య సహకారం అందించారు. సీతా స్వయంవరానికి ఎంతో మంది రాజులు వచ్చారు. సీతాదేవి రాజులను ఓరకంటితో చూస్తుంది. శ్రీరాముడు శివ ధనస్సు ఎత్తి ఎక్కు పెడుతాడు.

"ఫెళ్ళుమనె విల్లు - గంటలు
ఘల్లుమనె - గు
భిల్లుమనె గుండె నృపులకు -ఝల్లు
మనియె
జానకీ దేహ మొక
నిముషమ్మునందే
నయము జయమును భయము
విస్మయము గదుర"

అంటూ కరుణశ్రీ పద్యం కూడా ఉండటం విశేషం. ఈ హరికథ ప్రదర్శించుతుండగా దారిన రిక్షాలో కృష్ణకుమారి, చలం వెళ్తుంటారు. ఆ రిక్షా ఒక గొయ్యిలో ఇరుక్కొని కదలదు. ఆ దారిన వెళ్తున్న నాగేశ్వరావు వచ్చి పైకి ఎత్తుతాడు. ఈ సంఘటనను హరికథకు ప్రతీకగా చూపించారు. కథ వినటానికి వచ్చినవారు నిద్రపోవటం సహజం. భక్తులు నిద్రావస్థలో ఉన్నట్లు ఉన్నారని కథా ముగింపులో హాస్య సంభాషణతో మేలు కొలుపుతాడు. సహజ రీతిలో ప్రదర్శించబడిన గీతం ఇది.

## హాస్య హరికథా గీతాలు...

'కలెక్టర్ జానకి' చిత్రానికి ఎస్.ఎస్. బాలన్ నిర్మాత, దర్శకులు. ఈ చిత్రం 1972లో విడుదలైంది. జగ్గయ్య, జమున, జయంతి ప్రధాన తారాగణం. దీనిలో సి.నారాయణరెడ్డి 'కుచేలో పాఖ్యానం' హాస్య హరికథ రచించారు. ఈ హరికథా గీతం గురించి "చిన్ననాటి అనుభవం ఈ హరికథా రచనకు నాకు ప్రేరకమైతే, కన్నతండ్రి నుంచి సంక్రమించిన గుణం కూడా కారణమైంది. బాల సుబ్రహ్మణ్యం ఇతర గాయకులతో కలిసి సమర్థంగా గానం చేసారు.

"సీటు రావాలన్నా ఓటు కావాలన్నా
దాటముగా బస్సు రూటు కావాలన్నా
పర్మిట్లు రావాలన్నా ప్రమోషన్లు
కావాలన్నా,
ఎవ్వరో ఒర పెద్దవారిని ఆశ్రయించి
ఆదరణ పొందవలె'

సామాజిక సమస్యలో ఆ సమస్య ఒకటి. దీని అరికట్టాలంటే 'కుటుంబ నియంత్రులు' అవసరం, కలెక్టర్ కార్యాలయంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో కుటుంబ నియంత్రణకు కుచేలోపాఖ్యానికి ముడిపెట్టి హాస్య ధోరణిలో గీతం సాగుతుంది.

వ్యాసం

అధిక సంతానాన్ని కుచేల సంతానం అంటారు. కుచేలుడు ఏనాడు కుటుంబ నియంత్రణ పాటించలేదు. అతనికి సంపద రావాలి. కుచేలుని అటుకులు తిని సంపదలు ఇచ్చాడు. శ్రీకృష్ణుడు, పెద్దవారి దగ్గరికి వెళ్లినపుడు ఏదైనా పని జరగాలంటే లంచం కావాలని తెలియపరుస్తుంది, 1970లో విడుదలైన 'ఇంటింటి రామాయణం' ఎస్.కృష్ణంరాజు నిర్మాత, పి. సాంబశివరావు దర్శకులు. ఈ సినిమాలో రంగనాథ్, ప్రభ, చంద్రమోహన్, జయసుధ నాయక, నాయికలుగా నటించారు. చిత్రంలో హాస్యభరితమైన 'రామదాసు - దేవదాసు' హరికథను ఎం.వి.ఎల్., కొంపెల్ల శివరాం రచించారు. రాజన్ - నాగేంద్ర సంగీతం సమకూర్చారు. ఈ గీతాన్ని చిత్రంలో హాస్యనటుడు నూతన ప్రసాద్ తాగిన మత్తుతో గమ్మత్తుగా అభినయించారు. దీనిని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అదే తీరులో గానం చేశారు. ఈ గీతంలో పేరడి పంక్తులు ఉంటాయి.

"జగమే మాయ బతుకే మాయ
వేదాలలో 'సారమింతేనయా"

రాముని గుడి కట్టించి కాసులు లేక భక్తికి బానిసై రామదాసు అయితాడు. పార్వతి దక్క తాగుడుకు బానిసై దేవదాసు మారుతాడు. భక్తికైన, తాగుడుకైన పరిమితి ఉండాలంటాడు. వైవిధ్యంగా రామదాసులోని గుణాలను దేవదాసులోని లక్షణాలను వ్యంగ్యంగా వ్యక్తమవుతాయి ఈ గీతంలో.

## వైవిధ్య హరికథా గీతాలు...

శ్యామ్ ప్రసాద్ ఆర్ట్స్ మాగంటి రవీంద్రనాథ్ చౌదరి నిర్మించిన 'మహానగరంలో మాయగాడు' చిత్రం 1984లో విడుదలైంది. విజయ బాపినీడు దర్శకత్వం వహించాడు. ఆచార్య ఆత్రేయ ఈ గీతం రచించాడు. ఈ చిత్రంలో చిరంజీవి, విజయశాంతి ప్రధాన పాత్రలు. అమరేశుడనే రాజు ఇతివృత్తాన్ని తీసుకొని ప్రదర్శించిన హరికథ. బాలసుబ్రహ్మణ్యం గానం. చెల్లపిళ్ల సత్యం సంగీత దర్శకులు. ఈ హరికథా గీతంలో చిరంజీవి అభినయించారు.

"ఇది హరికథ కాదు సిరి కథ.
అష్టలక్ష్ములలో ధైర్యలక్ష్మీ ప్రధానమైంది"

అమరేశుడు అనే రాజును పరీక్షించ డానికి దేవతలు శనిని పంపుతారు. శనికి అష్టలక్ష్ములలో ఒక్కొక్క లక్ష్మిని దానం చేస్తాడు. వారితో ధైర్యలక్ష్మి వెళ్లపోబోతుంది. ఆ రాజు ధైర్యలక్ష్మి కావాలని స్తుతిస్తాడు. శని వెంట ధైర్యలక్ష్మి వెళ్లదు. ఆ ధైర్యలక్ష్మి ఉన్న చోటనే అందరు లక్ష్ములము ఉంటామని వస్తారు. ధైర్యమే ధనలక్ష్మి అని పెద్దల మాట. ఏ సంపద లేకపోయినా ధైర్యం ఉండాలని ఈ హరికథ చెప్పుతుంది. హరికథా గానం

> **శనికి అష్టలక్ష్ములలో ఒక్కొక్క లక్ష్మిని దానం చేస్తాడు. వారితో ధైర్యలక్ష్మి వెళ్లపోబోతుంది. ఆ రాజు ధైర్యలక్ష్మి కావాలని స్తుతిస్తాడు. శని వెంట ధైర్యలక్ష్మి వెళ్లదు. ఆ ధైర్యలక్ష్మి ఉన్న చోటనే అందరు లక్ష్ములము ఉంటామని వస్తారు. ధైర్యమే ధనలక్ష్మి అని పెద్దల మాట. ఏ సంపద లేకపోయినా ధైర్యం ఉండాలని ఈ హరికథ చెప్పుతుంది . హరికథా గానం సాగుతుండగానే చిత్రంలోని పాత్రల చిత్రణ ప్రదర్శింపబడుతుంది.**

సాగుతుండగానే చిత్రంలోని పాత్రల చిత్రణ ప్రదర్శింపబడుతుంది.

ఏడిద నాగేశ్వరరావు నిర్మించిన 'స్వాతిముత్యం' కళాత్మక చిత్రానికి దర్శకులు కె.విశ్వనాథ్, ఈ చిత్రం 1985 లో విడుదలైంది. కమలహాసన్, రాధిక నాయక నాయికలుగా నటించారు. సి.నారాయణరెడ్డి 'కలెక్టర్ జానకి' చిత్రంలో హాస్య ధోరణిలో రాస్తే ఈ సినిమాలో 'సీతా స్వయవరం' ఘట్టంతో హరికథను జానపద బాణీలో రాశాడు. ఇళయరాజా సంగీత దర్శకులు, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంగానం చేశారు.

"రామ కనవేమిరా
శ్రీరఘురామ కనవేమిరా"

హరికథా గీతం వేదికపై హరిదాసు చేత ప్రారంభమవుతుంది. హరికథా వినటానికి నాయిక నాయకులు రాధిక, కమలహాసన్ వెళ్లారు. ఈ గీతం మధ్యలో కమలహాసన్ అభినయిస్తాడు. హరి కథ సీతాస్వయంవరం' కాని సినిమాలో శ్రీరామ కళ్యాణం చిత్రీకరించబడింది. కళ్యాణంలో పూజారి అందరికి చూపెట్టడానికి తెచ్చిన తాళిని కమలహాసన్ అందుకొని రాధిక మెడలో కట్టగా ఆశ్చర్యపోతారు. తోడులేని ఆమెకు తోడు అవుతాడు. ఈ గీతం సినిమాను మలుపు తిప్పుతుంది. ఈ గీతం ఎంతో ప్రజాదరణ పొందింది. శ్రీరామనవమి వేడుకల్లో, ప్రతి గుడిలోనూ వినిపిస్తుంది. హరి కథ గీతాన్ని వైవిధ్యంగా చిత్రీకరించారు దర్శకులు కె.విశ్వనాథ్.

సుదర్శన్ సినీ ఎంటర్ ప్రైజస్ 'సూత్రధారులు' చిత్రం 1990లో నిర్మించింది. ఈ కళాత్మక చిత్రానికి కె.విశ్వనాథ్ దర్శకులు. అక్కినేని నాగేశ్వరావు, మురళీమోహన్ గంగిరెడ్డుల కళాకారులు నటించారు. అంతేకాక హరికథ కళారూపంపై మక్కువతో దర్శకులు ఈ చిత్రంలో కె.ఆర్. విజయ కోసం హరికథా కళాకారిణి పాత్రను సృష్టించడం విశేషం. ఈ సినిమాలో 'రుక్మిణీ కళ్యాణం' హరికథ గీతంలో అభినయించారు. పి.సుశీల కె.వి.మహదేవన్ సంగీతంలో గానం చేశారు.

"శ్రీరస్తు శుభమస్తు సత్కాకథా
లహరికి హరికి సిరికి హరికి"

ఈ గీతం మొదట్లో ఆదిభట్ల నారాయణదాసును స్తుతించడం హరికథ ప్రత్యేకతను వెల్లడి చేస్తుంది. గ్రామాధికారి భార్య ఆసక్తితో హరికథా కాలక్షేపం ఏర్పాటు చేయిస్తుంది. ఈ సినిమాలోని నాయిక నాయకులు భానుచందర్, రమ్యకృష్ణల బాల్య రూపాలపై ఈ గీతం చిత్రించబడుతుంది. రుక్మిణి సోదరులు రుక్మిణిని శిశుపాలునికి ఇచ్చి వివాహం చేయాలనుకుంటారు. రుక్మిణి కోరుకున్న

వ్యాసం

శ్రీకృష్ణుడిని వివాహం చేసుకోవడానికి అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణున్ని అతని వద్దకు పంపుతుంది. ఆయన వచ్చి రుక్మిణిని రాక్షస పద్ధతిలో ద్వారకకు తీసుకెళ్లి వివాహం చేసుకుంటారు.

1993లో విడుదలైన 'అల్లరి అల్లుడు'కి ఎ. కోదండ రామిరెడ్డి దర్శకులు. నిర్మాత టి. శివ ప్రసాదరెడ్డి. ఎం.ఎం.కీరవాణి బాణీ, బాలసుబ్రహ్మణ్యం, చిత్ర గానం చేశారు.

"మచిలీపట్నం మాయబజార్
మాట్నీ కోస్తే మాటేశా
చెన్న పట్నం చైనాబజార్
షాపింగ్ కోస్తే సైటేశా"

వేటూరి సుందరరామమూర్తి ఈ హరికథ గీతం రచించాడు. అత్తను అల్లుడు స్తుతించడం ఈ గీతంలో వినిపిస్తుంది. మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. అక్కినేని నాగార్జునతో స్టెప్పు వేస్తూ వాణిశ్రీ, మీనా అభినయిస్తూ వారి నటనా జీవితాన్ని నెమరు వేసుకున్నారు.

సినిమా, నాటకం ప్రాచుర్యంలోకి రాక ముందు గ్రామాల్లో ఇతర జానపద కళారూపాలతో పాటు ఎక్కువ ప్రజాదరణను పొందిన కళారూపాల్లో హరికథ ప్రధానమైనది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ నానాటికి కొత్త రూపం సంతరించుకున్న కళారూపం హరికథ. ఇప్పటికి యువ కళాకారులు, కళాకారిణిలు వస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హరికథా కళాకారులను ప్రోత్సహిస్తుంది. సినిమాలో 1950న ప్రారంభమైన హరికథా గీతం ప్రస్థానం 1993 వరకు కొనసాగింది. ఆ తర్వాత ఇలాంటి గీతాలు సినిమాలో రాలేదు. చిత్రాలలో ఇటువంటి వైవిధ్య గీతాలు రావలని ఆశిద్దాం.

కవిత

# మ్రోగిస్తాం విజయ దుందుభి!

రంగు చక్రపాణి, 9199079800

మనం విజయ దుందిభి మ్రోగిస్తాం
మనం విజయ దుందిభి మ్రోగిస్తాం
ఏదో ఒక దినం
ఓహెూ, ఓహెూ మనస్సులో ఉంది విశ్వాసం
ఉంది విశ్వాసం.. పూర్ణ విశ్వాసం (మ.వి.దు.మ్రో.)

మనం నలుదిశల శాంతి బావుటాల నెగరేస్తాం
మనం నలుదిశల శాంతి బావుటాల నెగరేస్తాం!
అందరి మనస్సులు రంజింపజేస్తాం.
అందరి మనస్సుల రంజింపజేస్తాం. (మ.వి.దు.మ్రో.)

మనం నడుస్తాం కలిసికట్టుగా కలుపుతూ భుజం భుజం
మనము నడుస్తాం కలిసికట్టుగా కలుపుతూ భుజం భుజం
ముందుకు సాగుతాం వేస్తూ అంగలు గజం గజం.
ముందుకు సాగుతాం వేస్తూ అంగలు గజం గజం. (మ.వి.దు.మ్రో.)

మనకులేదు మనస్సులో ఎలాంటి భీతి- భయం-
మనకు లేదు మనస్సులో ఎలాంటి భీతి- భయం-
ఎదుర్కొంటాం ధైర్య స్థైర్యంతో జీవితానెదురయ్యే కష్టం నష్టం! (మ.వి.దు.మ్రో.)

**(గిరిజా కుమార్ మాథుర్, ఉర్దూ కవితకు తెలుగు అనువాదం)**

# చుక్క పొడిచింది

**చదువు కోసం పసితనం పడే ఆరాటం....**



సిరి
9963084338

"ప్లీజ్ సార్, ఒకసారి ఆలోచించండి. మా పరిస్థితి బాలే. ఇప్పుడు మీరు నా సర్టిఫికేట్లు ఇయ్యకుంటే నర్సింగ్ కాలేజీలో సీట్ పోద్ది. ఇంట్ల మంచిగైనాక నేనే తెచ్చిస్తా."

"లేదు బిడ్డా అందరూ ఇట్లనే అంటే ఇక మేము కాలేజీ ఎట్ల నడపాలే? స్టాఫ్‌కి జీతాలు ఇయ్యాలె కదా. బ్యాలెన్సు ఫీజు కట్టి తీస్కపో తల్లి సర్టిఫికేట్లు."

తిరుమల రెండ్నెల్ల బట్టి అడుగుతోంది కాలేజీలో సర్టిఫికేట్ల కోసం. తను పని చేసే ఫ్యాక్టరీలో లంచ్ టైం కాంగనే కాలేజీకి ఉరికేది, వాళ్ళతో లేదని చెప్పించుకునేది అలవాటైపోయింది. రోజురోజుకి ఆశ లేకుండా పోయింది. భుజం మీద నుండి నేల జారుతున్న చున్నీ ఈడ్చుకుంటూ కాలేజీ గ్రౌండ్ వైపు నడిచింది. నాపరాళ్లతో కట్టిన చిన్న బెంచ్ మీద కూర్చుంది. అక్కడ కూర్చోవడం తనకి ఇష్టం. రేణుక ఆడనే పరిచయం అయ్యింది. ఆడనే అమ్మ ఇచ్చిన జొన్న రొట్టెలు, రేణుక తెచ్చిన పెరుగన్నం, తొక్కు, సొట్ట పడిన స్టీలు డబ్బాల మూతల్లో వేసి పంచుకునే వాళ్ళు. డబ్బా మార్చాలి అనుకుంటూనే రెండేళ్ళు నెట్టుకొచ్చేశారు. ఆ రెండేళ్లలో ఒకసారి బగారా అన్నం తెస్తే, "ఏందే మీ ఇంట్ల దావత్ ఆ ఏంది? ఇయ్యాల బగారా తెచ్చినవ్, పెండ్లినా?" అని డబ్బా లాక్కుంటూ అడిగింది రేణుక.

"ఏ ఊకో పెండ్లేంది? నేను సదువుకుంటా. నర్సు అయితనే. బి. తిరుమల, హెడ్ నర్స్" అని గట్టిగా అరిచి, చేతుల్లో మొహం దాచుకుని నవ్వుకుంది.

రిజల్ట్స్ వచ్చాయి. ఇంటర్ రెండో సంవత్సరంలో కాలేజీలో మూడవ ర్యాంక్ సాధించింది. ఇంటికి వెళ్ళి చెప్పగానే తల్లి దిష్టి తీసి తెగ మురుసుకుంది.

"అయిపోయిందానే నీ చదువు?" అని అడిగింది తల్లి.

"అప్పుడే యాడ? నర్సింగ్ కాలేజీకి పోవాల. ఆడ చదవాల" అంది.

"అన్ని పైసల్ మన కాడ యాడనే? తిన్నీకి తక్కెడు నూకలు సక్కంగా ఉండవ్ ఇంట్ల, యాసాలు సూడు" అని గొణిగింది తల్లి.

"ఏహే. సదువుతా అంటే పైసల్ ఫికర్ పెట్టావేంది? బిడ్డని నేను సదివిస్తా" అని తండ్రి అన్న మాటలకు ధైర్యం వచ్చింది తిరుమలకి. తండ్రి ఇచ్చే ధైర్యం ముంగట బిడ్డకి ఇంకేం ఉంటది?

ఇంతలో తను కూర్చున్న బెంచ్ పక్కన అలికిడికి ఆలోచనల నుండి బయటపడి పక్కకి చూసింది. వచ్చింది తన క్లాస్ మేట్ ప్రతాప్. అతగాడు తనని క్లాసులో, ఇంటికి వెళ్లే దారిలో చూడటం గమనించింది. దగ్గరకి వచ్చి అతను మాట్లాడింది లేదు, తను వెళ్లి పలకరించింది లేదు. దూరం నుండి చూపులతోనే బాగున్నావా అంటే బాగున్నావా అన్నట్టు ఉండేవారు ఇద్దరూ. ఏంటో మీ ఇద్దరి 'ముకుంద' సినిమా ఇక్కడ అని నవ్వేది రేణుక. ఇప్పుడు కూడా వచ్చి మౌనంగా తన పక్కన నుంచున్నాడు. అతని చేతిలో కాలేజీ మ్యాగజైన్ ఉంది. అది అచ్చయినప్పుడు దాని కవర్ మీద ర్యాంకులు సాధించిన వారి ఫోటోలు వేశారు. తన ఫోటో కూడా ఉందని తెలిసి ఆనందం పట్టలేక మ్యాగజైన్‌ని గట్టిగా రెండు చేతులతో కౌగలించుకుని ఇంటికి పరిగెత్తింది.

అతని చేతి నుండి ఆ మ్యాగజైన్ తీసుకుంది. దాని మీదున్న ఫోటోని చూస్తూ తన కలల పరుగు ఆగిపోయిందని ఏడ్చేసింది. ఎవరైనా చూస్తారా, ఏమైనా అనుకుంటారా అని లేకుండా ఏడ్చేసింది. ప్రతాప్ పక్కనే నిలబడి చూస్తున్నాడు. బాధలో ఉన్నప్పుడు ఒక మనిషి పక్క నుండి మౌనంగా ఓదార్చితే ఎంత బాగుంటుంది!

మూడవ ర్యాంక్ హోల్డర్గా కాలేజీ మ్యాగజైన్ కవర్‌పై బొమ్మ పడటం నుండి ఇప్పుడు ఒక డ్రై ఫ్రూట్స్ ప్యాకింగ్ ఫ్యాక్టరీలో రోజు కూలీగా, కేవలం రెండు నెలల్లో ఆమె జీవితం ఇలా టర్న్ ఎందుకు తీసుకుంది?

★ ★ ★

కథ

మూడు నెలల క్రితం.

దమ్మాయిగూడ. హైదరాబాద్.

"ఓ యాదీ మీ ఆయనకు పనిలో ఆక్సిడెంట్ అయ్యిందంటనే. దవాఖానాకు తోల్కపోతుండ్రు ఉరుకు ఉరుకు."

"వామ్మో. నా సావుకి వచ్చింది" అని పరుగులు పెట్టింది తిరుమల తల్లి.

"ట్రాక్టర్ కింద పడటం వల్ల కాలు బాగా చితికిపోయింది. మనిషి నడుస్తాడో లేదో ఇప్పుడే చెప్పలేం" అన్నాడు డాక్టర్. అక్కడ తీయని ఎక్సరే లేదు, గుచ్చని సూది లేదు. తినడానికి లేని రోజు కారం బువ్వ తినే శరీరం ఆ మందులకి ఎంతని సహకరిస్తుంది? మనిషి బక్క చిక్కి సగం అయ్యాడు. ఆ బాధలో కూడా అక్కడ నర్సుని చూడగానే తిరుమలకి ఏదో ఉత్సాహం. నర్సు యూనిఫారం, బ్యాడ్జి, డాక్టర్‌తో మాటలు, సూది వేయడం. ఇవే గమనిస్తూ కూర్చునేది. ఒకటి రెండు సార్లు ప్రతాప్ దవాఖానా గేటు దగ్గర కనపడ్డాడు. మళ్ళీ అవే చూపులు. ధైర్యాన్ని ఇచ్చే చూపులు.

నెల రోజులు తర్వాత ఇంటికి వచ్చాడు తిరుమల తండ్రి. పూర్తిగా తేరుకోలేదు. సొంతగా కాలు కదపలేడు, సాయం లేకుండా నడవలేడు.

మంది యెక్కువయితే మజ్జిగ పలచన. ఆదాయం తగ్గితే ఆశలు పలచన. "ఎట్లరా దేవుడా? మొత్తం ఆగమైయ్యింది? ఈ కరోనాకి పనులే దొరుకుతల్లేవ్. ఉన్నది కాస్త ఇట్ల అయ్యే. నేను పనికి గిట్ల పోదామంటే మీ బాపుకి అన్నీ పలంగి కాడకి ఇవ్వాలె" అనుకుంటూ తల బాదుకుంది తిరుమల వాళ్ళ అమ్మ.

"ఎందుకే పరేషానీ? నేను పోతున్నా కద పనికి. నేనే ఇంకో నాలుగు గంటలు ఎగస్ట్రా చేస్తలేవే"

ఇద్దరు కలిసి తెస్తేనే గడిచే ఇల్లు,

**అక్కడ** తీయని ఎక్సరే లేదు, గుచ్చని సూది లేదు. తినడానికి లేని రోజు కారం బువ్వ తినే శరీరం ఆ మందులకి ఎంతని సహకరిస్తుంది? మనిషి బక్క చిక్కి సగం అయ్యాడు. ఆ బాధలో కూడా అక్కడ నర్సుని చూడగానే తిరుమలకి ఏదో ఉత్సాహం. నర్సు యూనిఫారం, బ్యాడ్జి, డాక్టర్‌తో మాటలు, సూది వేయడం. ఇవే గమనిస్తూ కూర్చునేది. ఒకటి రెండు సార్లు ప్రతాప్ దవాఖానా గేటు దగ్గర కనపడ్డాడు. మళ్ళీ అవే చూపులు. ధైర్యాన్ని ఇచ్చే చూపులు. నెల రోజులు తర్వాత ఇంటికి వచ్చాడు తిరుమల తండ్రి. పూర్తిగా తేరుకోలేదు. సొంతగా కాలు కదపలేడు, సాయం లేకుండా నడవలేడు.



ఇప్పుడు ఒకరి జీతం మీదనే నడుస్తోంది. అది చాలదు అన్నట్టు తండ్రి మందుల ఖర్చు నెత్తిన పడింది.

ఓ ఆదివారం నల్లా వచ్చిందని తిరుమలకి సాయం చేస్తూ గుమ్మం దగ్గర పడిపోయాడు ఆమె అన్న. ఒకటే జ్వరం. దవాఖానాలో డాక్టర్ చూసి, "నీకు ఇంతకు ముందే చెప్పిన. లివర్ ప్రాబ్లెమ్ ఉంది. మందులు వాడుతుండగా బరువులు మోయడం లాంటివి చేయకూడదని. అన్ని గంటలు పని చేస్తే ఎట్ల? మందులు మార్చి ఇస్తా, ఇంట్లోనే ఉండి కొన్నాళ్ళు రెస్ట్ తీస్కో, జర్ర పత్యం ఉండాలె" అన్నాడు.

తిరుమల వాళ్ళ అమ్మకి గుండెల్లో రాయి పడింది. పత్యం ఉంటే ఇంకాస్త తిండి ఖర్చు తగ్గుతుందేమోనని ఆరాటంతో కూడిన అమాయకురాలు ఆ తల్లి. ఒకరి జీతంతో నెట్టుకొస్తున్న బండి పూర్తిగా కూలబడింది.

"ఏందో ఏమో ఈ కర్మ. తిన్నీకి ఇంట్ల అన్నీ ఖతం అవ్వొచ్చే" అని తిరుమల తల్లి కొంగుతో ముక్కు చీదింది.

సూన్యంలోకి చూస్తున్న తిరుమలతో "ఎంత సేపు ఆ గాలి పంకని సూత్తావే? జల్దీ పండుకో. రేపు పొద్దుగాల ఆ డ్రై ఫ్రూట్ ఫ్యాక్టరీ కాడికి పోవాలె. సేటు పనిస్తానన్నాడు" అంది తల్లి.

"పనికి పోవాల్నా? మరి నర్సింగ్ కోర్స్?"

"దిమాగ్ ఖరాబ్ అయ్యిందా? తాపతాపకు నర్సు అంటావ్. ఇంట్ల పైసా లేదు. తిన్నీకే లేదంటే నర్సు ఏందన్నట్టు? సప్పుడు కాకుండా పనికి పో"

తిరుమలకి పాణం పోయినట్టైంది. నర్సు అయ్యేది ఒక కలగా మిగిలిపోతుందా అని గుబులు పెట్టుకుంది. ఆ రాత్రి ఆమె తలగడ తడిసి ముద్దయ్యింది. తల్లితో కలిసి పొద్దుగాల పనికి వెళ్తుంటే గల్లీ చివర ప్రతాప్ కానొచ్చాడు. కొంచం కూడా బర్కత్ లేని నా బతుక్కి ఇప్పుడు ఇది ఒక్కటే తక్కువ అని అతన్ని చూసి మొహం తిప్పుకుంది.

ఓ రోజు రేషన్ షాపుకి వెళ్ళినప్పుడు ఆ బస్తీలో పని చేసే ఎన్‌జీఓ అక్క కనపడింది. ఏమైంది అడ్మిషన్ అని అడిగింది ఆమె. "ఏడ అక్కా? నర్సింగ్ లేదు ఏం లేదు. మొత్తం ఆగమైయ్యింది. కాలేజీలో మిగతా పైసల్ కడితేనే నా సర్టిఫికేట్లు ఇస్తరంట. ఆ పైసల్ కట్టనీకి నాకు ఇంట్లో అందరూ తిన్నాక పోగేస్తే ఇంకో ఆరు నెలలు పడ్తది. అది కూడా అయితదని లేదు. ఈ లోగ ఈ సంవత్సరం అడ్మిషన్లు అయిపోతాయి" అని ఏడ్చింది.

"మన ప్రయత్నం మనం చేద్దాం. టెన్షన్ పడకు" అని తిరుమలకి ధైర్యం చెప్పింది ఆ అక్క.

తిరుమల వెళ్ళిపోయాక ఆమె ఎవరికో ఫోన్ చేసింది. ఆ ఫోన్లు మీటింగులు అయ్యాయి, జర్నలిస్టులు రాసే వార్తలుగా మారాయి. ఆ బస్తీ మొత్తంలో తిరుమల లా ఇబ్బంది పడే స్టూడెంట్స్ ఎందరో ఉన్నారని తెలిసింది. వీళ్ళకి న్యాయం చెయ్యాలనే ఒక ప్రయత్నం మొదలైంది.

ఓ తెల్లారి తిరుమల ఇస్త్రీ చేసిన యూనిఫారం వేసుకుంది. నెత్తి మీద చిన్న టోపీ. డ్యూటీకి బయలుదేరింది. సొట్టలు లేని స్టీల్ టిఫిన్ బాక్స్ బ్యాగులో పెట్టుకుంది. ఒక పెద్దాయనకి కట్టు మార్చి, సూది వేసింది.

"నీకు ఇంతకు ముందే చెప్పిన. లివర్ ప్రాబ్లెమ్ ఉంది. మందులు వాడుతుండగా బరువులు మోయడం లాంటివి చేయకూడదని. అన్ని గంటలు పని చేస్తే ఎట్ల? మందులు మార్చి ఇస్తా, ఇంట్లోనే ఉండి కొన్నాళ్ళు రెస్ట్ తీస్కో, జర్ర పత్యం ఉండాలె" అన్నాడు. తిరుమల వాళ్ళ అమ్మకి గుండెల్లో రాయి పడింది. పత్యం ఉంటే ఇంకాస్త తిండి ఖర్చు తగ్గుతుందేమోనని ఆరాటంతో కూడిన అమాయకురాలు ఆ తల్లి. ఒకరి జీతంతో నెట్టుకొస్తున్న బండి పూర్తిగా కూలబడింది. "ఏందో ఏమో ఈ కర్మ. తిన్నీకి ఇంట్ల అన్నీ ఖతం అవ్వొచ్చే" అని తిరుమల తల్లి కొంగుతో ముక్కు చీదింది.

"ఏంటి నర్సమ్మా, సూది ఏసినావా? నొప్పే లేదే" అన్నాడు పేషెంట్ డ్రెస్సింగ్ ట్రే తీసుకుని వెనక్కి తిరిగి చిన్నగా నవ్వింది తిరుమల.

టక్కున నిద్రలో నుండి లేచి కూర్చుంది. చుట్టూ చూసింది.

"ఇది కలా? నిజమైతే ఎంత బాగుండు? టైం ఎంతబ్బా" అనుకుంటూ కిటికీ తెరిచింది. దూరంగా ఆకాశంలో ఏదో మెరుస్తోంది. కళ్ళు నలిపి మళ్ళీ చూసింది. చుక్క పొడిచింది.

పనికి బయలుదేరే టైంకి ఫోన్ మోగింది.

"హలో"

"అమ్మా, మీ పేరు తిరుమలా?"

"అవును. మీరెవరు?"

"మేము గవర్నమెంట్ ఆఫీస్ నుండి మీకేదో సర్టిఫికేట్లు ఇబ్బందని, నర్సింగ్ కోర్స్‌లో చేరలేక పోయారని మా దగ్గరకి మీ కేసు వచ్చింది. మీ వివరాలు, కాలేజీ నెంబర్ ఇస్తే మేము ఫీజు మాఫీ చేయిస్తాము. నర్సింగ్ కోర్స్‌కి సాయం అందిస్తాం. ముందు అయితే కాలేజీ నెంబర్ ఇవ్వండమ్మా" అని ఆవతల నుండి ఖుష్ ఖబరీ అందింది.

ఆమె మొహం విచ్చుకుంది. ఆనందంతో కన్నీళ్లు ఆగలేదు. ఏడుస్తూనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

మర్నాడు కాలేజీ నుండి సర్టిఫికేట్లు తీసుకుంది. ఎన్‌జీఓ అక్క దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్లి కావలించుకుంది. ఒక చిన్న ప్రయత్నం ఒక జీవితాన్నే మార్చేస్తుందంటే ఇదేనేమో. నెల రోజులు తర్వాత తను కల కన్నట్టే ఇస్త్రీ చేసిన యూనిఫారం వేసుకుని నర్సింగ్ కాలేజీకి బయలుదేరింది. గల్లీ చివర ప్రతాప్ కనపడ్డాడు.

ఈ సారి బొటను వేలు ఎత్తి నవ్వుతూ తల ఊపింది.

సాహితీ శిఖరం

ఆధునిక బెంగాలీ కవితా పితామహుడు...

# సుభాష్ ముఖోపాధ్యాయ



జ్ఞానపీఠ పురస్కార (1991) గ్రహీత

సుభాష్ ముఖోపాధ్యాయ 1919 ఫిబ్రవరి 12న జన్మించారు. 20వ శతాబ్దపు భారతీయ బెంగాలీ కవులలో ఒకరు. బెంగాలీ సాహిత్య రంగంలో ఆయనను "పాదటిక్ కోబి" అని కూడా పిలుస్తారు. పశ్చిమ బెంగాల్ ప్రావిన్స్‌లోని నదియా జిల్లాలోని కృష్ణానగర్ ఆయన జన్మస్థలం. ఆయన ఒక అద్భుతమైన విద్యార్థి. ఈయన కలకత్తాలోని స్కాటిష్ చర్చి కళాశాలలో తత్వశాస్త్రం అభ్యసించాడు, 1941లో పట్టభద్రుడయ్యాడు. 1940లో, విద్యార్థిగా ఉన్నప్పుడే, ఈయన తన మొదటి కవితా సంపుటి పదటిక్ (పాదచారి)ని ప్రచురించాడు. చాలా మంది విమర్శకులు ఈ పుస్తకాన్ని ఆధునిక బెంగాలీ కవిత్వం అభివృద్ధిలో ఒక మైలురాయిగా భావిస్తారు. ముఖోపాధ్యాయ తన జీవితకాలంలో అనేక అవార్డులు మరియు గౌరవాలను పొందారు, భారతదేశంలోని రెండు అత్యున్నత సాహిత్య బహుమతులు, 1964లో సాహిత్య అకాడమీ అవార్డు ("జోటో దురేయి జై" పుస్తకానికి), మరియు 1991లో జ్ఞానపీఠ్ పురస్కారాన్ని అందుకున్నారు. 2003లో భారత ప్రభుత్వం ఈయనను "పద్మభూషణ్" తో సత్కరించింది. 2003 జూలై 8న పరమపదించారు.

పురస్కారాలనే పరవశింప చేసిన

# సర్ డెరెక్ ఆల్టన్ వాల్కాట్



నోబెల్ బహుమతి (1992) పురస్కార గ్రహీత

సర్ డెరెక్ ఆల్టన్ వాల్కాట్ 1930 జనవరి 23న జన్మించారు. సెయింట్ లూసియన్ కవి మరియు నాటక రచయిత. ఈయన 1992 సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. అల్బెర్టా విశ్వవిద్యాలయం లో ఈయన అండర్ గ్రాడ్యుయేట్ మరియు గ్రాడ్యుయేట్ రైటింగ్ కోర్సులను బోధించాడు. ఈయన 2010 నుండి 2013 వరకు యూనివర్శిటీ ఆఫ్ ఎసెక్స్‌లో ప్రొఫెసర్ ఆఫ్ పోయట్రి గా కూడా పనిచేశాడు. అతని రచనలలో హెూమెరిక్ ఇతిహాస పద్యం "ఒమెరోస్" (1990)ని, చాలా మంది విమర్శకులు "వాల్కాట్ యొక్క అత్యుత్తమ రచనగా" చూస్తారు. నోబెల్ బహుమతితో పాటు, వాల్కాట్ తన కెరీర్‌లో అనేక సాహిత్య పురస్కారాలను అందుకున్నాడు, 1971లో డ్రీమ్ ఆన్ మంకీ మౌంటైన్ నాటకానికి ఓబీ అవార్డు, మాక్ఆర్థర్ ఫౌండేషన్ "జీనియస్" అవార్డు, రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్ అవార్డు, క్వీన్స్ మెడల్ ఆఫ్ పోయట్రి, OCM బోకాస్ ప్రైజ్, "వైట్ ఎగ్రెట్స్" కవితా సంకలనానికి 2011 టి.ఎస్. ఎలియట్ ప్రైజ్ అందుకున్నారు. మరియు 2015లో గ్రిఫిన్ ట్రస్ట్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పొయెట్రీ లైఫ్‌టైమ్ రికగ్నిషన్ అవార్డు అందుకున్నారు. ఆయన 2017 మార్చి 17న మరణించారు.

వ్యాసం

# షేక్స్పియర్ టెంపెస్ట్‌లో మానవీయ కోణం

డా. కాంచనపల్లి గోరా

**రాజ్యాధికారం కోసం జరిగే కుట్రలలో వికసించే మానవత్వం గురించి తెలిపే వ్యాసం....**

చాలామంది షేక్స్పియర్ టెంపెస్ట్‌ని అధికారం కోసం జరిగిన మోసాలు లేక వ్యూహాల చిత్రీకరణగా పేర్కొంటారు. కాని ఈ నాటకంలో కూడా మానవీయ కోణం,క్షమాగుణం ఉన్నాయి. శక్తి, అధికారం ఉన్నంత మాత్రాన శత్రువును చంపగూడదనే మంచితనం ఇందులో ఉన్నది. శత్రువును పశ్చాత్తాపానికి గురిచేసి, వాళ్ళు తమ తప్పు తెలుసుకునే లాగా చేయాలనే ప్రతిపాదన ఈ నాటకంలో కనబడుతుంది. అంటే అధికారం కోసం ప్రయత్నం చేయడం, దాని ఫలితాలు, తరువాత సయోధ్య. ప్రాస్పరో (prospero) మిలన్ సామంతరాజు. అతని సోదరుడు అన్ టోనియా (Antonio) దుష్ట స్వభావం వల్ల చాల ఇబ్బంది పడతాడు. అన్ టోనియా నేపుల్ రాజు అలన్సో (Alonso) సహాయంతో ప్రాస్పోరోకు ఎగ్గు తలపెడుతాడు. ప్రాస్పరో ఆది భౌతిక శాస్త్రం తత్వశాస్త్రం అధ్యయనం చేయడంలో ఆసక్తి కలిగినవాడు. తన సోదరుడు అన్ టోనియాకు రాజ్యభారాన్ని అప్పగించి ప్రాస్పరో ఆధ్యాత్మిక అధ్యయనంలో మునిగి పోతుంటాడు. సోదరుడు




సర్వాధికారాలను చేజిక్కించుకునే ఉద్దేశంతో ద్రోహానికి పాలుబడతడు.

ప్రాస్పరో శత్రువు అయిన నేపుల్ రాజు అలోన్సో సహాయం తీసుకుంటాడు. అతని సహాయంతో తన అన్న అయిన ప్రాస్పురోను దేశం నుండి వెల్లగొడతడు. అలోన్సో దానికి ప్రతిఫలంగా అన్తోనియా తన సార్వభౌమాధికారం అంగీకరించాలని, ప్రతి సంవత్సరం తనకు కప్పం చెల్లించాలని, అవసరమైనపుడు మిలన్ రాజకార్యాలలో తన జోక్యం అంగీకరించాలనే షరతు పెడతాడు. అంటోనియా అందుకు అంగీకరిస్తాడు. గుంజాలో (Gonzalo) అనే వీరుని సహాయం వల్ల, వలసినంత  ధాన్యాదులు, తిను బండరాలతో పుస్తకాలతో ప్రాస్పరో అతని పసికూతురు మిరాండా (Miranda)ఒక నావలో సురక్షిత ద్వీపం చేరుకుంటారు. ఆ ద్వీపంలో నివసిస్తూ ప్రాస్పరో తన తపస్సుతో గొప్ప శక్తులను సాధిస్తాడు. ప్రాస్పరో ఆ ద్వీపానికి పాలకుడవుతాడు. ఎన్నో అతీంద్రియ శక్తులు అతనికి వశమౌతాయి. గాలి నీరు అగ్నిల్లాంటి పంచ భూతాలు అతనికి స్వాధీనంలో ఉంటాయి.

ప్రాస్పరో ఏరియల్ అనే భూతాన్ని స్వాధీనం చేసుకుంటాడు. ప్రాస్పరో ఆ ద్వీపానికి వచ్చే వరకు ఏరియల్‌ను చికారో అనే మరో మంత్రగత్తె బందీగా చెట్టు తొర్రలో ఉంచుతుంది. ప్రాస్పరోని ఏరియల్ తనని బంధ విముక్తున్ని చేయమని కోరుతుంది.

వ్యాసం

అందుకు ప్రాస్పరో ఏరియల్ తనకు ఎప్పుడు విధేయంగా ఉండాలని, ఎదురాడకుండా ఏది చెప్పినా చేయాలని షరతులతో ఎరియల్ని విడిపిస్తాడు.

ఒకసారి ఒకపెద్ద నావ సముద్రం మధ్యలో వెడుతుంటుంది. అందులో టాన్కిలో, సెబాస్టియన్, అంటోనియో, అలన్సో, ఫెడ్రినో, గుంజాల్‌లు ప్రయాణం చేస్తుంటారు. అలేన్సో తన కుమార్తెను ఆఫ్రికాలోని ఒక వ్యక్తికిచ్చి పెళ్లి చేసి తిరిగి వస్తున్న సందర్భం అది.

ప్రాస్పరో ఏరియల్ సహాయంతో తుఫాను సృష్టిస్తాడు. మిరండా తండ్రిని వారిస్తుంది. ప్రాస్పరో ఆమెకు పన్నెండేళ్ళ క్రితం జరిగిన మోసం ఫలితంగా తాను మిరండాతో కలిసి ఈ దీవికి రావడాన్ని వివరిస్తాడు. ప్రాస్పరో అతీంద్రియ శక్తి సంపన్నుడు. పన్నెండేళ్ళుగా రాజ్యభ్రష్టుడై ఉన్నాడు. తలచుకుంటే చేజిక్కిన నావను భస్మీపటలం చేయగలడు. కాని అతనికి శక్తి సంపన్నతతో పాటు క్షమాగుణం కూడా అలవడింది. వాళ్లకు బుద్ధి చెప్పాలని, పశ్చాత్తాపానికి గురి చేయాలనే ప్రయత్నమే తప్ప చంపాలని కాదు. ప్రాస్పరోఅలన్సో కొడుకు ఫ్రెడినాండ్‌ని మంత్ర శక్తి వలన తనదగ్గరకు రప్పిస్తాడు.

ఫ్రెడినాండ్ మిరండాను చూసిన మొదటి క్షణంలోనే ప్రేమలో పడతాడు. మెరిండా కూడా తన తండ్రిని తప్ప అన్యపురుషున్ని ఇది వరకు చూసి ఎరుగదు. ఆమె కూడా ఫెడ్రినాండ్‌తో ప్రేమలో పడుతుంది. వీళ్లిద్దరి ప్రణయం వలన ప్రేస్పరో మొదటి విజయం అతని ఖాతాలో చేరుతుంది. తన శత్రువు కుమారుడైన ఫ్రెడినాండ్‌ను అల్లుడిగా భావిస్తాడు. కాని తొందరపడకుండా కట్టెలు కొట్టే పని చేస్తే తన కుమార్తె నిస్తానని ప్రేమ పరీక్ష పెడతాడు. తరువాత ఆ జంటకు Betrothal Ceremony (పెళ్లి కోసం ప్రార్థనలు) ఒక రోజు నిర్ణయిస్తాడు. ప్రాస్పరో అతీత శక్తుల సహాయంతో తన శత్రువుల మీద ఒక సమూహంపై ఒకేసారి ప్రతీకారం తీసుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. కాని

**ఈ నాటకంలో అంటోనియో, అలసోన్, సెబాస్టియన్, ప్రాస్పరో పట్ల ద్రోహం చేసిన వ్యక్తులుగా మిగిలిపోతారు. ఈ అపదనుంచి బయట పడాలంటే పశ్చాత్తాపం కంటే పరిహారం లేదు. ఇకముందు పాపం చేయకుండా స్వచ్ఛందంగా జీవితం గడుపుతామని ప్రమాణం చేస్తే ఈ విపత్తు నుంచి బయట పడగలమని అతీత వాణి ద్వారా వాళ్లకు అర్థమౌతుంది. జరుగుతున్న పరిణామాలతో వాళ్ళ మెదడు మొద్దుబారి పోతుంది.**

ఒక్కొక్కరిని బాధించడు. అంటోనియా అతని ఇతర అనుచరులు ఈ అతీతశక్తుల విన్యాసాలను చూసి దిగ్భ్రమ చెందుతారు. అలోసన్ ఆకలితో ఉంటాడు. డైనింగ్ టేబుల్‌పై అనేక ఆహార పదార్థాలు వస్తాయి. తినబోయే సమయానికి అన్నీ మాయమైపోతాయి. ఈ విధంగా ఏరియల్ వాళ్ళతో ఆడుకొంటుంది.

ఈ నాటకంలో అంటోనియో, అలసోన్, సెబాస్టియన్, ప్రాస్పరో పట్ల ద్రోహం చేసిన వ్యక్తులుగా మిగిలిపోతారు. ఈ ఆపద నుంచి బయట పడాలంటే పశ్చాత్తాపం కంటే పరిహారం లేదు. ఇకముందు పాపం చేయకుండా స్వచ్ఛందంగా జీవితం గడుపుతామని ప్రమాణం చేస్తే ఈ విపత్తు నుంచి బయట పడగలమని అతీత వాణి ద్వారా వాళ్లకు అర్థమౌతుంది. జరుగుతున్న పరిణామాలతో వాళ్ళ మెదడు మొద్దుబారి పోతుంది. ప్రాస్పరోకు ముగ్గురు ద్రోహులు పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నారని ఏరియల్ ద్వారా తెలుస్తుంది.

అటు అలన్సో కుమారుడు తుఫానులో వచ్చిన పడవ ప్రమాదంలో చనిపోయాడని అలన్సో భావిస్తాడు. ఇటు జరుగుతున్న పరిణామాలు అతన్ని క్రుంగ దీస్తాయి.

చివరికి ప్రాస్పరో ఎరియల్ ద్వారా అలన్సోను తానున్న స్థావరానికి పిలిపిస్తాడు. ఆలన్సో పశ్చాత్తాప పడుతూ 'నా పాపాలవల్లనే కొడుకును కోల్పోయాను అంటాడు. అంతకుముందే అన్ టోనియా సెబాస్టియన్‌లు రాజ్యం మీద దురాశతో అలన్సో ను ఒక రాత్రి హత్య చేయ ప్రయత్నిస్తారు. ఏరియల్ గుంజాలోను నిదురలేపుతుంది. గుంజాలో అరుపులకు అందరు మేల్కొంటారు. అర్ధరాత్రి సెబాస్టియన్ అంటోనియా చేతులలో కత్తులతో ఉండడాన్ని వాళ్ళు ప్రశ్నిస్తారు. సింహాలు తిరుగుతున్నాయని, అలన్సోని వాటినుండి కాపాడడానికే కత్తులు పట్టుకున్నామని వాళ్ళు చెబుతారు. అలన్సోకు కుట్ర అర్థమౌతుంది. తరువాత మరోవంక కాలిబాన్ సెబాస్టియన్ తో కలిసి ప్రాస్పరోని చంపాలని కుట్ర పన్నుతారు. కుట్రలన్నీ వీగిపోతాయి. చివరికి ఏరియల్ వల్ల అలన్సో ప్రాస్పరో ఉన్న తీరానికి చేరతాడు. నా పాపాలవల్లే నా కొడుకును కోల్పోయాను అంటాడు. ప్రాస్పరో నా కూతురును ఎప్పుడో కోల్పోయాను అంటాడు. తెర తీసేసరికి ఫెడిరిక్ మరియు మిరాండా చెస్ ఆడుతూ కనబడతారు. అలన్సో హర్షాతిరేకంతో కొడుకును కౌగిలించు కుంటాడు. తరువాత ఫెడ్రినాండ్ మిరండాకు పెళ్లి జరుగుతుంది. ప్రాస్పరో మిలన్ ఏలిక అవుతే అలన్సో నేపుల్ రాజవుతాడు. ఏరియల్ ప్రాస్పరోని తన విముక్తి కోరతాడు. తాము నేపుల్ చేరే వరకు తుఫాను రాకుండా కాపాడాలని తరువాత విముక్తి జరుగుతుందని చెబుతాడు ప్రాస్పరో. ఏరియల్ ప్రాస్పరో ఆదేశాలను పాటిస్తుంది.

ఈ నాటకంలో షేక్స్పియర్ ప్రతీకారం కంటే క్షమ గొప్పదని నిరూపిస్తాడు. ప్రాస్పరో పాత్ర షేక్స్పియర్ స్వీయ వ్యక్తిత్వ ప్రతిబింబమని విమర్శకులు పేర్కొంటారు.

క
థ

# కోటి దీపాల వెలుగు

కరోనా కాలంలో చదువు కోసం తపించిన
విద్యార్థినిని చిత్రించిన కథ...



సాగర్ల సత్తయ్య
79891 17415

(ఉగాది కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ...)

'శివానీ! లే బిడ్డా పొద్దు బారెడెక్కింది. అనసూయ పెద్దమ్మ ఓసారి వచ్చి పోయింది. ఈ ఒక్క నాడు పోతే అయిపోతదట. ఒక్క తీరుగ బతిమిలాడి పోయింది. అందరూ నీతోటి పిల్లలే వస్తున్నరంట. సోపతి చొప్పున పోయి ఆడుత పాడుత ఏరొచ్చు. పదమూడేళ్ల శివానిని  బతిమిలాడుతుంది తల్లి శంకరమ్మ. కరోనా కాలం వల్ల బడులు బంధై బడి పిల్లలంతా పత్తి ఏరబోతున్నరు.'

'అమ్మా... నేను ఇయ్యాల పోను. నాకు కాళ్ళు చేతులు నొప్పులు పెట్టినయ్. నాకు చేతనైతలేదు. ఆన్లైన్ క్లాసులు వినలేక పోతున్న. సార్ ఇచ్చిన వర్క్‌షీట్ ఎట్ల రాయాల్నో తెలుస్తలేదు. ఈ రోజు బడికి వెళ్తా. రాసిన నోట్సు సార్ తో కరెక్షన్ చేయించుకుంటా. నాకు పని ఉంది. ఈరోజు నేను పోనమ్మా...'

'అట్లంటే ఎట్ల బిడ్డా... నువ్వు కూడా నాలుగు పైసలు తెస్తవని ఆశ తోటే సంఘ బంధం ల లోన్ తీసుకున్న. కట్టకపోతే నలుగుట్ల నాదాన్ ఐతది. ఎట్టనన్న ఓపిక చేసుకొని పోవాలె. లే బిడ్డా చాయ్ మసిలిపోతుంది. లేచి ముఖం కడుక్కో..' బతిమాలింది తల్లి.

శివాని చురుకైన అమ్మాయి. ఆ ఊరి ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతుంది. ఎప్పుడూ క్లాస్ ఫస్టే. కరోనా కాలం వల్ల బడికి దూరం అవడం ఆమెకు ఎంతో బాధ కలిగించింది. ఈ రోజు పాఠశాలకు ఉపాధ్యాయులు వస్తున్నా తాను వెళ్లడానికి అవకాశం లేకపోవడం ఆమెకు ఎంతో చికాకు కలిగిస్తుంది. డిజిటల్ పాఠాలు టీవీలో వస్తున్నా పత్తి కూలీకి వెళ్తుండటం వల్ల చూడ లేక పోతుంది. ఈరోజు ఎలాగైనా పాఠశాలకు వెళ్లాలని గట్టిగా మనసులో అనుకుంది. ఎప్పుడూ అమ్మకు ఎదురు చెప్పని శివాని ఈరోజు ఎదిరించడానికి కూడా సిద్ధమైంది.

'అమ్మా నువ్వు ఎన్ని చెప్పినా నేను ఈరోజు కూలికి పోను. శనివారం ఆదివారం పోత అంతే... నా క్లాసులు మిస్ అవుతున్నాయి. సెల్ ఫోన్ల చూద్దామంటే ఫోన్ కూడా లేదు.' పక్క మీద నుంచి లేస్తూ కండ్లు నలుసుకుంటూ ఖరాఖండీగా చెప్పింది శివాని.

'మీ అయ్య ఉన్న సావుకారా? పుట్లకు పుట్లు మూలుగుతున్న ఇంట్ల పుట్టిన అనుకుంటున్నవా... చెయ్యకపోతే బువ్వ ఎట్ల వస్తది? నీ తోటి వాళ్ళు అందరు చేస్తలేరా? నువ్వు ఒక్కదానివే చదువుతున్నవా? ఆ పాటి చదువు? మా అమ్మగని అని బతిలాడిన ఇంటలేవు. పత్తి కూలికి పోకపోతే బువ్వ కూడ గానవు బిడ్డా ఏమనుకుంటున్నవో...' కోపంగా హెచ్చరించింది శంకరమ్మ.

శంకరమ్మది బీద కుటుంబం. భూములు ఆస్తులు లేవు. రెక్కల నమ్ముకొని బతకాల్సిందే. భర్త శంకరయ్య తోటలో జీతానికి కుదిరాడు. శంకరమ్మకు బిడ్డ అంటే వల్లమాలిన ప్రేమ. పాఠశాల రెగ్యులర్గా జరిగే రోజుల్లో పాఠశాలకు వచ్చి బిడ్డ చదువు గురించి టీచర్లను అడిగి తెలుసుకునేది. చదువులోనూ సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ఆటల్లోనూ ముందుండే శివానిని టీచర్లు మెచ్చుకుంటుంటే ఎంతో ఆనంద పడేది. పాఠశాల జరిగే రోజుల్లో శివాని ఒక్కరోజు కూడా పాఠశాలకు గైర్హాజరు కాలేదు. చదువు పట్ల ఆ తల్లిదండ్రులకు శివానికి అంతటి శ్రద్ధ. ఈ మాయ కాలం దాపురించడం వల్ల, పిల్లలు ఇంటి ముందు ఖాళీగా ఉండడం వల్ల, తోటి పిల్లలు నాలుగు రాళ్ళు సంపాదిస్తున్నందువల్ల శివానిని కూడా పత్తికొండకు పంపడం మొదలు పెట్టింది. పసి వయసులో ఉన్న శివానిని పనికి పంపుతున్న అందుకు శంకరమ్మ గుండెల్లో ఎంతో బాధ ఉంది. కానీ పేదరికం ఆ బాధను జయించింది. శంకరమ్మ చేత ఇంతటి కటువుగా మాటలు పలికించింది.

తల్లి కోపించడంతో భయపడి పోయింది శివాని. అయిష్టంగానే లేచి ముఖం కడుక్కొని చాయ్ తాగింది. తన

కథ



'జాగ్రత్త అమ్మా... రోజులు బాగా లేవు. మీ ఊరు ఏఎన్ఎంకు చూపించండి. ఆమె ఉచితంగా మందులు ఇస్తుంది. అవసరమైతే పరీక్షలు చేయిస్తుంది. అసలే కరోనా కాలం జాగ్రత్తగా ఉండాలి సుమా' తనదైన శైలిలో జాగ్రత్తలు చెప్పాడు సైన్సు ఉపాధ్యాయుడైన శ్యామ్ సుందర్. 'అవును శివాని కనిపించడం లేదేమిటి? మూడు గంటలకు ఆన్లైన్ క్లాస్ ఉంది కదా... ఎటు వెళ్లింది? ఆరా తీశాడు శ్యామ్. లేదు సారు... పత్తేర బోయింది. నాకు జ్వరం వస్తుండే... ఇంట్ల ఉప్పు నిరపకాయకన్న ఐతయని తోలిన. ఏం జెయ్య సారు ఉండి లేమిడి సంసారమాయె... మీకు తెల్వదా?

స్నేహితురాళ్ళ వద్దకు వెళ్లి తాను కూడా వస్తానని చెప్పి వచ్చింది. అన్నం తిని సద్ది కట్టుకొని తన స్నేహితురాళ్లతో కలిసి పత్తి ఏరడానికి వెళ్ళింది. తన బిడ్డను కష్ట పెట్టినందుకు ఎంతో బాధపడింది శంకరమ్మ. తాను కూడా రోజు కిలోల పత్తి తీయటానికి వెళ్ళేది. జ్వరం కారణంగా ఇంట్లోనే ఉంటుంది. 'ఈ జ్వరం పాడువడ ఎప్పుడు తగ్గుతుందో ఏమో' నేను పోయి పిల్లను ఇంటి దగ్గర ఉంచేదాన్ని.' మనసులో గొణుక్కుంది.

* * *

పత్తి చేనుకు వెళ్లిన శివాని మనసు మనసులో లేదు. హాయిగా చదువుకుంటున్న తనకు ఒక్కసారిగా ఇటువంటి కష్టం తట్టుకోలేక పోయింది. ఒకవైపు తీవ్ర నీరసం, ఒంటి నొప్పులు మరోవైపు పాఠశాలకు వెళ్లలేక పోతున్నానన్న దిగులు. కరోనాపై తీవ్రమైన కోపం, కసి పెరుగుతోంది శివానికి. అలాగే నా పాఠశాల నడిస్తే బాగుండు అని మనసులో వందలసార్లు అనుకుంటుంది.

* * *

'ఇంట్లో ఎవరండీ...' డోర్ వద్ద నిలబడి పిలిచాడు శ్యామ్ సుందర్ సార్. అతను ఆ పాఠశాలలో 8వ తరగతి క్లాస్ టీచర్. పిల్లలు ఆన్లైన్ పాఠాలు వింటున్నారా లేదా తెలుసుకోవడానికి ఇల్లిల్లూ తిరుగుతూ శివాని ఇంటికి చేరుకున్నాడు. సిసి రోడ్డు పైన బండి స్టాండ్ వేసి, ముఖానికి మాస్క్ వేసుకొని శివానీ ఇల్లు డోర్ తట్టాడు.

'ఎవలు సారు...? నీరసంగా మూలుగుతూ లేచి వచ్చి అడిగింది శంకరమ్మ. మాస్కు ఉండడంవల్ల గుర్తు పట్టలేకపోయింది.

'నేను శ్యామ్ సార్‌ను. స్కూల్ నుండి వచ్చిన. శంకరమ్మ గారు బాగున్నారా? క్షేమసమాచారాలు అడిగాడు శ్యాం సుందర్.

'నమస్కారం సార్... ఆ మాస్కు పెట్టుకోవడం వల్ల గుర్తుపట్టలేక పోయిన. కూర్చోండి సార్' కుర్చీ తెచ్చి బయట వేసింది.

'ఏమ్మా ఆరోగ్యం ఏమైనా బాగాలేదా? చాలా నీరసంగా కనిపిస్తున్నారు? 'అడిగాడు శ్యామ్ కుర్చీలో కూర్చుంటూ.

'అవును సార్ నాలుగు రోజుల నుండి ఒకటే జ్వరం ఊళ్లె డాక్టర్‌కు చూపించిన. ఎన్ని గోలీలు మింగినా తగ్గుతలేదు.'

'జాగ్రత్త అమ్మా... రోజులు బాగా లేవు. మీ ఊరు ఏఎన్ఎంకు చూపించండి. ఆమె ఉచితంగా మందులు ఇస్తుంది. అవసరమైతే పరీక్షలు చేయిస్తుంది. అసలే కరోనా కాలం జాగ్రత్తగా ఉండాలి సుమా' తనదైన శైలిలో జాగ్రత్తలు చెప్పాడు సైన్సు ఉపాధ్యాయుడైన శ్యామ్ సుందర్.

'అవును శివాని కనిపించడం లేదేమిటి? మూడు గంటలకు ఆన్లైన్ క్లాస్ ఉంది కదా... ఎటు వెళ్లింది? ఆరా తీశాడు శ్యామ్.

లేదు సారు... పత్తేర బోయింది. నాకు జ్వరం వస్తుండే... ఇంట్ల ఉప్పు నిరపకాయకన్న ఐతయని తోలిన. ఏం జెయ్య సారు ఉండి లేమిడి సంసారమాయె... మీకు తెల్వదా?

అయ్యో పసిపిల్ల. పొద్దంత ఎలా పని చేయగలదు? పైగా బాగా చదివే అమ్మాయి. నీకు తెలుసు కదా పసి వయసులో పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం కూడా. ఆమె చదువు ఆగం చేస్తే ఎట్ల?

నేనేం ఆగం జేస్తున్న సారు? మీరు బల్లె పాఠాలు చెప్పంగ ఒక్కనాడన్న నాకా పెట్టిందా? ఆ టీవీ ల పాఠం ఆల్లకేమన్న అర్థం ఐతుందా? అటిటు మసులుతున్నంగానే ఇరవై నిముషాలు అయిపోతుండే. ఎట్ల చదువుతరు సారు? తోటి పిల్లలందరూ పనికి పోతలేరా? ఆవేదనగా ప్రశ్నించింది శంకరమ్మ.

'అది కాదు శంకరమ్మ గారు! ప్రభుత్వ ఆదేశాలు పాటించాలె గదా! ప్రభుత్వం గూడ మన ఆరోగ్యం గురించే ఈ విధానం పెట్టింది. ఆవేశం వద్దు ఆలోచన చేయండి. పాప భవిష్యత్ పాడు చేయకండి.' సర్ది చెప్పే ప్రయత్నం చేసాడు శ్యామ్.

> **'అది కాదు శంకరమ్మ గారు! ప్రభుత్వ ఆదేశాలు పాటించాలె గదా! ప్రభుత్వం గూడ మన ఆరోగ్యం గురించే ఈ విధానం పెట్టింది. ఆవేశం వద్దు ఆలోచన చేయండి. పాప భవిష్యత్ పాడు చేయకండి.'**

★ ★ ★

సాయంత్రం నాలుగు గంటల సమయం. హెడ్ మాస్టర్ ఫోన్ రింగ్ అయింది. అవతల నుండి జిల్లా విద్యాశాఖాధికారి... రేపటి నుండి స్కూల్స్ తెరవాలని, కరోనా పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆ ఫోన్ కాల్ సారాంశం. ఉపాధ్యాయులందరూ ఎంతో సంతోషించారు.

పాఠశాల ముగిసిన వెంటనే బైక్‌పై వెళ్తున్న శ్యాంసుందర్‌కు పత్తి చేను ఏరి ఇంటికి వస్తున్న శివాని కనిపించింది. వెంటనే బండి ఆపాడు. 'గుడ్ ఈవెనింగ్ సార్' అంటూ దగ్గరకు వచ్చింది శివాని.

'ఏంది నాన్న ఎందుకురా నీకు ఈ కష్టం' బాధగా అన్నాడు శ్యామ్.

ఒక్కసారిగా శివాని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెక్కి వెక్కి ఏడుస్తూ ఉదయం ఇంటి దగ్గర జరిగిన సంఘటన అంతా చెప్పింది.

'ఏడవకమ్మా! నేను మీ ఇంటికి వెళ్ళాను. అమ్మతో మాట్లాడాను. శివానీ! నీకో శుభ వార్త! రేపటి నుండి పూర్తి స్థాయిలో పాఠశాలలు పనిచేస్తాయి. మధ్యాహ్న భోజనం కూడా ఉంటుంది. మీ మిత్రులు అందరికీ చెప్పు. రేపటి నుండి అందరం పాఠశాలలో హాయిగా పాఠాలు చెప్పుకుందాం.' అన్నాడు

శివాని ఒక్కసారిగా ఏడుపు మానేసి ఆశ్చర్యంతో శ్యామ్ సుందర్ సార్ వైపు చూసింది. నమ్మలేనట్లు 'నిజమా సార్' అని మళ్ళీ అడిగింది. 'నిజమేనమ్మా ఈ రోజే హెడ్మాస్టర్ గారు చెప్పారు.' అన్నాడు శ్యామ్.

శివాని కళ్ళలో కోటి దీపాల వెలుగు...

---

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in






# ఇంటి నుండే పని

సంధ్య సుత్రావె, 9177615967

ఇంటికి దీపం ఇల్లాలన్నారు
ఆడదే ఆధారం అన్నారు
ఆడదిఅబల కాదు సబల అన్నారు
ఆడది లేనిదే బతుకుకు అర్థం లేదన్నారు
ఇంటికి హెూంమినిస్టర్ అన్నారు
ఇంటిని చూసి ఇల్లాలిని చూడు అన్నారు
ఆడపిల్ల చదువు అవనికి వెలుగన్నారు
ఓకే, ఎంకరేజ్ మెంట్ బాగుంది
ఈ లాక్‌డౌన్‌లో
నాన్ స్టాప్ వర్క్ ఇల్లాలికి పెరిగింది
వర్కింగ్ ఉమెన్‌కు,
వర్క్ ఫ్రం హెూం, ఇంటి నుండి
పని చేయటం, కత్తిమీద సామే,
ఆలుమగలకు వర్క్ ఫ్రం హెూం ఉంటే
ఇద్దరు పని ఒత్తిడిలో
ఇంటిపని, వంటపని, ఆఫీస్ పనిలో
తలమునకలైనప్పుడు
చిన్నారుల ఆలనాపాలనా హుష్ కాకే
అయినా ఇద్దరూ, చిన్నారులకు ముద్దులు పంచుతూ
ఒకరికి ఒకరు సహకరించుకుంటూ
అలుపు సొలుపు లేకుండా
ఈ లాక్ డౌన్,
షేరింగ్ కేరింగ్ డేరింగ్ బేరింగ్‌లతో
ఇంటినుండి పనిచేయటం నేర్పింది,
అనురాగాలు పంచుతూ, ఆత్మస్థైర్యాన్ని పెంచి,
ఇంటిని ఆనందాల హరివిల్లు చేసింది.

సమాజం

# ముదిగంటి సుజాతారెడ్డి కథల్లో ఇతివృత్త వైవిధ్యం

**ముదిగంటి కథల్లో సామాజిక అంశాలను స్పృశించిన వ్యాసం...**



డా॥ సయ్యద్ ఆఫ్రీన్ బేగం
99080 28835

తెలంగాణ రచయిత్రులలో వైవిధ్యమైన కథలు రాయడంలో ముదిగంటి సుజాతారెడ్డిది అందెవేసిన చేయి. ఆమె రాసిన నిత్యకల్లోలం కథల సంపుటిలోని కథలు చదివితే ఈ విషయం తేటతెల్లమవుతుంది. ఇది ఆమె ఐదవ కథల సంపుటి. ఇందులో పొందుపరిచిన నిత్యకల్లోలం కథ పేరునే ఈ కథల సంపుటికి పెట్టారు. ఈ పుస్తకంలోని కథలన్నింటిలో నిత్యకల్లోలం కథ ఆణిముత్యంగా నిలిచింది. అంతేకాకుండా ఈ పుస్తకంలోని కథలన్నీ తెలంగాణ నేపథ్యంగా చిత్రించినవే. తెలంగాణలో అడుగడుగున వాస్తవంగా కనబడే అనేక కల్లోలాలు చూసిన రచయిత్రి తన అనుభవాల సారాన్ని ఈ కథల సంపుటికి పేరుగా పెట్టారేమో అనిపిస్తుంది. అంతేకాకుండా ప్రజల జీవితాల్లో ఎదురయ్యే అనేక కల్లోలాలనే కథా వస్తువులుగా తీసుకోవడం వలన ఈ సంపుటికి నిత్యకల్లోలం అనే పేరు సరిగ్గా సరిపోయింది.

ఈ సంపుటిలోని కథల ఇతివృత్తాలు వైవిధ్యంగా ఉండడమే కాదు, విభిన్నంగా కూడా మలిచారు రచయిత్రి. ఈ సంపుటిలోని ప్రధాన కథ, సంపుటానికి కిరీటంగా ఒదిగిపోయిన కథ నిత్యకల్లోలం. ముందుగా ఈ కథనే చర్చిద్దాం.



## నిత్యకల్లోలం...

ప్రతి రోజు జరిగే అనేక కల్లోలాలను వాటి వలన సమాజం మీద పడే దుష్ప్రభావాలను ఇతివృత్తంగా తీసుకొని రాసిందే నిత్యకల్లోలం కథ. ఇతివృత్తం ఏదైనా దాన్ని వైవిధ్యంగా మలచడం రచయిత్రి ప్రత్యేకత. ఓ మధ్యతరగతి ఉద్యోగి కోణంలో నుండి నిత్యకల్లోలాను ఆవిష్కరించిన తీరు వినూత్నం. డి.ఎ పెరిగినా దానికి మరిన్నిరెట్లు ధరలు పెరగడం వలన మధ్య తరగతి జీతాలు తమ జీవితాలను బాగుచేయలేవన్న సత్యం ఈ కథ ద్వారా చూపించారు. టి.వి కొనాలనుకొని దుకాణానికి వెళ్లిన ప్రసాద్ అనే మామూలు జీతగాడు అక్కడున్న టి.విల్లో వచ్చే కార్యక్రమాలు వీక్షించాడు. ఏ ఛానల్‌లో చూసినా ఏమున్నదన్నట్టు ప్రతి ఛానల్‌లోనూ కల్లోలాలే. ఒకే ప్రదేశంలో ఉండి దేశంలో జరుగుతున్న అనేక రకాల అల్లకల్లోలాలను టి.విలో చూస్తున్న ప్రసాద్ పాత్ర ద్వారా పాఠకులకు అందించడం వైవిధ్యభరితం.

దేశంలో జరుగుతున్న అల్లకల్లోలాలను చూపించాలంటే రచయిత ప్రతి ప్రదేశం గురించి రాయ వలసి ఉంటుంది. ఒక్కొక్క ప్రదేశంలో జరుగుతున్న ఒక్కొక్క అల్లకల్లోలం గురించి వివరించ వలసివస్తుంది. అలా కాకుండా ఒకే ప్రదేశంలో ఉండి అన్ని చోట్ల జరుగుతున్న విషయాలను టి.విలో చూడడం ఆ పాత్ర ద్వారా పాఠకులకు అందించడం వైవిధ్యమైన ఆలోచన.

నిరాహార దీక్షలు, ఆత్మహత్యలు, నిరసనలు, ర్యాలీలు, నినాదాలు, కేకలు, తుఫాన్‌లు, పాడయిపోయిన పంటలు, విలపిస్తున్న రైతులు, దుఃఖిస్తున్న రైతుల భార్యలు, దిష్టిబొమ్మల దగ్ధాలు, లాఠీఛార్జీలు, రక్తపాతాలు, ఆత్మాహుతులు, ఉద్రిక్త వాతావరణాలు, ఇలాంటి అనేక రకాల అల్లకల్లోలాలను ఒకే ప్రదేశం నుండి పాఠకులకు టి.వి చూసినట్టుగా అందించడంలో రచయిత్రి సఫలీకృతమైనట్టే.

## లెక్కకెక్కని మనుషులు...

రాజకీయ నాయకులు తమ లబ్ధి కోసం పేదలను ఎలా ఉపయోగించుకొని

మోసం చేస్తారో, వారి అక్రమ పద్ధతులు ఎలా ఉంటాయో తెలియజెప్పే ఇతివృత్తంతో లెక్కకెక్కని మనుషులు కథ రూపుదిద్దుకుంది.

పెంచి పెద్ద చేసిన కొడుకులు రెక్కలొచ్చాక ఈ రోజుల్లో తల్లి తండ్రులను పట్టించుకోవడం లేదు. అలా నిరాదరణకు గురైన ఓ తల్లి, మరో కుటుంబంలో ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్న ఓ తండ్రి.. అక్కడ ఉండలేక, కూలోనాలో చేసుకుందామని పట్నం వెళ్లి ఎన్ని కష్టాలు పడ్డారో, రాజకీయ నాయకుల మోసాలకు ఎలా గురయ్యారో ఈ కథ కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది.

పట్నం బయలుదేరిన ఆ ఇద్దరి పేర్లు యాదగిరి, మల్లమ్మ.. ఆ పేర్లే చెబుతాయి ఈ కథ తెలంగాణ నేపథ్యంలో సాగుతుందని. భవన నిర్మాణాలకు కూలీలుగా పనిచేద్దామని వెళ్లినవారికి ఆధునికత అడ్డుపడింది.. యంత్రాలు వచ్చాక కూలీల అవసరం తగ్గిపోవడంతో వారికి చుక్కెదురయింది. ఈ పరిస్థితిలో వాళ్లు వీరా అనే దళారి ద్వారా రాజకీయ ఊరేగింపులకు,

**యాదమ్మకు జ్వరం వచ్చి పనిలోకి రాకపోతే దొరసాని తన పనికి ఇబ్బంది కలుగుతుందని అనుకోవడమే గానీ యాదమ్మపై కనీస సానుభూతి చూపక పోవడం, యాదమ్మ బదులు పనికి వచ్చిన ఆమె బిడ్డ సుక్కమ్మ తిండిలేక బలహీనంగా ఉన్నప్పటికీ బరువైన పనులు చేయియంచుకోవడం. నాలుగేళ్ల సుక్కమ్మ తమ్ముడు ఆకలితో అలమటిస్తూ ఉంటే ఎండిపోయిన రొట్టెముక్క విసిరికొట్టిన దొరసాని కఠిన బుద్ధిని ఆవిష్కరించిన తీరు ఆలోచింప జేస్తుంది.**

సభలకు వెళ్లి వాళ్లిచ్చిన పదో పరకో తీసుకొని పొట్టపోసుకుంటున్నారు. ఈ సన్నివేశాలు ఎంతో సహజంగా, వైవిధ్యంగా మన కళ్లముందు కదలాడుతాయి.

సభలకు వెళ్లి జైకొట్టడాలు, నినాదాలు ఇవ్వడాలు లాంటి పనులు అంత సులువేం కావని ఈ కథ ద్వారా తెలియని వారికి తెలియచెప్పారు రచయిత్రి. అన్ని సభలు, అన్ని రోజులు ఒకలా ఉండవు. తొక్కిసలాటలు, తిండే కాదు.. గుక్కెడు మంచినీళ్లు కూడా దొరకని పరిస్థితులు ఉంటాయి. అంత కష్టపడితే దళారులు డబ్బులు ఎగ్గొట్టే సందర్భాలు ఉంటాయి. రాజకీయ నాయకుల సభలు, వాటి నిర్వహణ.. అందులో పేదవాళ్లను కరివేపాకులా వాడుకోవడం లాంటి సన్నివేశాలు కథలో చదువుతున్నట్టుగా కాకుండా నిజంగా చూస్తున్నట్లుగా ఉంటాయి.

ఒక పెద్ద సభలో జైకొట్టడానికి వెళ్లిన కూలీల్లో మల్లమ్మ, యాదగిరి కూడా ఉన్నారు. సభ రసాభాస అయింది. లాఠీఛార్జీ, ఫైరింగ్ పెద్ద ఎత్తున జరిగాయి. పొట్టకూటికోసం ఆ సభలకు వెళ్లిన మల్లమ్మ, యాదగిరిలతో పాటు అనేక మంది కూలీలు ఫైరింగ్‌లో చనిపోయారు.

తెల్లవారి వచ్చిన వార్తల్లో సభ విజయవంతం.. అని తప్ప మరణ వార్తలు లేవు.. అంటే పేదవాళ్ల ప్రాణాలకు విలువ లేదని, వారి మరణాలు లెక్కల్లోకి ఎక్కవని విమర్శనాస్త్రాలు సంధిస్తుంది ఈ కథ. లెక్కకెక్కని మనుషులు అన్న పేరు ఈ కథకు చక్కగా సరిపోయింది.

**వలస....**

ఈ కథల సంపుటిలో గ్రామీణ చిత్రణ ఎక్కువగా కనిపిస్తుంది. దానితోపాటు గ్రామాల్లో జరుగుతున్న దోపిడి, పేదల బాధలు లాంటి వాస్తవ సంఘటనలెన్నో కనిపిస్తాయి. పంటలు లేక, ఉపాధి కోల్పోయి, అప్పుల పాలయిన పేదలు దొరల ఇళ్లల్లో బానిసల్లా బతకలేక జానెడు పొట్టనింపుకోవడానికి వలసబాట పట్టిన ఇతివృత్తంతో రూపొందిన మరో విభిన్నమైన




కథ వలస. తరాలు మారినా మారని గ్రామాలు ఈకథలో కనిపిస్తాయి. గ్రామాల్లో దొరల దోపిడీలు, దొరసానుల ఆగడాలు, పేదల నిస్సహాయత ఈ వలస కథలో కనిపిస్తాయి.

కొద్దోగొప్పో అప్పిచ్చి, అప్పు తీరేదాక వాళ్లతో వెట్టిచాకిరీ చేయించుకోవడం దొరల ఇళ్లల్లో ఎంతో కాలంగా జరుగుతున్న తంతే. ప్రభుత్వాలు మారినా ఆ పరిస్థితులు ఇప్పటికీ మారకపోవడం, ఆ సన్నివేశాలను చిత్రించిన తీరు పాఠకులకు కంట తడి పెట్టిస్తాయి.

యాదమ్మకు జ్వరం వచ్చి పనిలోకి రాకపోతే దొరసాని తన పనికి ఇబ్బంది కలుగుతుందని అనుకోవడమే గానీ యాదమ్మపై కనీస సానుభూతి చూపక పోవడం, యాదమ్మ బదులు పనికి వచ్చిన ఆమె బిడ్డ సుక్కమ్మ తిండిలేక బలహీనంగా ఉన్నప్పటికీ బరువైన పనులు చేయించుకోవడం. నాలుగేళ్ల సుక్కమ్మ తమ్ముడు ఆకలితో అలమటిస్తూ ఉంటే ఎండిపోయిన రొట్టెముక్క విసిరికొట్టిన దొరసాని కఠిన బుద్ధిని ఆవిష్కరించిన తీరు ఆలోచింప జేస్తుంది. ఇలాంటి పెత్తందార్ల దోపిడీలను తట్టుకోలేక, చేయడానికి మరే పనులు దొరకకా, జీవితాంతం బానిసల్లా పడుండలేక,

తిరుగుబాటు చేతకాక జరుగుబాటు కోసం వలస బాట పట్టిన పేదల వ్యథలు ఈ కథలో దృశ్యమానమవుతాయి.

**ముట్టడి...**

గ్రామాల్లో సారా బట్టీలు పెట్టేవారిపై, గిరిజన తండాలపై పోలీసుల దాడులు, అమాయక ప్రజలను చిత్రహింసలకు గురి చేయడం ఇతివృత్తంగా ఈ ముట్టడి కథ సాగుతుంది. ఈ కథ కూడా గ్రామీణ నేపథ్యంలో నడుస్తున్నా కథనం వైవిధ్యంగా ఉండి పాఠకుల కళ్లను అక్షరాల వెంట పరుగులు పెట్టిస్తుంది.

మెగ్యా నాయక్ తండాలో ఇప్పసారా కాస్తాడు. కల్తీ లేకుండా తయారు చేసే ఆ సారాకు బాగానే గిరాకీ ఉండేది. కొంత మంది పట్నం నుండి వచ్చి క్యాన్లలో సారా కొనుక్కుపోయేవారు. పట్నంలో విషపూరిత రసాయనాలతో తయారు చేసే సారా కంటే తండాల్లో ప్రకృతి ప్రసాదించిన ఇప్ప పూలతో తయారయిన సారాకు ఆదరణ ఎక్కువ.. కానీ రాను రాను అది తగ్గిపోయింది. రంగు రంగు సీసాల్లో ఆకర్షణీయంగా కనిపించే ఆధునిక మద్యానికే ఎక్కువమంది మొగ్గు చూపుతున్నారు. ఆ పరిణామక్రమం కథలో వివరణాత్మకంగా ఉంటుంది.

సారా అమ్ముకొని గిరిజన కుటుంబాలు ఒకప్పుడు బాగానే బతికేవి. లిక్కర్ మాఫియా కారణంగా ఉపాధి కోల్పోయాయి. పైగా పోలీసుల అమానుష దాడులతో తండాలు మూగబోయాయి. పోలీసుల అరాచకాలు, ఆకృత్యాలు కథ చదివే వారికి కళ్లముందు కనబడతాయి. గిరిజనులను ఆవేదనలకు గురి చేస్తున్న పోలీసులపై ఆవేశం కలుగుతుంది. గిరిజనులపై ఎనలేని సానుభూతి వ్యక్తమవుతుంది.

సారా బట్టీలపై దాడులు చట్టపరమే అయినప్పటికీ మూకుమ్మడిగా తండాలను ముట్టడించి అమాయక గిరిజనులను విచక్షణా రహితంగా చచ్చేదాక కొట్టమని ఏ చట్టం చెప్పిందని ఈ ముట్టడి కథ ప్రశ్నిస్తుంది. బెల్టు షాపుల ద్వారా అక్రమంగా గ్రామాల్లో యథేచ్ఛగా లిక్కర్ అమ్మకాలు కొనసాగించడం, ప్రజల ఆదాయాలను కొల్లగొట్టడం న్యాయమేనా అని ఈ కథ అంతర్లీనంగా ప్రశ్నిస్తుంది. అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా జీవనోపాధి కోసం తెలిసో తెలియకో సారా తయారు చేసిన గిరిజనులను చావగొట్టడం చట్టవ్యతిరేకం కాదా అనే ప్రశ్నలను భావగర్భితంగా సంధించారు.

**అధికారాల కోసం వారికి అణిగి మణిగి ఉండే ప్రజాప్రతినిధులు ఇంకా ఉన్నారని చెప్పే కథాంశం స్నిగ్ధచ్ఛాయ. నర్సయ్య అనే వ్యక్తి గతంలో దొరకు సేవకునిలా పని చేశాడు. ఆ తర్వాత ధాన్యం వ్యాపారం చేసి సంపాదించు కున్నాడు. పిల్లల్ని చదివించు కున్నాడు. పిల్లలు మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. అయినా ప్రతి దసరా పండుగకు దొర దగ్గరకు వచ్చి ఇనాం తీసుకొని వెళ్తాడు.. ఇలాంటి వాళ్లను ఈ కథ వెక్కిరిస్తుంది.**

పోలీసులు సృష్టించిన బీభత్సం.. వాళ్ల లాఠీల దెబ్బలకు చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న గిరిజనులు, స్మశానంలా మారిపోయిన తండాలను వర్ణించిన తీరు సహజం.. సజీవం..

**స్నిగ్ధచ్ఛాయ...**

దొరతనం పోయినా వారి ప్రాబల్యం తగ్గదు. అధికారాల కోసం వారికి అణిగి మణిగి ఉండే ప్రజాప్రతినిధులు ఇంకా ఉన్నారని చెప్పే కథాంశం స్నిగ్ధచ్ఛాయ. నర్సయ్య అనే వ్యక్తి గతంలో దొరకు సేవకునిలా పని చేశాడు. ఆ తర్వాత ధాన్యం వ్యాపారం చేసి సంపాదించు కున్నాడు. పిల్లల్ని చదివించుకున్నాడు. పిల్లలు మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. అయినా ప్రతి దసరా పండుగకు దొర దగ్గరకు వచ్చి ఇనాం తీసుకొని వెళ్తాడు.. ఇలాంటి వాళ్లను ఈ కథ వెక్కిరిస్తుంది.

చింత చచ్చినా పులుపు చావలేదన్నట్టు దొరతనం, ఆస్తిపాస్తులు పోయినా దొర నీల్గుడు తగ్గలేదు.

ఎం.ఎల్.ఎ రాజలింగం దొరను కలిశాడు. దళిత ఎం.ఎల్.ఎ దొరతనం లేని దొరకు వంగి వంగి దండాలు పెట్టాడు. ఎం.ఎల్.ఎ వెంట సర్పంచు యాదగిరి కూడా దొరదగ్గరికి వెళ్లాడు. యాదగిరి పంచాయితీలో జరుగుతున్న తప్పులను దొర ఎత్తిచూపాడు. ఆ విషయంలో సర్పంచుపై దొర పెత్తనం చేస్తూ మాట్లాడినప్పటికీ సర్పంచు భరిస్తూ ఉండడం రాజకీయ, వ్యక్తిగత లబ్ధి కోసమే అని ఈ కథ తెలియజేస్తుంది.

రెండవసారి ఎం.ఎల్.ఎ అయిన రాజలింగంను కూడా దొర శాసిస్తున్నాడు. అన్నీటికి అణిగి మణిగి ఉన్నాడు ఎం.ఎల్.ఎ. అందుకు కారణం తనకు మంత్రి పదవి కావాలని, అందుకు దొర సహకారం కోసం అన్నీ భరిస్తున్నాడు. దొర తోడల్లుని అల్లుడే ప్రస్తుత ముఖ్యమంత్రి. ఓ మాట చెప్పి తనకు మంత్రి పదవి ఇప్పించమని రాజలింగం దొరకు దండం పెట్టడమే కాదు.. కాళ్లమీద కూడా పడ్డాడు.. ఇలాంటివాళ్ల ఉన్నంత కాలం అభివృద్ధి జరగదని రచయిత్రి ఈ కథ ద్వారా చెప్పకనే చెప్పారు.

ఇలా ఈ నిత్యకల్లోలం కథల సంపుటిలో సుజాతారెడ్డి రాసిన కథలన్నీ మంచి ఇతివృత్తంతో, వైవిధ్య భరితంగా రూపొందినవే. ఏ కథకు ఆ కథే పోటీపడతాయి. ఆమె కథలు కొన్ని అభివృద్ధిని కాంక్షిస్తాయి. మరికొన్ని సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తాయి. ఇంకొన్ని పురుషాహంకారాన్ని దుయ్యబడతాయి. ఏది మంచో, ఏది చెడో రచయిత్రి తనకు తానుగా చెప్పక పోవడం, కేవలం సంఘటనలను మాత్రమే రాయడం, చర్చ పాఠకులకే వదిలి వేయడం ఈ సంపుటిలో పొందు పరిచిన కథల్లోని విభిన్నత.

కవిత

# పునర్జన్మ



శీలం భద్రయ్య, 98858 38288

చెట్టుకు చేతులు లేవు
మనిషి చేతుల చేతలకు విలువలేదు
తెగనరికెను తరగని కలలను
చిరుపాపల చిగురుల తలలను
చెట్టుకు భాష లేదు
మౌనంతో ప్రకృతిని శాసించే
చిరుమొగ్గల పువ్వులతో భాషించే
మనిషికి భాషే భూషణం
అది వ్యర్థమే తెలియని చెట్టుకూ పిట్టకూ
చివరికి  మనిషికీ
మాటే మనిషికి గాయం
మౌనం కలిమిమంత్రం  చెలిమితంత్రం
చెట్టుకు కన్నులు లేవు  కలతలు రావు
కలలను తీర్చే కలతల కరువును
మాపే కన్నతల్లి కల్పవల్లి
చెట్టుకు కాళ్ళు లేవు నడక లేదు
నీడను పరిచి తోడుగ నడిచి కడవరకు నిలిచే
చెట్టుకు బంధాలు లేవు
మనిషి బిడ్డలు మనుమలు
తరాల బ్రతుకుకు తలారి పనులు
తరువు ప్రకృతికి తెగని బొడ్డుత్రాడు
తరాల బ్రతుకుకు తరగని పుట్టుక
చెట్టుకు ఉద్వేగం లేదు
పచ్చని చెట్లు ఒక్కటై జట్టును కట్టు
కొట్టిన వెంటనే కొత్తగా మొలుచును
అమ్మకు పునర్జన్మ
అవనికి లేదు మరణం
పునరపి జననం పునరపి మరణం



కథ

# తురుం ఖాన్

తుర్రేబాజ్ ఖాన్ సాహసం స్మరణకు తెచ్చిన కథ....



పుట్టగంటి గోపీకృష్ణ
94910 91620

(ఉగాది కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ...)

హెడ్ కానిస్టేబుల్ రహీమ్ ఎదుటి వ్యక్తి చెంప ఛెళ్లుమనిపించాడు. అయినా కోపం తగ్గక అతని కడుపులో గుద్దాడు. జుట్టు పట్టుకుని వంగదీసి వీపు మీద బాదాడు. అన్నిటినీ మించి... ఇన్ని చేసినా అతని దగ్గర మామూలు వసూలు చేయలేక పోయాడు. ఒక నికార్సయిన పోలీసుకి ఇంతకంటే అవమానం ఇంకే ముంటుంది?

అవమానం కలిగించిన బాధ కంటే ఆయాసం కలిగించిన నీరసం ఎక్కువవటంతో రహీమ్ ఒగరుస్తూ నిలబడి పోయాడు. కొన్ని క్షణాల తరువాత ఊపిరి కూడదీసుకుని, "సాలే! ఎంత కావురంరా నీకు? నా పైసలు నాకు ముట్టకపోతే నీకు మూడిందే... బొక్కలిరిసి పోగుపెడత." అన్నాడు ఆయాసంతో గస పెడుతూనే.

ఎదుటి వ్యక్తి పేరు బాసిత్. అసలే నీరసంగా ఉన్న అతను, దెబ్బల బాధతో కూలబడి పోయాడు. బాసిత్ బంగ్లాదేశ్ నుండి దొంగతనంగా వచ్చి పాతబస్తీలో ఉంటున్నాడు. బేగమ్ బజార్లో హోల్‌సేల్ దుకాణాల దగ్గర హమాలీ పని చేస్తాడు. ఒక రోజు కార్డన్ సెర్చ్ చేస్తుంటే అతను బంగ్లాదేశ్ నుండి దొంగతనంగా వచ్చి ఇక్కడ ఉంటున్నాడని రహీమ్‌కి తెలిసింది. అప్పటి నుండి అతన్ని బెదిరించి హఫ్తా వసూలు చేస్తున్నాడు. ఇంతకాలం సాఫీగా సాగిన వ్యవహారం కరోనా కారణంగా లాక్ డౌన్ రావటంతో పట్టాలు తప్పింది. అదే రహీమ్ కోపానికి కారణం.

"నన్ను సంపినా సరే, నేను పైసా కూడా ఇయ్య. ఏడ తెచ్చి ఇమ్మంటావ్? లాక్‌డౌన్, నుండి దుకాణాలు బందున్నయ్. హమాలీలను కూలికి పిలిసెటోడు ఎవడున్నడు. ఎప్పుడూ బొక్కలో పెడతానంటవ్ కదా, పెట్టించు. రెండుపూటలా తిననీకి తిండి అయినా దొరుకుతుంది..." అన్నాడు బాసిత్ అన్నిటికీ తెగించినట్లు నిర్వికారంగా చూస్తూ.

డ్రైనేజ్ గోడని ఆధారం చేసుకుని నిలిపిన టార్పాలిన్ పట్టాల గుడిశె అది. జోరున కురుస్తున్న వానకి నీటి చుక్కలు ఎక్కడ పడితే అక్కడ పడుతున్నాయి.

రహీమ్ ఆయాసం తగ్గింది. దానితో ఆవేశం కూడా తగ్గింది. వాన చినుకులు పడని ప్రదేశం చూసుకుని, తను కూడా కింద బాసిత్ పక్కన కూర్చుని ఒక బీడీ వెలిగించాడు. 'లోకమంతా మహమ్మారికి భయపడి ఇంట్లో కూర్చొబట్టె. ఈడి దగ్గర పైసలు ఏడ ఉంటాయి?' అనుకున్నాడతను. మరీ ఎక్కువ కొట్టి తప్పు చేశానేమో అని రహీమ్‌కి కూడా అనిపించింది. ఆ అపరాధ భావం తగ్గించుకోవటానికి బాసిత్‌కి ఒక బీడీ ఇచ్చాడు. బాసిత్ కూడా కాదనకుండా బీడీ తీసుకున్నాడు. ఇద్దరు బీడీలు వెలిగించారు. ఎదురుగా ఎముకల గూడులా ఉన్న బాసిత్ వైపు దీర్ఘంగా చూసి, మనసులోనే జాలిపడ్డాడు రహీమ్. అయినా అలవాటయిన అధికార స్వరంతో, "పోలీసోడికే ఎదురు తిరిగినావంటే ఎంత బలిసిందిరా నీకు? ఆ దేశం నుండి వచ్చి దొంగ బతుకు బతుకుతూ ఇంత కావరమారా?" అన్నాడు. అయితే ఆ మాటల్లో మునుపటి ఉద్రేకం లేదు.

"నాది దొంగ బతుకు ఎట్టయితది కాకా? కూలి చేసుకుని బతుకుతుండా" తిండి పెట్టిన కృతజ్ఞతతో 'కాకా' అని చేర్చి అన్నాడు బాసిత్.

"తురుంఖాన్ లెక్క రొమ్ము ఇరుసుకుని, ఈ సిటీ ఏదో నీ అబ్బ జాగీరు అన్నట్లు సెప్తుండవు. ఇది మా దేశం. ఇక్కడ నువు కూలి చేయనీకి చట్టం ఒప్పుకోదు. తెలుసునా?"

బాసిత్ చివుక్కున తల ఎత్తాడు. "నేను ఇక్కడ పుట్టకపోతే ఏమాయె? మా తాత ఇక్కడే పుట్టిండు." అన్నాడు. అంతటితో ఆగలే, "మాట్లాడితే 'తురుంఖాన్' లెక్క అంటావ్, ఔ, నేను తురుంఖాన్ లెక్కనే. నా సంగతి పక్కన పెట్టు. అసలు నీకు ఆ తురుంఖాన్ ఎవడో, ఎక్కడి వాడో తెలుసునా?" అని ఎదురు ప్రశ్నించాడు.

అయోమయంగా చూశాడు రహీమ్. తురుంఖాన్ అనే మాట వాడటమే తప్ప అలాంటి మనిషి ఒకడుండే వాడని అతనికి తెలియదు. తనకి తెలియదని ఒప్పు కోవటానికి అహం అడ్డు వచ్చి, "నీకు తెలుసునా?" అన్నాడు.

బాసిత్ మరో బీడీ ఇవ్వమన్నట్లు చెయ్యి చాపి, "తెలుసు కాకా. చెప్త, వింటవా?" అన్నాడు.

★ ★ ★

1857, జులై 15.

మౌల్వీ అల్లాఉద్దీన్ మక్కా మసీద్ ఆవరణ నుండి బయటకు వచ్చి టాంగా ఎక్కాడు. తన టాంగాని ఒక వ్యక్తి సైకిల్ మీద అనుసరించటం కను చివరల నుండి చూసినా చూడనట్లే ఉండిపోయాడతను. సిపాయి తిరుగుబాటుదారులకు అతను మద్దతు ఇస్తున్నాడని తెలిసినప్పటి నుండి, అతని మీద బ్రిటిషు వాళ్ళు ఇరవై నాలుగు గంటల నిఘా పెట్టారు. ఆ సంగతి అతనికి తెలుసు. గుండెల వరకు పెరిగిన గడ్డాన్ని నిమురుకుంటూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడతను. బ్రిటిషు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నిజాం రాజ్యంలో పౌరసమాజాన్ని జాగృతం చేస్తున్న అతికొద్దిమందిలో అతను ఒకడు.

బేగమ్ బజార్లోని తన ఇంటికి చేరగానే టాంగా దిగిన మౌల్వీ, కొద్ది దూరంలో ఆగిన సైకిల్ మీద వ్యక్తిని సూటిగా చూశాడు. అతని వాలకాన్ని బట్టి నిజాం సైనికులలో ఒకడిగా గుర్తించాడు. "ఈ బ్రిటిషు వాళ్ళు మన వేళ్లతో మన కళ్లనే పొడిపించటంలో దిట్టలు. ఈ నిజాం అది అర్థం చేసుకోడు" అనుకుంటూ ఇంట్లోకి దారి తీశాడు.

దాదాపు అర్ధరాత్రి అవుతుండగా చప్పుడు చేయకుండా ఆ ఇంట్లోకి ప్రవేశించాడు తుర్రెబాజ్ ఖాన్. అతను కూడా బేగం బజార్ నివాసే. మౌల్వీ అల్లాఉద్దీన్ భావాలను నూటికి నూరు శాతం వంట పట్టించుకున్నవాడు.

"ఏంటి ఇంత ఆలస్యం?" అన్నాడు మౌల్వీ.

"ఇంటి ముందు ఒకడు, ఇంటి వెనుక ఒకడు ఇద్దరు జాసూస్లు ఉన్నారు. వారి చూపుకు అందకుండా వచ్చేటప్పటికి ఇంత సేపు పట్టింది" చెప్పాడు తుర్రెబాజ్ ఖాన్.

"ఇంటి ముందు ఉన్న వాడిని నేను చూశాను. వెనుక కూడా మరొకడు ఉన్నాడా?"

"అవన్నీ వదిలెయ్యండి మౌల్వీజీ. అసలు విషయాలు చెప్పండి"

"తుర్రెబాజ్ ఖాన్ దేశం మొత్తం బ్రిటిషోళ్లకి వ్యతిరేకంగా పోరాటం ఉధృతం అవుతోంది. హిందూ ముస్లిము లందరూ ఏకమౌతున్నారు. దేశం నుండి బ్రిటిషు వాళ్లని తరిమికొట్టి, బహదూర్ షా జఫర్‌ని ఢిల్లీ పీఠం మీద కూర్చోపెట్టటానికి మీరట్, లక్నో, కాన్పూర్, గ్వాలియర్, ఝాన్సీ, పాట్నా, బెంగాల్ నుండి తిరుగుబాటు దళాలు ఢిల్లీ చేరుకుం టున్నాయి".

"మరి మనం ఏం చేస్తున్నాం?"

"నిజాం సైన్యానికి బ్రిటిషు సైన్యంతో అవగాహన ఉంది. వాళ్ల కోరిక మేరకు నిజాం తన సైన్యాన్ని బ్రిటిషువాళ్లతో కలిసి పోరాడటానికి ఢిల్లీ పంపుతున్నాడు. నిజాం సైన్యంలోని జమేదార్ చీదాఖాన్ మన మాట విని బ్రిటిషు వాళ్ల చెప్పినట్లు ఢిల్లీ వెళ్లటానికి నిరాకరించి తన పటాలంతో సహా వెను తిరిగివచ్చాడు."

"నేను చెప్పబోతున్నది అదే మౌల్వీజీ మీ మాట విని తిరిగి వచ్చిన చీదాఖాన్ని బ్రిటిషు కల్నల్ బ్రిగ్స్ బంధించాడు. మన చీదాఖాన్ మీద దేశద్రోహ నేరం ఆపాదించి, కోటీ లోని రెసిడెన్సీ భవనంలో బంధించి చిత్రహింసలు పెడుతున్నారు. మీ మాట విన్నందుకు చీదాఖాన్‌కి పట్టిన గతి ఇది. దీన్నే బ్రిటిషు వాళ్ల ప్రచారం చేస్తారు. తిరుగుబాటుకు సహకరించే యువకులందరికీ ఇలాంటి శిక్షే పడుతుందని చెప్తారు. ఇక సైన్యం నుండి మన వైపు ఎవరు వస్తారు?"

"అయితే ఏం చేద్దామంటావ్?"

"మీరు 'ఊ...' అనండి. నేను 5000 మంది చాకుల్లాంటి కుర్రాళ్లని తీసుకు వస్తాను. రాత్రికి రాత్రి రెసిడెన్సీ మీద దాడి చేద్దాం. ఆ కల్నల్ బ్రిగ్స్ చెర నుండి చీదాఖాన్ని తప్పించి, తెలంగాణ నుండి మన తిరుగుబాటు మొదలు పెడదాం".

ఎంతో ధైర్యవంతుడయిన మౌల్వీ కూడా ఆ ప్రణాళిక విని అచ్చెరు వొందాడు. "ఇది సాధ్యమంటావా?"

"చెప్పలేను. కానీ నాతో వచ్చే 5000 మంది కుర్రాళ్ల తలా ఒకరిని చంపి కానీ తాము చావరు. అదే జరిగితే బ్రిటిషు వాడి అహంభావం దిగి వస్తుంది. మన నిజాంకి ప్రజలు ఎటువైపు ఉన్నారో తెలుస్తుంది." ధైర్యంగా చెప్పాడు తుర్రెబాజ్ ఖాన్.

జులై 17 రాత్రి జరగాల్సిన మెరుపు దాడి గురించి మరిన్ని వివరాలు చర్చించుకున్న వారిద్దరు, తమ మాటలు మౌల్వీ వంట మనిషి రహస్యంగా వింటున్నాడని గమనించుకోలేదు.

★ ★ ★

1857, జులై 17, అర్ధరాత్రి...

గుర్రం మీద కూర్చున్న తుర్రెబాజ్ ఖాన్ తిరుగుబాటుదారుల జెండా చేతబట్టి దారి తీస్తుంటే, 5000 మంది యువకులు అతని వెనుక బేగం బజార్ నుండి కోటీ రెసిడెన్సీ వైపు కదిలారు. తుర్రెబాజ్ ఖాన్ పక్కన మరో గుర్రం మీద ఉన్న మౌల్వీ అల్లాఉద్దీన్ యువకులకు నైతిక ధైర్యం

**తన** టాంగాని ఒక వ్యక్తి సైకిల్ మీద అనుసరించటం కను చివరల నుండి చూసినా చూడనట్లే ఉండిపోయాడతను. సిపాయి తిరుగుబాటుదారులకు అతను మద్దతు ఇస్తున్నాడని తెలిసినప్పటి నుండి, అతని మీద బ్రిటిషు వాళ్ళు ఇరవై నాలుగు గంటల నిఘా పెట్టారు. ఆ సంగతి అతనికి తెలుసు. గుండెల వరకు పెరిగిన గడ్డాన్ని నిమురుకుంటూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడతను. బ్రిటిషు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నిజాం రాజ్యంలో పౌరసమాజాన్ని జాగృతం చేస్తున్న అతికొద్దిమందిలో అతను ఒకడు.

ఇస్తున్నాడు.

చూస్తుండగానే తుర్రెబాజ్ సైన్యం రెసిడెన్సీ భవనాన్ని సమీపించింది.

రెసిడెన్సీ భవనంలో మామూలుగా అయితే పాతిక మంది కంటే సైనికులు ఉండరు. కానీ తుర్రెబాజ్ ఖాన్, మౌల్వీ అల్లాఉద్దీన్ చేయబోతున్న దాడి గురించి గూఢచారుల ద్వారా తెలుసుకున్న కల్నల్ బ్రిగ్స్ వ్యూహాత్మక ప్రదేశాల్లో ముందుగానే సైన్యాన్ని మోహరించాడు. వారికి అధునాతన తుపాకులు ఇచ్చాడు. రెండు తేలికపాటి ఫిరంగులను రెసిడెన్సీ భవనం మీదకి చేర్పించి ఉంచాడు. ఇంత చేసి కూడా అతను ఏ హడావుడీ లేకుండా తుర్రెబాజ్ సైన్యాన్ని మునుముందుకు రానిచ్చాడు.

దారి పొడుగునా ఉన్న పౌరుల భవనాల్లో కూడా బ్రిటిషు సైనికులు రహస్యంగా దాగి ఉన్నారు. ఒకసారి తుర్రెబాజ్ సైన్యం పూర్తిగా తనకు అందుబాటులోకి వచ్చిందనుకున్న తరువాత కల్నల్ తన దాడి మొదలు పెట్టాడు.



దారి పొడుగునా ఉన్న భవనాల కిటికీల నుండి బ్రిటిషు సైనికుల తుపాకులు గర్జిస్తున్నాయి. రెసిడెన్సీ భవనం మీద నుండి ఫిరంగులు ముందుకు వస్తున్న తిరుగుబాటు దారులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. దాడి మొదలయిన క్షణాల్లోనే వందలాది మంది తుర్రెబాజ్ సైనికులు చనిపోయారు. అయితే తుర్రెబాజ్ భయపడ లేదు. తన వ్యూహాన్ని మార్చాడు. తన సైన్యాన్ని కూడా భవనాల మీదకి చేర్చాడు. తమ దగ్గర ఉన్న అతి కొద్ది తుపాకులతో రెసిడెన్సీ భవనం మీదకి కాల్పులు మొదలు పెట్టాడు. తను స్వయంగా జైభగవాన్ దాస్ అనే వడ్డీ వ్యాపారి ఇంటి మీద నిలబడి దాడి చేయించటం మొదలు పెట్టాడు.

అదను చూసుకుని రెసిడెన్సీ భవనం మీదకి దూసుకు వెళ్లటానికి తిరుగుబాటుదారులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఫిరంగుల దాడిలో చనిపోతూనే ఉన్నారు. అయినా భయపడకుండా ముందుకే నడుస్తున్నారు. దారిలో కనిపించిన బ్రిటిషు సైనికులను మట్టుబెడుతున్నారు. బ్రిటిషు సైన్యం వైపు జరుగుతున్న నష్టం నామ మాత్రమే కావొచ్చు, కానీ అది వారి స్వాభిమానాన్ని దెబ్బ తీసే స్థాయిలో ఉంది. దాడి జరుగుతుందని ముందు తెలిసినా శిక్షణ లేని గుంపు ఇంతగా ప్రతిఘటిస్తుందని వారు ఊహించలేదు.

సమయం గడిచే కొద్దీ తిరుగు బాటుదారుల సంఖ్య పలుచబడింది. అయినా తుర్రెబాజ్ వెనక్కి తగ్గలేదు. తన పోరాటం కొనసాగిస్తూనే ఉన్నాడు. నెమ్మది నెమ్మదిగా బ్రిటిషు సైన్యం భవనాలను అడ్డు చేసుకుని ముందుకువస్తోంది. వందల తుపాకులు పేలుతున్నాయి. తుర్రెబాజ్ తూటాలు అయిపోయిన తుపాకిని పక్కన పెట్టి కరవాలం అందుకున్నాడు. అతని ఉగ్ర రూపం చూసి శత్రువులు అచ్చెరువొందుతూనే ముందుకు వస్తున్నారు. మరి కొన్ని క్షణాల్లో అతని అంతం ఖాయం అని అందరికీ తెలిసిపోతోంది.

ఇంతలో మరో భవనం మీద నిలబడి తన యువకులను ప్రోత్సాహపరుస్తున్న మౌల్వీ అల్లావుద్దీన్ కుడి భుజంలో బుల్లెట్ దిగింది. అతను కూలబడి పోయాడు.

అది చూసిన తుర్రెబాజ్ ఖాన్ పరుగెత్తుతూ అతని దగ్గరకు వచ్చాడు. అతనికి సహాయం చేయబోయాడు. "తుర్రెబాజ్! నన్ను వదిలేసి, నువు తప్పించుకో. నీలాంటి వాళ్ళు పది మంది ఉంటే చాలు ఈ బ్రిటిషు వాళ్లని వెనక్కి పంపగలుగుతాం. నా ప్రాణాల కంటే నీ ప్రాణాలు విలువయినవి. తప్పించుకో" అన్నాడు మౌల్వీ.

తుర్రెబాజ్ ఖాన్‌కి కూడా మరో మార్గం కనిపించ లేదు.

★ ★ ★

అయితే తుర్రెబాజ్ ఎన్నో రోజులు తప్పించుకోలేక పోయాడు. 1857, జులై 22న అషూరా ఖానా వద్ద దాక్కున్న అతన్ని ఒక ద్రోహి అందించిన సమాచారం ఆధారంగా పట్టుకున్నారు. మౌల్వీ అల్లా ఉద్దీన్, తుర్రెబాజ్ ఖాన్‌లు ఇద్దరికి ద్వీపాంతరవాస శిక్ష విధించారు.

అండమాన్ లోని కాలాపానీ జైలుకు తరలించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

★ ★ ★

ఆ జైలు గదిలో మౌల్వీ, తుర్రెబాజ్ తో పాటు తురబ్ ఖాన్ కూడా ఉన్నాడు. ముగ్గురూ కాలాపానీ జైలుకు పంపించ బోతున్నవారే. ఏ రెసిడెన్సీ భవనం నుండి చీదాఖాన్ని తప్పించాలనుకున్నారో, అదే భవనంలో మరో గదిలో వారు ఖైదు చేయబడ్డారు.

"మనం ఎలా అయినా తప్పించు కోవాలి" సాలోచనగా అన్నాడు తుర్రెబాజ్

ఖాన్. "ఆ అండమాన్ జైలులో చచ్చే కంటే తప్పించుకుంటూ జన్మభూమి మీద చావటం నయం."

"మనం అనకు. అది నా వల్ల కాదు. అసలే తుపాకీ దెబ్బకి కుడిచేయి చచ్చుబడిపోయింది." అన్నాడు మౌల్వీ అల్లాఉద్దీన్. "నువు ప్రయత్నించు. తప్పించుకుంటే, విప్లవం గెలుస్తుంది. లేదంటే నీ కోరిక తీరుతుంది కానీ అది సాధ్యమా?" అన్నాడు అనుమానంగా.

"ఒక మార్గం ఉంది" అన్నాడు తురబ్ ఖాన్. "నాలాంటి వృద్ధుడు ఆ మార్గంలో తప్పించుకోలేడు. కానీ నీలాంటి వీరుడు ప్రయత్నించవచ్చు."

మిగిలిన ఇద్దరూ అతని వైపు చూశారు.

చివరికి తురుంఖాన్ జైలు నుండి తప్పించుకున్నాడు.

★ ★ ★

1859, జనవరి 18...

తుర్రెబాజ్ ఖాన్ జైలు నుండి తప్పించుకున్న వార్త హైదరాబాద్ నగరం మొత్తం వ్యాపించింది. చిన్న పిల్లలు కూడా బ్రిటిషు వాళ్లని చూసి నవ్వసాగారు. 'నేనే తురుంఖాన్' అంటూ తొడలు కొడుతున్నారు.

అవమానంతో రగిలిన బ్రిటిషు కల్నల్ తుర్రెబాజ్ ఖాన్ ఆచూకీ చెప్పిన వారికి 5000 రూపాయల బహుమతి ప్రకటించాడు. అంత మొత్తం బహుమతిగా ఇస్తామంటే తుర్రెబాజ్ ఖాన్ ఆచూకీ దానంతటదే వచ్చి వాలుతుందని అతనికి తెలుసు.

తూప్రాన్ అడవుల్లో దాక్కున్న తుర్రెబాజ్ ఖాన్ గురించి అక్కడి తాలూక్దార్ మీర్జా కుర్బాన్ ఆలీ బేగ్‌కి తెలిసింది. 5000 రూపాయలకు ఆశపడిన అతను ఆ విషయం బ్రిటిషు వారికి చేరవేశాడు.

నిమిషాల్లో బ్రిటిషు సైన్యం అక్కడకి చేరుకుంది.

నిర్దాక్షిణ్యంగా తుర్రెబాజ్ ఖాన్ని కాల్చి చంపారు. అక్కడ నుండి నగరం వరకు శవాన్ని గుర్రానికి కట్టి ఈడ్చుకు వచ్చి రెసిడెన్సీ బిల్డింగ్ ముందు వేలాడదీశారు.

"ఇదుగో మీ తురుంఖాన్. ఇప్పుడు తిప్పండి మీసం" అన్నారు బ్రిటిషర్లు గుమికూడిన జనాన్ని చూసి పగులబడి నవ్వుతూ.

'ఇప్పటి వరకు వీడొక్కడే తురుంఖాన్. ఇక నుండి మాలో ప్రతి ఒక్కడూ ఒకొక తురుంఖాన్ అయి మీకు అంతం పలుకుతారు' అని మనసులో అనుకున్నారు జనం. కాలాపానీకి తరలింపబడుతున్న మౌల్వీ అల్లాఉద్దీన్ ఈ విషయం తెలిసి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

27 సంవత్సరాల పాటు ప్రతి రోజూ చిత్రహింసలు అనుభవించిన మౌల్వీ అల్లాఉద్దీన్ 1884లో కాలాపానీ జైలులోనే చనిపోయాడు.

★ ★ ★

"తురుంఖాన్ అనే మాట వెనుక గింత కత ఉందా?" ఆశ్చర్యంగా అన్నాడు రహీమ్.

"నువు రోజు బీటు తిరిగే ఉస్మానియా మెడికల్ కాలేజీ ఎదుర్రోడ్డు పేరేందో ఎరికనా?" రహీమ్‌కి తెలియని విషయాలు తనకి తెలుసన్న ఆత్మవిశ్వాసంతో అడిగాడు బాసిత్.

"ఏందిరో? ఆ రోడ్డు పేరుకు ఈ కతకి కూడా లింకుందా?"

"ఆ రోడ్డు పేరు తుర్రెబాజ్ ఖాన్ రోడ్డు. గట్లనే కోటీ బస్టాండ్ దగ్గర నాలుగు ఏనుగుల దిమ్మ ఉంది గదా. అది తురుంఖాన్ స్మారక్"

"నీకు మస్తు తెలుసురా మరి అప్పటి రెసిడెన్సీ బిల్డింగ్ గిప్పుడు కూడా ఉందా?"

"కోటీ ఉమెన్స్ కాలేజీనే అప్పటి రెసిడెన్సీ బిల్డింగ్"

"అవునా?" ఆశ్చర్యంగా అన్నాడు రహీమ్. "రోజూ ఆ చుట్టుముట్టే తిరుగుతుంటాను. అయినా గీ ముచ్చట్లేమీ నాకు తెల్వదురా మరి ఇన్ని విషయాలు నీకెట్లా తెలిసినయ్యా?" అన్నాడు రహీమ్.

"ఈ దేశం కోసం లడాయి చేసిన వాళ్లలో మా వాళ్లు ఉన్నారు. మా తాత ఇక్కడే పుట్టిండు. స్వాతంత్ర్యం కోసం జైలుకి పోయిండు. దేశం రెండు ముక్కలయి నపుడు సైతాను నెత్తికి పట్టిందో ఏమో ఈస్ట్ పాకిస్తాన్ పోయిండు. మా నాయన ఆడ పాకిస్తాన్లో పుట్టిండు. నేను పుట్టే నాటికి అది బంగ్లాదేశ్ అయింది. నేల మీద నిలువు గీత గీసి నువు ఆ దిక్కు ఉన్నావు కాబట్టి నీకు ఈ నేలతో సంబంధం లేదంటే తెగిపోయే బంధమా కాకా ఇది" కన్నీళ్లతో అన్నాడు బాసిత్.

అంతా విన్న రహీమ్ బేజారయ్యాడు. ఈడిది బంగ్లాదేశ్. ఈడి అయ్యది పాకిస్తాన్. ఈడి తాత ఇండియన్. పైగా ఈ దేశం కోసం జైలుకి పోయాడు. "భలే ముచ్చట చెప్పినవ్." అన్నాడు రహీమ్. ఇంతలో ఏదో అనుమానం వచ్చి. "రేయ్! నీకు పొట్ట పొడిస్తే అచ్చరం ముక్క రాదు కదా. పాతకాలం నాటి ముచ్చట్లన్నీ ఎలా తెలుసుకున్నవ్?" అని అడిగాడు.

"ఈడకి రాకముందే నాకు ఈ కతంతా తెలుసు. తుర్రెబాజ్ ఖాన్, మౌల్వీ అల్లాఉద్దీన్తో పాటు జైలుగదిలో తురబ్ ఖాన్ అని మూడో వ్యక్తి ఉన్నాడని జెప్పాగా. తను మా తాతకి తాత తను కూడా కాలాపానీలోనే సచ్చిపోయిండు." అన్నాడు బాసిత్ అదేదో మామూలు విషయం లాగా. "ఈ కతలన్నీ చిన్నప్పటి సంది ఇన్నయ్యే కాకా"

రహీమ్ ఆలోచనలో పడ్డాడు. ఈ బాసిత్ తాత స్వాతంత్రం కోసం జైలుకు వెళ్లాడు. ఇంకా ముందు తరాల వాళ్లు కాలాపానీలో ప్రాణాలు ఇచ్చారు. కానీ ఇప్పుడు వీడు ఈ దేశంలో ఉండటం కూడా నేరం. ఇదెక్కడి న్యాయం, ఇదెక్కడి చట్టం అనిపించింది రహీమ్‌కి. కానీ అలాంటి ప్రశ్నలను పైకి ఎదగనిస్తే తన అస్తిత్వమే ప్రశ్నార్థకం అవుతుంది కాబట్టి, "ఇంత మంచి ఊసు చెప్పినందుకు నీకు ఒక తోఫా ఇయ్యాలే ఏమిస్తే మంచి గుంటది?" అని దీర్ఘంగా ఆలోచించి, "ఆ!... నీ హఫ్తా మాఫ్ చేస్తుండ బిడ్డా. ఇగ నీ దగ్గరికి రాను" అంటూ తనకు చేతనయిన న్యాయం చేసి అక్కడ నుండి వెళ్ళి పోయాడు రహీమ్.

ము
ఖా
ము
ఖి

# పద్యం అంటే ఇష్టపడ్డా, వచన కవిత్వాన్ని వ్యతిరేకించను.... - మసన చెన్నప్ప

సంప్రదాయంలోని సమకాలీనతను గుర్తించిన కవితా ముఖాముఖి..




మామిడాల రమేశ్‌బాబు
96528 13779




ఆచార్య మసన చెన్నప్ప తల్లిదండ్రులు మసన రమలక్ష్మమ్మ, బుచ్చయ్య. వీరి స్వగ్రామం కొల్కులపల్లి, మాడ్గుల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా. మసన చెన్నప్ప 'ఆర్షకవి'గా సుప్రసిద్ధులు. ఉస్మానియా విశ్వవిద్యాలయ, తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు. ఎం.ఏ. తెలుగులో గురజాడ అప్పారావు స్వర్ణపతక గ్రహీత. నలభై సంవత్సరాల బోధనానుభవం కల్గిన అధ్యాపకులు. ముప్పది ఆరు గ్రంథాలను రచించారు. ఉపనిషత్తులను అనితర సాధ్యంగా నాల్గువేల ముత్యాల సరాలలో తెనిగించిన ఉత్తమ అనువాదకులు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత 2014లో 'ఉత్తమ అధ్యాపక' బిరుదు పొందారు. తన 18 ఏండ్లకే ద్వాదశ భాషా పండితులైన గుండేరావ్ హర్కారే వద్ద సంస్కృత కావ్యాలు అధ్యయనం చేశారు. 'కళాప్రపూర్ణ' వేదవేదాంగ వేత్త పండిత గోపదేవశాస్త్రి అంతేవాసియై రోజుకు ఆరుగంటల చొప్పున ఒక ఏడాది కాలం పూర్వ మీమాంస తప్ప తక్కిన ఐదు దర్శనాలను అభ్యసించారు. ఇరవై ఐదేండ్లుగా వేదవేదాంగాలను, ఉపనిషత్తులను, దర్శన గ్రంథాలను, భగవద్గీతను గూర్చి ప్రవచనాలిస్తున్నారు. ఈనాడు 'అంతర్యామి', నమస్తే తెలంగాణ 'చింతన'కు శతాధిక వ్యాసాలను అందించారు. ఇప్పటివరకు ఆరు ఉపనిషత్ సప్తాహాలను నిర్వహించి స్వయంగా ప్రసంగించారు. వేద సిద్ధాంతమైన త్రిత్వాన్ని ప్రచారం చేస్తున్నారు. వేదోద్ధారకులైన మహర్షి దయానంద సరస్వతి మార్గంలో నడుస్తున్నారు.

**విశిష్ట పద్యకవిగా, ప్రముఖ సాహితీవేత్తగా ఎదగడానికి తోడ్పడిన పరిస్థితులెలాంటివి? ఆ అనుభవాలను చెప్తారా!**

నేను పుట్టకముందే మా ఇంట్లో పోతనగారి భాగవత ప్రతి ఉంది. బాల్యంలో ఉండగానే మా అన్నయ్యలు భాగవతం చదువుతుంటే మా నాన్నగారు అర్థం చెప్పేవారు. భాగవత పద్యాలను శ్రవణం చేయడం వల్ల, కంఠస్థం చేయడం వల్ల, తిరిగి వీటిని ఇతరులకు వినిపించడం వల్ల నాలో పద్యానురక్తి ఏర్పడింది. మా నాన్నగారు చిన్నప్పుడే భాగవతం నాచే చదివించడం వల్ల భగవంతుని పట్ల విశ్వాసం కూడా పెరిగింది.

హైస్కూల్‌లో 6వ తరగతిలో ఉన్నప్పుడు అడపాల నరసింహారెడ్డి, ఎలిశెట్టి బాలకృష్ణ నాకు ఛందస్సు నేర్పారు. వారి వలన పద్యాలు రాయడం నేర్చుకున్నాను. సుమతి, వేమన శతక పద్యాలు, భాగవత పద్యాలు కంఠస్థమయ్యాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తులో చదివేటప్పుడు ప్రాచ్య వాఙ్మయం పట్ల శ్రద్ధాభక్తులు కల్గించినవారు ఆచార్య రవ్వా శ్రీహరి, ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు గార్లు. పరిషత్తు పక్షాన వెలువడే 'నెలవంక' వార్షిక సంచిక' (1975) కు నేను ఎడిటర్‌నయ్యాను. యువభారతి వారి పుస్తకాలు ఎక్కువగా చదివేవాణ్ణి. దివాకర్ల వేంకటావధాని ఉపన్యాసాలు నామీద ప్రభావం చూపాయి. నేనొక రచయితను కావాలన్న కోరిక అప్పుడే కల్గింది. 1971 నుండి 73 దాకా మునిమాణిక్యం నరసింహారావు దగ్గర లేఖకునిగా పని చేయడం వల్ల నాకు రచన చేయడం సులభమైంది. పరిషత్తులో తరుచుగా 'అంత్యాక్షరి' పద్యపోటీలు జరిగేవి. ఒకసారి తెలుగు అకాడమీ నుండి ముకురాల రామారెడ్డి, ఉత్పల సత్యనారాయణాచార్యులు న్యాయనిర్ణేతలుగా వచ్చినప్పుడే నేను ఆశువుగా పద్యాలు చెప్పినాను. వారిద్దరి ఆశీర్వాదం నన్ను పద్యకవిగా మార్చింది.

ముఖాముఖి

**రచయితగా మిమ్మల్ని ప్రభావితం చేసినవారెవరు?**

పరిషత్తులో జరిగే కార్యక్రమాల్లో శ్రీశ్రీ నుండి శ్రీపాద వరకు మహారచయిత లందరూ పాల్గొన్నారు. వారిని చూసినప్పుడు భవిష్యత్తులో నేనూ రచయి తను కావాలన్న కోరిక ప్రభవించింది. రచయితను కావడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యుల ప్రోత్సాహం కూడా లభించింది. నా మొట్టమొదటి రచన 'మల్లి పదాలు' (ప్రచురణ 1980) అప్పుడే సినారెతో ఇరివెంటివారి ద్వారా పరిచయం కల్గింది. ఎం.ఏ., చదువు తుండగానే పరిశోధన వైపు నా దృష్టిని మళ్ళించినవారు ఆచార్య కె. గోపాలకృష్ణారావు, వేటూరి ఆనందమూర్తి గార్లు. విద్యాలయాలకు బయట నా మీద బాగా ప్రభావం చూపిన పండితులు గుండేరావు హర్కారే గారు. వారు పన్నెండు భాషల పండితులు. ఓల్డ్ సిటీలో ఉండేవారు. వారు సెషన్ జడ్జీగా పనిచేసి నిజాం కాలంలోనే రిటైర్డ్ అయ్యారు. వారు పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని సంస్కృతీకరించినప్పుడు వారికి నేను లేఖకునిగా ఉన్నాను. గుండేరావు వల్లనే సంస్కృత భాషా సాహిత్యాలతో పరిచయం ఏర్పడింది. వారు నన్ను 'కవీశ్వరా' అని పిలిచేవారు. నేను 'తాతయ్యా' అని పిలిచేవాణ్ణి. అప్పుడు వారి వయస్సు 86. నా వయస్సు 16. వారి మాటను నా జీవితంలో సార్థకం చేసుకోవాలనే కోరిక నెరవేరింది.

**ఉద్యోగ జీవితం, విద్యార్థులతో మీ అనుభవాలేమిటి?**

నేను మొత్తం నలభై (40) ఏండ్ల అధ్యాపక వృత్తిలో ఉన్నాను. నా 20 ఏండ్లకే నేను ఇస్లామియా బాయిస్ హైస్కూల్ (సికింద్రాబాద్) లో తెలుగు పండితునిగా చేరాను. నిజాం కాలేజి సాయం కళాశాలలో చదివి ఓ.యూ. నుండి ఎం.ఏ.,లో సర్వ ప్రథమునిగా నిలిచి గురజాడ అప్పారావు గోల్డ్ మెడల్ అందుకున్నాను. 1981లో ప్రగతి మహావిద్యాలయంలో లెక్చరర్‌గా చేరి 1989 దాకా పనిచేశాను. ఈ మధ్య కాలంలో ఎం.ఫిల్., పిహెచ్.డి., డిగ్రీలు సంపాదించాను. 1989లో ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాను. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా, శాఖాధ్యక్షునిగా పనిచేసి 2015లో పదవీ విరమణ చేశాను. నాకు విద్యార్థులంటే ఎంత ప్రేమనో విద్యార్థులకు కూడా నేనంటే అంతే ప్రేమ. ఇప్పటివరకు నా పర్యవేక్షణలో 8 మంది ఎం.ఫిల్., డిగ్రీలు, 20 మంది పిహెచ్.డి. డిగ్రీలు తీసుకు న్నారు. నాకు చదువు చెప్పిన గురువులు నన్ను తమకంటే గొప్పవానిగా చూడాలను కున్నట్లే నేను కూడా నా విద్యార్థులను నా కంటే గొప్పవాళ్ళుగా చూడాలనుకున్నాను. చాలా మంది నా విద్యార్థులు కవులయ్యారు. రచయితలయ్యారు. ఆచార్యులయ్యారు. 40 ఏండ్లలో ఏ ఒక్క విద్యార్థి కూడా నాతో గొడవ పడకపోవడం నా అదృష్టం.



**అందుకున్న పురస్కారాలు, గుర్తింపులు తెలపండి.**

1989లో సిద్దిపేట జాతీయ సాహిత్య పరిషత్ పక్షాన 'తడకమళ్ళ సాహితీ పురస్కారం' అందుకున్నాను. అది మొదలు నేటివరకు నేను అందుకున్న పురస్కారాలు 35 వరకున్నాయి. వీటిలో తెలుగు విశ్వవిద్యాలయం వారి 'కీర్తిపురస్కారం' ఒకటి. ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం వారు 'జాతీయ కవి పురస్కారం' ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014లో 'బెస్ట్ టీచర్ అవార్డు' ఇచ్చింది. 'ఖమ్మం సృజనసాహితీ సమితి' వారు 'జీవన సాఫల్య పురస్కారం' ఇచ్చారు. 'సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్టు', భీమునిపట్నం, వైజాగ్ వారు 2018లో 'జాతీయ ప్రతిభా పురస్కారం' ఇచ్చారు. 'తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం' 2017లో 'పద్మరత్న లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' ఇచ్చింది. 'గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్' 2019లో 'జీవన సాఫల్య పురస్కారం' ఇచ్చింది. 2021లో 'గ్రేటర్ అట్లాంటా తెలుగు అసోసియేషన్', అమెరికా 'గాటా ఉగాది సాహిత్య పురస్కారం' ఇచ్చారు. ఇవన్నీ నా 40 ఏండ్ల సాహిత్య కృషిని చూసి ఇవ్వబడినవే. ఐతే వీటిలో నేను కోరితే వచ్చిన అవార్డు ఒక్కటి కూడా లేదు. జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో సభల్లో పాల్గొన్నాను. అమెరికాలోని షికాగోలో 2009లో జరిగిన 'తానా' సభల్లో పాల్గొన్నాను. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో 2012లో జరిగిన 'నాట్స్' సభల్లో పాల్గొని ఉపనిషత్తుల మీద మాట్లాడాను. ఆస్ట్రేలియా (మెల్‌బోర్న్)లో 2012లో జరిగిన సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్నాను. ఉపనిషత్తులుపై ప్రసంగించాను.

పూణె, బెంగుళూరు, షోలాపూర్, బొంబాయి, మద్రాసు నగరాల్లో ఎన్నోమార్లు సాహిత్య సభల్లో పాల్గొన్నాను. 50కి పైగా సెమినార్లలో పత్ర సమర్పణ చేశాను. 'మా టీవీ' వారు 2010లో నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీతా శ్లోకాల పోటీకి న్యాయనిర్ణేతగా ఉన్నాను. 'జయ జయ శంకర' టీ.వి. ఛానల్‌లో 40

ముఖాముఖి

ఎపిసోడ్‌లలో ఉపనిషత్తుల మీద ప్రసంగించాను. కొంతకాలం 'ఫిలిం సెన్సార్ బోర్డు' సభ్యునిగా పనిచేశాను.

ఈనాడు పత్రికలో 'అంతర్యామి' శీర్షికలో 40 ఆధ్యాత్మిక వ్యాసాలు ప్రచురితమయ్యాయి. అట్లే 'నమస్తే తెలంగాణ' దినపత్రిక 'చింతన'లో నూటికి పైగా ఆధ్యాత్మిక వ్యాసాలు అచ్చైనవి. అవి చింతన-1, చింతన-2 పుస్తకాలుగా వచ్చాయి.

**పద్యం అంటే మక్కువ ఎందుకు?**

తెలుగు పద్యం హృద్యమైంది. అదంటే నాకు ప్రాణం. బ్రాహ్మీ ముహూర్తంలో పడక మీదనే ఉండి తెలుగు పద్యాలను నెమరువేయడం నాకిప్పటికీ అలవాటు.

"నవ్యమైనది సవ్యమైనది
దివ్యమైనది భవ్యమైనది
శ్రావ్యమైనది కావ్యమైనది
తెలుగులో ఒక పద్యమే"- అని నా భావన.

'ప్రాచీన కావ్యాల్లో గ్రామీణ జీవన చిత్రణ' నా పిహెచ్.డి. పరిశోధనాంశం. అందుకే పద్య కావ్యాలు బాగా చదవడం అలవాటైంది. ఆధునిక పద్య కవులైన విశ్వనాథ, జాషువా, కరుణశ్రీ, దాశరథి, ఉత్పల, వానమామలై మొదలైన కవుల పద్యాలు బాగా నన్నాకర్షించాయి. నా కలం నుండి 'తెలంగాణోదయం' (2013), 'శుకోపనిషత్తు' (2013), 'ప్రమీలా త్రిశతి' (2016), 'మాతృగీత' (2021), 'వేదమాత' (2021), 'దరిసెనం' (2021), 'కోకిల' (2021), మొదలైన పద్యకృతులు వచ్చాయి. సులభశైలిలో పద్యరచన చేయడం నా కిష్టమైన పని. ఆశువుగా ఎన్ని పద్యాలైనా చెప్పగలను.

**ఉపనిషత్తులతో మీకున్న అనుబంధం ఏమిటి?**

వేదాల తర్వాత ఉపనిషత్తులకే ప్రసిద్ధి. నాకు ఆధ్యాత్మికంగా నూతన జన్మను ప్రసాదించిన గురువు 'కళాప్రపూర్ణ' పండిత గోపదేవశాస్త్రి. ఆజన్మ బ్రహ్మచారి. ఆయన 1995లో తన 100వ ఏట నాకు పరిచయమయ్యాడు. ఏడాదికాలంలో వేద పరిచయంతో పాటు షడ్దర్శనాల్లో ఒక

**వైదిక సంప్రదాయం విశిష్టమైంది. మనిషిని మనిషిగా చేసి దు:ఖం నుండి బయట పడవేసే విద్య ఉపనిషత్తుల్లో ఉంది. అందుకే నేను ప్రతిరోజు 2 ఏండ్లుగా గూగుల్ మీట్‌లో వేదోపనిషత్తులపై ప్రసంగిస్తున్నాను. వందలమంది నా ప్రసంగాలు వింటారు. నేనెన్నడూ భగవద్గీతను మరవలేదు. అది మన భారతీయ సంస్కృతికి ఆత్మలాంటిది.**

పూర్వ మీమాంస తప్ప న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, ఉత్తర మీమాంసలను రోజుకు ఆరు గంటల చొప్పున బోధించాడు. 10 ఉపనిషత్తులను చదివించాడు. తెలుగునాట ఆయన గొప్ప దార్శనికుడు. జీవితమంతా దయానంద సరస్వతి మార్గంలో నడిచినాడు. నన్ను కూడా నడిపించినాడు. అందుకే నేను 25 ఏండ్లుగా వేద ప్రచారం చేస్తున్నాను. ఇప్పటిదాకా ఆరు ఉపనిషత్ సప్తాహాలను నిర్వహించాను. 7వ సప్తాహం చెన్నైలో జనవరి 5 నుండి 11 వరకు జరుగుతుంది.

వైదిక సంప్రదాయం విశిష్టమైంది. మనిషిని మనిషిగా చేసి దు:ఖం నుండి బయట పడవేసే విద్య ఉపనిషత్తుల్లో ఉంది. అందుకే నేను ప్రతిరోజు 2 ఏండ్లుగా గూగుల్ మీట్‌లో వేదోపనిషత్తులపై ప్రసంగిస్తున్నాను. వందలమంది నా ప్రసంగాలు వింటారు. నేనెన్నడూ భగవద్గీతను మరవలేదు. అది మన భారతీయ సంస్కృతికి ఆత్మలాంటిది.

శ్రీకృష్ణుడు నా దృష్టిలో ఉపనిషత్తులను సమగ్రంగా అధ్యయనం చేసిన మొట్ట మొదటి విద్యార్థి. ఆయన ఉపనిషత్తులను గోవులుగా చేసి, అర్జునుడనే దూడకు జ్ఞానమనే పాలను త్రాగించేవాడు. మనమూ త్రాగితే అదృష్టవంతులమే కదా. నేను 1997లో బృహదారణ్యకాన్ని, 2013లో ఛందోగ్యాన్ని 2001లో ఈశా వాస్యోపనిషత్తును ముత్యాలసరాల్లో అనువదించాను. మొత్తం ఇప్పటివరకు తెలుగులో 4 వేల ముత్యాలసరాల్లో ఆధ్యాత్మిక విద్యనందించాను. గురజాడ వారి ముత్యాలసరం నాకు గేయమనిపిస్తుంది, పద్యంగా భాసిస్తుంది.

**వచన కవిత్వం గురించి మీ అభిప్రాయం?**

నేను పద్యం అంటే ఇష్టపడ్డా, వచన కవిత్వాన్ని వ్యతిరేకించను. 'నేత్రోదయం' (1991), 'ఆ సందుక' (2010) నా వచన కవితా సంపుటాలు. 'సడి లేని అడుగులు' పేరుతో రవీంద్రుని గీతాంజలిని వచన కవితా రీతిలో అనువదించాను. గేయపరంగా, నాకు బృహద్గీత, ఉద్గీథం, అమృత స్వరాలు, అగ్ని స్వరాలు, శ్రీరామకథాగేయం, నయాగరా (ఖండకావ్యం) మొదలైన కృతులు మంచి పేరు తెచ్చాయి. ఇప్పుడు 'శ్రేష్ఠారామం' పేర వచన కవితాసంపుటి అచ్చవుతుంది.

**మీకు దాశరథి అంటే ప్రత్యేకమైన**



ముఖాముఖి

గౌరవమా?

నాకు మహాకవి నారాయణరెడ్డిగారు ఎం.ఏ. లో పాఠాలు చెప్పిన గురువు. వారంటే నాకెంత గౌరవమో, దాశరథి అంటే కూడా నాకంతే గౌరవం. ఐతే దాశరథి పద్యకవి కనుక కొంచెం ఎక్కువ ప్రేమ. పద్యరచనలో సమకాలీన సమాజాన్ని సమర్థవంతంగా ప్రతిఫలింప జేసిన మహాకవి దాశరథి. ఆయన ‘అగ్నిధార’లో నేనెన్నిసార్లు మునిగి పోయానో తెలియదు. ఆయన మహాంధ్రోదయాన్ని 20 ఏండ్లుగా ఎం.ఏ. విద్యార్థులకు పాఠం చెప్పాను. మహాకవి దాశరథి ‘మహాంధ్రోదయం’ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణకు ఒక ఏడాది ముందు (1955) వచ్చింది. అది సురవరం ప్రతాపరెడ్డి గారికి అంకితమైంది. విచిత్రంగా నా ‘తెలంగాణోదయం’ (పద్యకవితా సంపుటి) తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందు అనగా 2013లో వచ్చింది. ఇది శ్రీయుతులు టి. హరీశ్‌రావుగారికి అంకితమైంది. దాశరథి లాగా నేను ఉద్యమంలో పాల్గొనలేదు గాని, ఉద్యమస్ఫూర్తిని అదే స్థాయిలో విద్యార్థుల్లో కల్గించినవాణ్ణి. ప్రసంగాలు చేసినవాణ్ణి. పద్యాలు రాసినవాణ్ణి.

**మీరు రచించిన ‘ఆ సందూక’ గురించి చెప్పండి.**

నేను ఒక పదేండ్ల పాటు ఆరు (6) నుండి డిగ్రీదాకా చింతపల్లిలోను, హైదరాబాద్‌లోను చదవడం వల్ల బస్టాండు (ఊరికి 2 మైళ్ళ దూరం) దాకా నా సందుకను మా అమ్మ మోసుకొని వచ్చేది. అందుకే నా మనుమరాలు అటక మీదున్న సందూకను చూసి ‘అందులో ఏముంది తాతయ్యా’ అని అడిగితే ‘మా అమ్మ ఉంది’ అని చెప్పాను. ఒకసారి పాత సామాన్లు కొనేవాడు ఆ సందూకను ‘అమ్ముగలవా?’ అంటే ‘అమ్మ’ గుర్తుకు వచ్చి ‘నే నమ్మను’ అని చెప్పవలసి వచ్చింది.

**పద్యరచనలో సమకాలీన సమాజాన్ని సమర్థవంతంగా ప్రతిఫలింప జేసిన మహాకవి దాశరథి. ఆయన ‘అగ్నిధార’లో నేనెన్నిసార్లు మునిగి పోయానో తెలియదు. ఆయన మహాంధ్రోదయాన్ని 20 ఏండ్లుగా ఎం.ఏ. విద్యార్థులకు పాఠం చెప్పాను. మహాకవి దాశరథి ‘మహాంధ్రోదయం’ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణకు ఒక ఏడాది ముందు (1955) వచ్చింది.**

“అర్ధాంగి కంటె ముందుగా నా గదిలో
అడుగుపెట్టిన దేవత అది.
నా జ్ఞాపకాల పుట్ట
పిల్లల కోడిపెట్ట” అని వర్ణించాను దాన్ని.

నా విద్యార్థి జీవితానికి సాక్ష్యంగా నిలిచిన ‘ఆ సందుక’ ఇంకా నా ఇంట్లో అటకమీదనే ఉంది. ‘ఆ సందుక’ను చదివినవారు మా ఇంటికి వచ్చినప్పుడు వారికి ఆ సందుకను చూపిస్తాను.

**మీ జీవిత లక్ష్యం ఏమిటి?**

నా ఆధ్యాత్మిక గురువు గోప దేవశాస్త్రి నాకిచ్చిన వేదజ్ఞానం వెలగట్టలేనిది నేను వారినడిగాను- ‘ఇంత జ్ఞానం ఇచ్చారు, నేనేం చెయ్యాలి?’ అని. వారన్నారు “నీ ధనం నీ పిల్లల కివ్వు. నీకిచ్చిన జ్ఞానాన్ని లోకానికి పంచు. అలాగైతే నా ఋణం నుండి కూడా బయటపడతావు” అని. ప్రతిరోజు స్వాధ్యాయమే నా పని. తరుచుగా ఆధ్యాత్మిక సభల్లో పాల్గొంటాను. ప్రసార మాధ్యమాల్లో కనిపిస్తుంటాను. కాని నా జీవిత లక్ష్యం ఒకటే. ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవిక త్రివిధ దు:ఖాలనుండి బయట పడడమే. అందుకు పరమాత్మయే ఆశ్రయింపదగినవాడు.

“ప్రణవోధను: శరోహ్యాత్మా
బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే”



ఆచార్య మసన చెన్నప్ప గారి భారత కోకిల సరోజినీ నాయుడు జీవిత చరిత్రను
తెలుగు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్ రావు గారు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముండకోపనిషత్తు (2-2-4) లోని ఈ వాక్యాలను మనస్సులో పెట్టుకొని లక్ష్యసాధనలో ఉండడమే నా పని. ఉచితంగా ఎవరు సంప్రదించినా వారికి ఆధ్యాత్మికపరంగా సందేహాలు తీర్చడం, అందరిలో వసుధైక కుటుంబ భావనను కల్గించడం, సనాతన ధర్మం వైపు వారి బుద్ధిని మరల్చడం, ప్రశాంతంగా జీవించడం లక్ష్యాలుగా పెట్టుకున్నాను.

**మీ కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తారా?**

మాది చేనేత కుటుంబం. శ్రీమతి రామలక్ష్మమ్మ, బుచ్చయ్య గార్లు నా తల్లిదండ్రులు. నేను ఏడవ సంతానం. తల్లిదండ్రుల ప్రేమ పుష్కలంగా లభించింది. పాలమూరు జిల్లా కల్వకుర్తి తాలూకాలోని కొల్కులపల్లి అనే చిన్న గ్రామంలో జన్మించాను. మగ్గం నేయకుండా చదువుకొమ్మని చెప్పినందుకు, భయంతో చదువుకున్నాను. ప్రాథమిక పాఠశాలలో నీతో చదివినవారంతా ఆయా వృత్తులలో చేరిపోయారు. ఒక పదేండ్లపాటు అమ్మ చేతి భోజనం రుచి ఎరుగనివాణ్ణి. 20 ఏండ్లకే ఉద్యోగంలో చేరడం వల్ల నా భావిజీవితం సజావుగా సాగింది. 21 ఏండ్లకే ప్రమీలతో వివాహమైంది. ఐదేండ్లలో ముగ్గురు పిల్లలు పుట్టారు. 24 ఏండ్లకే హైదరాబాదులో ఇల్లు కట్టుకున్న సాహసం నాది. నా చదువుకు సంసారం అడ్డు రాలేదు. కేవలం చదువుకోవడమే గాక, ఆధ్యాత్మికంగా పరిణతిని సాధించడం నా జీవితంలో ఒక మరుపురాని అనుభవం.

**మీ జీవితంలో మరపురాని సంఘటన ఏమైనా ఉందా?**

అది 1995. పండిత గోపదేవశాస్త్రి ప్యారడైజ్ సమీపంలో వారి శిష్యుని ఇంట్లో ఉండేవారు. నేనప్పుడు పి.జి. కాలేజి (ఓ.యూ.) సికింద్రాబాద్‌లో పనిచేస్తున్నాను. ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుండి రాత్రి 8 వరకు గురువు గారు దర్శనాలు బోధించేవారు. ఒకరోజు క్లాసులు బాయ్‌కాట్ కావడం వల్ల ఉదయం 9 గంటలకే వెళ్లాను. ఇంటికి తాళం వేసి ఉంది. కిటికీ గుండా గురువుగారు నన్ను చూసి పిలిచారు. ఎలాగైనా పాఠం జరగాలన్న ఉద్దేశంతో కిటికీ దగ్గర నన్ను కూర్చోమన్నారు. వారు లోపల మంచం మీద కూర్చొని, ఒంటిగంటదాకా నాకు పాఠం చెప్పారు. ఇది నా జీవితంలో మరవలేని సంఘటన. నిజమైన గురువు శిష్యుల విషయంలో ఒక్క క్షణం కూడా వృథా చేయరనే అభిప్రాయం నాకు కల్గింది.

**మీ విదేశీ ప్రయాణాలు, అక్కడ చేసిన రచనలేమైనా ఉన్నాయా?**

2009లో అమెరికాకు మొదటిసారి వెళ్ళినప్పుడు అక్కడి నా అనుభవాలను 'ఆచార్య చెన్నప్ప అమెరికా అనుభవాలు' పేరుతో యాత్రా చరిత్రను రచించాను. 'నయాగరా' గేయకావ్యాన్ని రాశాను. 2012లో వెళ్ళినప్పుడు 'అమెరికా ఓ అమెరికా' పేరుతో మూడువందల ముక్తకాలతో ఒక పుస్తకం రాశాను. అదే సంవత్సరం ఆస్ట్రేలియాకు వెళ్ళినప్పుడు అక్కడ జరిగిన వాస్తవిక సంఘటన ఆధారంగా రచించిన పద్యకృతి 'శుకోపనిషత్తు'.

**ప్రాచీన కావ్యాలమీద పరిశోధన చేశాను. 'అక్షర కేతనం', 'సమాలోచనం', 'సారస్వత లోచనం' నా వ్యాస సంపుటాలు. 'సమదర్శనం' 'చింతన' 1 & 2 ఆధ్యాత్మిక వ్యాస సంపుటాలు. శాకోపనిషత్తు, ప్రమీలా త్రిశతి వంటివి పద్యకృతులు. బృహద్గీత, ఉద్గీథం వంటివి గేయానువాదాలు. రవీంద్రుని గీతాంజలికి నా అనువాదం 'సడిలేని అడుగులు' వేదమంత్రాలకు పద్యరూప అనువాదం, 'వేదమాత' శతకం.**

**'ప్రమీలా త్రిశతి'ని గూర్చి చెప్పండి.**

ప్రమీలతో నలభై ఏండ్ల అనుబంధం. ఆమె నా పదవీ విరమణ అనంతరం 2015లో ఆకస్మికంగా తనువు చాలించింది. ఆమె స్మృతికి నివాళి అర్పిస్తూ రచించిన 308 పద్యాల స్మృతికావ్యమే 'ప్రమీలా త్రిశతి'. దీన్ని రాసినా కన్నీటిధారను అరికట్టుకోగలిగాను గాని, చదివినవారు మాత్రం అశ్రు నయనులయ్యారు. నా దృష్టిలో ప్రమీల అర్ధాంగి కాదు, పూర్ణాంగి. "అర్ధాంగి యనుమాట అర్థసత్యముగాని పూర్ణాంగివనుటయే పొసగు నీకు" అని ఆమెను ప్రస్తుతించాను.

**మీరు చేసిన సాహిత్య ప్రక్రియలేవి? అనువాదాల గురించి చెప్పండి?**

నేను మొదటినుండి పద్యకవినైనా, తెలుగులో ఎన్నో సాహిత్య ప్రక్రియలను స్పృశించాను. ప్రాచీన కావ్యాలమీద పరిశోధన చేశాను. 'అక్షర కేతనం', 'సమాలోచనం', 'సారస్వత లోచనం' నా వ్యాస సంపుటాలు. 'సమదర్శనం' 'చింతన' 1 & 2 ఆధ్యాత్మిక వ్యాస సంపుటాలు. శాకోపనిషత్తు, ప్రమీలా త్రిశతి వంటివి పద్యకృతులు. బృహద్గీత, ఉద్గీథం వంటివి గేయానువాదాలు. రవీంద్రుని గీతాంజలికి నా అనువాదం 'సడిలేని అడుగులు' వేదమంత్రాలకు పద్యరూప అనువాదం, 'వేదమాత' శతకం. భగవద్గీతకు పద్యరూపానువాదం 'మాతృగీత', 'శ్రీరామ కథాగేయం' సంపూర్ణ గేయకావ్యం. సుమారు నూరు పుస్తకాలకు పీఠికలు రాసినాను.

**మీరు ఇటీవల రచించిన కోకిల కావ్యం గురించి చెప్పండి.**

బ్రహ్మీ ముహూర్తంలో ఒకరోజు కోకిల పాటను విని, పరవశించిన నేను నెలరోజుల్లో రచించిన పద్యకృతి 'కోకిల'. అన్నీ ఆటవెలదులే. ఆట వెలదినిఉద్దేశించి నేను చెప్పిన సంగతులెన్నో ఉన్నాయి. చిత్రం ఏమంటే కోకిల నాకు వానప్రస్థంలో చేయవలసిన పనులను ఉపదేశించడం.

**పూర్తి చేయవలసిన రచనలేమైనా ఉన్నాయా?**

తెలంగాణ పల్లె జీవితాన్ని నేపథ్యంగా చేసుకొని రచించిన నవల సగం అయింది. త్వరలోనే పూర్తి చేస్తాను.

కవిత

# పురుషార్థంబులనెల్ల...

రావికంటి వసునందన్

పురుషార్థంబులనెల్ల నుత్తమమునై పొల్పొందు మోక్షంబు దా
దొరకున్ పూర్ణముగా నహంకృతి వినిర్ధూతంబు నైనప్పుడే!
జరుపన్ త్వత్పద సేవ, భాగవతదాస్యంబున్ నిరాటంకమై
కరుణా సాగర! సర్వలోక హిత సంకల్పా! నమస్తే పునః

ఎడపక ఛత్రమై యలరి యెత్తి శిరోమణి హార హారతుల్,
నిడుపగు మేననూన సుఖనిద్రకు పానుపుజేసి శ్రీహరిన్
విడువక గొల్చు శేషునకె విభ్రమగొల్పదె మాప్రవృత్తి! నీ
యడుగులకున్ మడుంగులను నద్దెడి దాస్యమదెంత గొప్పదో!

శేషము సర్వలోకము నశేష విభూతుల వెల్గు నీకునై
శేషివి నీవటంచు నుతిజేయు భవత్పదభక్త ఘోషణల్
దోష వినాశముల్ విబుధతోషణముల్ నిరవద్యవేద స
ద్భూష! విముక్తి భాషణలు, పూతజనాళి భవాబ్ధి శోషణల్

అడుగులు విద్రుమమ్ములు, నవాంబరముల్ వర పుష్యరాగముల్,
నిడుపగు దండ పచ్చలు, వినిర్మల కౌస్తుభమెన్న కెంపులున్,
సుడివడు కేశముల్ కనులు శోభనహాసము లింద్రనీలముల్
విడివడు మౌక్తికమ్ములును, విశ్రుత రత్న విభూష! కేశవా!

అడుగు రసాతలంబు, చరణాంబుజ శీర్షము భూమి, స్వామి! నె
వ్వడిగొను జంఘలద్రివర పంక్తులు, నూరువులున్ ప్రజాపతుల్
కడుపు విధాతృసాగరము, కక్ష్యలు దిక్కులు, రొమ్ములక్ష్మి, చే
పడుభుజముల్ దిశాపతులు, వక్రము మిన్నినచంద్రలోచనా!

పుస్తక పరిచయం

# నిజమే... మనసు మలిచిన శిల్పమే మనిషి...!

కదారు వీరారెడ్డి కవిత్వాన్ని పరిచయం చేసిన దాస్యం సేనాధిపతి...




దాస్యం సేనాధిపతి
94405 25544


ప్రకృతి ఒడిలో ఎలా ఎదిగినా... అంతిమంగా మనసు మలిచిన శిల్పమే మనిషి. అంటూ ప్రముఖ కవి, ఆచార్య కదారు వీరారెడ్డి "మనసు తొడుకున్న మనిషి" దీర్ఘకవిత ద్వారా తేల్చి చెప్పారు. శాతవాహన విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి.. ఆచార్య కదారు రసాయన శాస్త్రంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జించేలా గ్రంథాలను వెలువరించారు. అనతి కాలంలోనే తెలుగు సాహితీ క్షేత్రాన వివిధ ప్రక్రియల్లో 14 గ్రంథాలను ప్రకటించి.. అందరి అభినందనలు అందుకుం టున్నారు.. రూపంలేని మనసుకు ఎన్నెన్నో రూపాలు,, మనసు. తొడుక్కున్న మనిషికి ఎన్నో మజిలీలు అంటు పద్నాల్గో గ్రంథంగా 'మనసు తొడుకున్న మనిషి" దీర్ఘకవితను పాఠక లోకానికి అందించడం ఆనందదాయకం. లోగడ ఐదు వివిధ కవితా వస్తువులపై దీర్ఘకవితలు రాసిన అనుభవం ఉన్న ఆచార్య కదారు 'మనసు తొడుక్కున మనిషి' తనలో తానే అంతర్మథనం చెందుతూ తానెవరో తెలుసుకునేందుకు నిత్యం యుద్ధం చేయాల్సిందేనంటూ తమ ఆరో దీర్ఘకవిత ద్వారా పిలుపునిచ్చారు. ఆచార్య కదారు మనసు పెట్టి తమ మనసులోని భావాలను తట్టి, సమాజాన్ని జాగృత పరిచేందుకు.. మానవ జీవితం మనసు నిర్మించిన ఘటమనీ, ఓ పరమపద సోపాన పటమనీ, తాత్వికంగా ఈ దీర్ఘకవితను



తీర్చిదిద్దారు.

తొమ్మిది ఖండికలుగా సాగే ఈ దీర్ఘకవితలో కవి ఆచార్య కదారు అపార అనుభవాన్ని లోక పరిశీలనను అడుగడుగునా చూడగలం. అగాథం నుండి అంతరిక్షానికి మనసు చదరంగం పై విధిగా కదిలే కాలం అడుగులను అక్షరాల్లో నిక్షిప్తం చేసిన తీరు బాగుంది.

మనసు సంకెళ్ల బందీ అయిన మనిషి యొక్క వ్యక్తిత్వాన్ని, తత్వాన్ని మనస్తత్వాన్ని విభిన్నమైన కోణాల్లో కవి ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. మనసు కేంద్రంగా మనిషి చేసే వివిధ విన్యాసాలను. ఇందులోని ఆయా ఖండికల్లో తమదైన శైలిలో వస్తువు వెలుగులో ఆవిష్కరించారు.

మనిషిని బొమ్మగా మార్చి.. ఊహల పల్లకీలో ఊరేగిస్తూ.. జీవిత గమనాన్ని శాసించేది మనసేనని భావించే కవి కదారు గారు మనసుపై మనసుపడి.. మనసును అందరి మనస్సులకు హత్తుకునేలా దీర్ఘకవితకు జీవం పోశారు. మనస్సును ఆధీనంలో పెట్టుకుంటూ.. వివేకంతో అడుగులు వేసేందుకు.. వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకునేందుకు ఈ గ్రంథంలో మనకు అనేక పంక్తులు తారసపడతాయి.

కుంచె మనదే..

రంగు మనదే..

మన బ్రతుకు చిత్రపటాన్ని.. మనకు మనమే నిర్మించుకోవాలన్న సందేశంతో కవి కదారు వస్తువు సీక్వెన్స్ ఎక్కడా దెబ్బతినకుండా సమర్థవంతంగా.. అర్థవంతంగా కొనసాగించారు. ఆలోచనా త్మకంగా.. ఆసక్తికరంగా ఉండేందుకు కావలిసిన పదబంధాలను.. భావచిత్రాలను పొందుపరచడంలోకవి తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు.

'అందం' గురించి.. 'అమ్మ' గురించి ఎంత రాసినా.. ఇంకా మిగిలే వుంటుంది. అలాగే మనసు గురించి: ఎంతమంది ఎన్ని కోణాల్లో రాసినప్పటికీ.. ఇంకా మిగిలే వుంటుందన్నది నిజమేనని ఆచార్య కదారు గారు తమ రచన ద్వారా నిరూపించారు.

ఈ క్రమంలోనే కవి సర్వకళల సమ్మేళనమైన జీవిత సమాలోచనా స్రవంతిలోని మరపజాలని ఎత్తు పల్లాలను.. ఎదురీతలను అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు. సుదీర్ఘమూ కాని..

**పుస్తక పరిచయం**

శాశ్వతమూ కాని జీవితాన్ని వృథా చేయవద్దని హితవు పలికారు. సంతోషం మన చెంత నిలవాలంటే.. మనసు సంయమనం కోల్పోకుండా అప్రమత్తంగా ఉండాలని మొదటి ఖండికలో సూచించారు. కవి కడారు రసాయన శాస్త్ర ఆచార్యులు కనుక... ఆమ్లం.. క్షారం విరుద్ధ గుణాలున్న రసాయనాలనీ.. అలాగే సంతోషం.. బాధ పరస్పరం భిన్నమైన భావోద్వేగాలనీ.. ఈ రెండింది నియంత్రణ ఒక్క మనసుకే సాధ్యమని విడమరిచి వివరించిన తీరు బాగుంది. సంతోషాన్ని విభిన్నమైన రీతిలో ఆవిష్కరించే క్రమంలో మొదటి ఖండిక యందు.. అందమైన భావాలకు చోటు కల్పించడంలో కవి కడారు సఫలీకృతులైనారు.

'కౌచ్ పొటాటో'(శయ్యాళువు) లాంటిది జీవితమనీ.. అది ఎన్నాళ్ళో అసలే తెలియదనీ.. ఈ భూమి మీద మనిషి బ్రతుకుకు భరోసా లేదనీ.. ఓ ప్రత్యేకతకై పాటుపడితేనే బ్రతికినన్నాళ్ళు సంతోషంగా ఉండగలమన్న అర్థం ధ్వనించేలా కవి తమ ఆలోచనలను మనతో పంచుకున్నారు. వర్షం కురిసి వెలిసాక.. ఇంద్రధనుస్సు ఏర్పడితే సంతోషమనీ.. కటిక చీకట్లో చుక్కలు కనబడితే సంతోషమనీ, పౌర్ణమి నాడు చుక్కల నడుమ చంద్రుడు కనిపిస్తే సంతోషమనీ.. అలాగే.. మనసు మడతల్లో దాగిన అందాన్ని మేల్కొల్పేదే సంతోషమని విశ్లేషించిన తీరును అందరూ అభినందిస్తారు.

రెండో ఖండికలో.. కొంచెం వచనం పాలు ఎక్కువైనట్లు కనిపించినప్పటికీ.. అక్కడక్కడ కవిత్వాంశ మరింత వుంటే బాగుండేదనిపించినప్పటికీ.. కవి కడారు తమ అనుభవాన్ని రంగరించి మనతో పంచుకున్న భావాలు బాగున్నాయని సంతృప్తినొందుతాం. వర్తమానంలో జీవించాలన్న గొప్ప సందేశాన్ని సైతం మనందరం మెచ్చుకొని తీరుతాం.

మూడో ఖండికలో.. సంతోషంగా ఉండాలంటే.. అందమే ముఖ్యం కాదనీ.. మనసుకు లేదు సంతోషాన్ని మించిన అలంకరణ అనీ.. ముఖమే మనసుకు




ప్రతిబింబమనీ.. మనసు ఆలోచనా విధానమే మనిషి వ్యక్తిత్వమని తెలియజెప్పారు. సంతృప్తి, స్వతంత్రత, శాంతి వంటివే.. జీవిత ధ్యేయాలని వివరించారు.

నాలుగో ఖండికలో.. హాయిగా ఊరేగడానికి నమ్మకమే నవ్వుల పల్లకీ అని.. ప్రేమ పలకరింపులే హృదయానికి పులకరింపులనీ.. "సంధి" కుదిరిన పెదవులు చిరునవ్వుకు చిరునామా అని వ్యాఖ్యానించారు. అహం మనసుకు పట్టిన గ్రహణమనీ.. నిజాయితీ లోపించిన గుణమనీ.. ఇతరులపై నిందారోపణ పచ్చి నిజానికి పాతర అంటూ కొనసాగించిన పంక్తులు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి.

ఐదో ఖండికలో.. అందమైన అనుభూతులతో నిత్యం మనసును నియంత్రించుకుంటే ఆందోళనలన్నీ ఆమడకవతలేనని పేర్కొన్నారు. ఆలోచనల్ని, అనుభూతుల్ని వక్రీకరించేవి మాటలేననీ,, మాట వ్యక్తావ్యక్తాల శబ్ద రూపమని.. భావనలకు.. ధారణ ధాన్యాలకు ప్రతిరూపమనీ.. వాటిని "తిథులు" స్వామ్యంగా అభివర్ణించారు. ఆరో ఖండికలో.. ఆశ... ఓ పాశమనీ.. అన్ని అరిష్టాలకూ మూలమనీ., పాశంలో చిక్కుకున్న మనిషి పరేషాన్ అవ్వడం ఖాయమని తేల్చి చెప్పారు. అందం.. ఆనందం మనసుకు పుట్టిన కవల పిల్లలనీ.. నీకు నీవుగా ఉండటమే అందం.. ఆనందమని హితవు పలికారు.

ఏడో ఖండికలో.. కృతజ్ఞతా వైఖరి.. సాధికార భావోద్వేగం.. ఉత్తమ వ్యక్తిత్వానికి ప్రమాణాలే కావు ఆభరణాలనీ మనో వ్యవస్థకు అద్భుతమైన పార్శ్వం అంటూ రాసిన పంక్తులు బాగున్నాయి. ఉన్నతమైన ఆలోచనలే హృదయబంధాలకు పునాది అని వివరించారు.

ఎనిమిదో ఖండికలో.. సర్వేంద్రియాలను నియంత్రించగలిగే పనిముట్టు మనసేననీ.. అరిషడ్వర్గంతో కలిసే మనసుకు నిగ్రహమే కళ్లెం అని విడమరిచి చెప్పారు. మనిషి పుట్టగానే తొడుకున్న దేవతా వస్త్రంగా మనసును అభివర్ణించారు.

చివరి తొమ్మిదో ఖండికలో, మనిషి జీవితాన్ని సుఖదుఃఖాల కోలాటంగా వర్ణించారు. సంతోషం తాత్కాలికమనీ- సౌఖ్యం క్షణికమని.. ఆనందం.. బ్రహ్మ స్వరూపమని కొనసాగించిన పంక్తుల్లో కవి తమ తాత్వికతను చాటారు.

ఇలా మనసు తొడుక్కున్న మనిషిని కవి ఆచార్య కడారు గారు తమదైన శైలిలో.. విస్తృతమైన వస్తు విశ్లేషణతో.. ఔచిత్యవంతమైన పదబంధాలతో తీర్చిదిద్దారు. మనిషి నైజాన్ని తెలియజేబుతూనే.. మనసు సంకెళ్లలో బందీ కాకుండా ఎలా జీవనయానంలో అడుగులు వేయాలో ఈ దీర్ఘకవిత ద్వారా తెలియజేశారు. మనిషికి వ్యక్తిత్వమే అస్తిత్వమనీ.. అదే బలమని వివరించారు. మనిషికి మనసే ఓ వరమని.. జీవితాంతం తోడుగా ఉంటూ.. అంత్యకాలంలో అదృశ్యమయ్యే మనసుకు వయసు.. మనిషింతేనని వివరించారు.

ఈ గ్రంథంలో.. రూపంలేని మనసుకున్న వివిధ రూపాలను.. మనసు తొడుకున్న మనిషికి ఉన్న ఎన్నో మజిలీలను విశ్లేషించారు. కాలప్రవాహంలో ఈదుతున్న మనిషికి పై ముసుగులోనే ప్రపంచ పరిచయమున్న జీవిత సత్యాన్ని కవి కడారు వీరారెడ్డి ఈ దీర్ఘ కవిత ద్వారా ఓ గొప్ప సందేశంతో.. తాత్వికతతో రూపుదిద్దు కున్న ఈ దీర్ఘకవిత అందరు చదువ దగింది. ప్రతీ గ్రంథాలయంలో ఉండదగినది.

# బుగులు కాలపు తలపోతలు-తెలంగాణ కథ 2020

**తెలంగాణలోని సంఘర్షణ తెలుపుతున్న కథలు...**

నిప్పులో కాలి, సమ్మెట దెబ్బలు తిన్న ఇనుమే పదునైన ఆయుధంగా మారుతుంది. కష్టకాలాలు తట్టుకుని నిలబడి రాటుదేలిన మనిషి కూడా కూడా ఆయుధంలా మారుతాడు. పదునుగా ఆలోచిస్తాడు. జీవితం లోతునూ దర్శిస్తాడు. మొత్తం మానవాళి చరిత్రలోనే అత్యంత విషాద సంవత్సరం 2020. మానవుల ఆలోచనా రీతిని సమూలంగా మార్చేసింది. మనిషి సంఘజీవి అనుకునే మానవాళిని.... తోటి మనిషికి ఎంత దూరంగా ఉంటే అంత భద్రం అనుకునే దుస్థితికి కరోనా వైరస్ తీసుకొచ్చింది. ప్రతి మనిషి జీవితం అంటే ఏమిటీ అని ప్రశ్నించుకున్న సందర్భం అది. తల్లిదండ్రులు, భార్యభర్తలు, అన్నదమ్ములు, బంధువులు......ఇలా మొత్తం మానవ సంబంధాలు కూడా ప్రశ్నార్థంగా మారిన దుస్థితి. ఈ సంక్షోభ కాలంలో తెలంగాణ సమాజం, తెలంగాణ మనుషుల ఆలోచనలను ఒడిసిపట్టి చూపించిన కథల సంకలనమే బుగులు తెలంగాణ కథ - 2020.




వర్తమాన సమాజాన్ని, సంఘర్షణను కథలుగా మలచడంలో తెలంగాణ కథకులు ఎప్పుడూ ముందుంటారు. అలాగే కరోనా మహమ్మారి కాలాన్ని కథలుగా మలచడంలో కూడా తెలంగాణ కథకులు తమ సోయిని చాటుకున్నారు. కరోనా కాలంలో... మనిషి అంతర్గతంగా ఎదుర్కొన్న సంఘర్షణ, తన కుటుంబంతో, తోటి మనిషితో అనుభవించిన ఒత్తిడి, అటు సంఘం నుంచి ఎదుర్కొన్న ప్రభావం.... వీటన్నింటినీ కథలుగా మలిచారు.

తెలంగాణ నుంచి ప్రతి ఏటా వస్తున్న ఉత్తమ కథలను వార్షిక సంకలనంగా తీసుకొస్తున్నారు ప్రముఖ పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్, కవి, కథకుడు, విమర్శకులు డా. వెల్దండి శ్రీధర్‌ల జంట. ఉత్తమ కథల సంకలనానికి ప్రతి ఏటా తెలంగాణ సంస్కృతిని, ఆ ఏడాది తెలంగాణ సమాజపు జీవితాన్ని, జనం గుండె చప్పుడును ప్రతిబింబించేలా సంకలనానికి పేరు పెట్టడం మరో విశేషం. తెలంగాణ పోరాట కాలంలో వచ్చిన సంకలానికి రంధి అనే పేరు, తెలంగాణ వచ్చాక అస్తిత్వాన్ని చాటుకుంటూ, నిలబడడం కోసం తెలంగాణ తపన పడుతున్న ఏడాది సంకలనానికి తన్లాటగా, చెరువుల పరిరక్షణను, తెలంగాణ పచ్చదనం నిండుకున్న కాలం సంకలనానికి అలుగుగా, తెలంగాణ సమాజం సంతోషంగా ఉన్న కాలాన్ని దావత్‌గా పేరు పెట్టారు. ఇప్పుడు కరోనా సంక్షోభకాలాన్ని బుగులు అని పేరు పెట్టడం కూడా సంపాదకులు తమ శీర్షికతో ఆ ఏడాది తెలంగాణ సమాజం బతికిన తీరును ఒక్క మాటలో చెప్పడం అభినందనీయం.

సాహిత్యం అంటే కాల్పనిక చరిత్ర అని కూడా అన్నట్టు...భవిష్యత్ లో చరిత్ర పరిశోధకులు తెలంగాణ గురించి

పరిశోధన చేయాలనుకుంటే ఈ కథల సంకలనం ద్వారా ఆ ఏడాది తెలంగాణ సామాజిక జీవితాన్ని అంచనా వేయవచ్చు.

బుగులు తెలంగాణ కథ-2020 కథా సంకలనంలో మొత్తం 13 కథలున్నాయి. అఫ్సర్, పెద్దింటి అశోక్ కుమార్, షాజహానా వంటి సీనియర్ రచయితలు, పూడూరి రాజిరెడ్డి, వెల్దండి శ్రీధర్ లాంటి యువతరం కథకులతో పాటు... అక్కల చంద్రమౌళి, సదయ్య వంటి కొత్త కథకులు రాసిన కథలు కూడా ఈ సంకలనంలో ఉన్నాయి. కరోనా కాలంలో ఒక తల్లి ఆవేదనను ప్రతిబింబించిన కథలు పెద్దింటి అశోక్ కుమార్ - ఆరడుగుల దూరం, వెల్దండి శ్రీధర్ - కాసెపుల్ల కథలు కాగా....అదే సమయంలో మైనారిటీలు ఎదుర్కొన్న సంఘర్షణను షాజహానా (పరిందా) అఫ్సర్ (చూపుడు వేలు) కథలు వివరిస్తాయి. కోవిడ్ కాలంలోనే మనిషి లోపలి అలజడికి అద్దం పట్టిన కథ పూడూరి రాజిరెడ్డి కథ మెడిటేషన్. విద్యావ్యవస్థలో రావాల్సిన మార్పులు చూపిన కథ సంహితా కిరణ్ రాసిన చెప్పదలుచుకున్న మాటేదో. ఆధిపత్య వర్గాల హింసపై తిరగబడ్డ మనిషి కథ మేడి చైతన్య రాసిన సిలకం డబ్బా కథ. వ్యవసాయ రంగం కథలు అంటే విషాదం, కన్నీళ్లు మాత్రమే కాదు అని తెలియజేస్తూ తెలంగాణలో ఆపిల్ పంటసాగులో రైతు సాధించిన విజయగాథ అక్కల చంద్రమౌళి రాసిన కథ, మహిళా రైతుకు చేతికి అందివచ్చిన పంట, కడుపులో ఉన్న బిడ్డ రెండూ సమానమే అని చెప్పిన కథ చందు తులసి బతుకమ్మ పుట్టింది. వర్తమాన సమాజంలో ఒంటరిగా బయటకి రావడానికి ఆడపిల్లలు ఎదుర్కొనే భయాన్ని చిత్రించిన కథ నాకూ భయమేస్తోంది. ఉపాధి దొరకని నిరుద్యోగుల గోసకు సదయ్య(ఉడో) కథ అద్దం పట్టింది. ఒంటరైపోతున్న మనిషి టెక్నాలజీతో వెతుకున్న పరిష్కారం డియర్ లెక్సా, అదే ఒంటరితనం ఉన్న మనిషి తోడు కోసం వెతుకున్న కథ రవి వీరెల్లి సెకండ్ లైఫ్. ఇలా మొత్తం 13 కథలు తెలంగాణ జీవితాన్ని వివిధ పార్శ్వాల్లో చూపిస్తాయి.

ఈ బుగులు కథా సంకలనంలో కనిపించే ఇంకో ఆసక్తి కరమైన అంశం...కథకుల వస్తువుల ఎంపిక. కాకమ్మ కథలు, కట్టుకథలు కాకుండా.... వర్తమాన సమాజాన్ని ఒడిసిపట్టుకుంటూనే, ఆ వస్తువును విభిన్న కోణాల నుంచి కథలుగా మలచడంలో తెలంగాణ కథకులు ముందున్నారని ఈ కథా సంకలనం నిరూపించింది. అలాగే శైలి పరంగా, శిల్ప పరంగా తెలంగాణ కథకులు చేస్తున్న ప్రయోగాలకు ఈ కథాసంకలనం తిరుగులేని సాక్ష్యంగా నిలుస్తుంది.



# పద్య నైవేద్యం

**నన్నపు రాజు రమేశ్వర రాజు**, 97009 29582

నుదుటబొట్టయ్యి మెరిసేవుఉదయమందు
సిగను మణివయ్యి వెలిగేవుపగలునీవు
కాలి మంజీర మయ్యేవు కడకు సంధ్య
పుడమి తల్లికి ముప్పొద్దు మురిపెముగను
అయ్యి ఆభరణమ్ముగ ఆది దేవ
కనుల విందును జేతువు కమల మిత్ర
జనుల మనములుమురియగ ఘన పవిత్ర

సంధ్య చీకట్లు తొలగింప చాల చాల
ప్రమిదలన్నియు వెలిగించు ప్రమద మొప్ప
కాంత లందరు కాంతికై ఘనము గాను
ఎన్ని దీపాలు వెలిగినా ఇలను సూర్య
నీదు ప్రభలకు సాటియా!! నిర్జరాయ
కాంతి జనకాయ శ్రీకంఠ ఖగ విహంగ

చిత్రం : ఎ స్వీట్ గర్ల్
దర్శకుడు : ఆండ్రివ్ మెండోజా
భాష : ఇంగ్లీష్

# ఎ స్వీట్ గర్ల్

ఆగస్టు 20, 2021న విడుదలైన యాక్షన్ థ్రిల్లర్ "ఎ స్వీట్ గర్ల్"కు బ్రెయిన్ ఆండ్రివ్ మెండోజా దర్శకత్వం వహించారు. జాసన్ మోమోవా, ఇసబెలా మెర్సిడ్, గార్సియా-రుల్ఫో, అడ్రియా అర్జోనా, రజా జాఫ్రీ, జస్టిన్ బార్తా, లెక్స్ స్కాట్ డేవిస్ మొదలైన నటులు నటనతో చిత్రాన్ని ఎంతో హృదయంగా మలిచారు.

పీట్స్‌బర్గ్‌లో ఆమాండ లూపర్ అరుదైన క్యాన్సర్ వ్యాధికి గురౌతుంది. క్యాన్సర్ వ్యాధిని నిరోధించడానికి అమెరికాలోని ఒక ప్రయోగశాల ఒక డ్రగ్ కనుగొంటుంది. కాని ఆమె వైద్య సేవ ప్రారంభించడానికి ముందే బయో ప్రైమ్ సిఇవో సిమన్ ఆ డ్రగ్ మార్కెట్‌లో విడుదల చేయడానికి సమయం తీసుకోవల్సిందిగా లంచం ఇస్తాడు. ఒక ఛానల్‌కి ఇంటర్వ్యూ ఇస్తూ కాంగ్రెస్ ఉమెన్ డినమాజిర్ కీలేతో జరిపిన సంభాషణ చూస్తాడు. ఆ సంభాషణలో కీలే ఆ డ్రగ్‌ని అప్పుడే విడుదల చేయలేమని చెబుతాడు. కీలే తన నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే అతన్ని చంపేస్తానని రే కీలేని ఫోన్ చేసి బెదిరిస్తాడు. కీలే ఆ ఫోన్‌కాల్‌ని సీరియస్‌గా తీసుకోడు. వైద్యసేవ ప్రారంభం కాకముందే అమండా ఈ లోకాన్ని విడిచిపెడుతుంది.

ఆరు నెలల తరువాత రే జర్నలిస్ట్ రిన్ బెనెట్ నుండి ఒక ఫోన్‌కాల్ అందుకుంటాడు. జర్నలిస్ట్ బయో ప్రైమ్ చేస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తన దగ్గర సాక్ష్యాలు ఉన్నాయని చెబుతాడు. ఆ జర్నలిస్టు మరి యురే ఒక సబ్‌వేలో రహస్యంగా కలుసుకొంటారు. వాళ్ళను అనుసరిస్తున్న రాచెల్ మరియు సాంటోస్‌లను వాళ్ళు పసిగట్టలేకపోతారు. బయో ప్రైమ్ కార్యకాలపాలను ప్రశ్నించిన వాళ్ళను లంచాలిచ్చి సంస్థ నోరు మూయిస్తుండని చెబుతాడు జర్నలిస్ట్ కాని జర్నలిస్ట్ ఆ విషయం చెబుతుండగానే సాన్‌టోస్ ఆయనను కత్తితో పొడిచి చంపేస్తాడు. రెండు సంవత్సరాల తరువాత రే, కీలే కదలికలను పరీక్షిస్తుంటాడు. రే ఒక వేయిటర్‌గా నటిస్తూ బయో ప్రైమ్ ధార్మిక కార్యక్రమాలను, దాని వెనుక ఉన్న నిగూఢతను పరిశీలిస్తుంటాడు. ఆ విధంగా కీలే చర్యలను గమనిస్తాడు. చివరికి రే కీలేని ఇంటరాగేట్ చేస్తాడు. కీలే చివరికి కీలే తనకు ఏమీ తెలియదని అన్ని విషయాలు బయో ప్రైమ్ చెయిర్‌మెన్ వినోద్ షాకే తెలుస్తాయని చెబుతాడు. తరువాత జరిగిన ఫైట్‌లో రే కీలే యొక్క బాడీగార్డ్‌ని ప్లాస్టిక్ బ్యాగ్ గొంతుకు చుట్టి చంపేస్తాడు.

రే తరువాత తన కూతురు రాకె రాచెల్‌ని కలుసుకుంటాడు. రాచెల్ ఇదివరకే తన తండ్రిని వెతకడానికి ఎఫ్‌బిఐ ఏజెంట్ సారా మీకర్‌ని కలుసుకుంటాడు. రాచెల్ ఆమెని బయో ప్రైమ్ మీద దృష్టి సారించమని చెబుతుంది. ఇద్దరు సైనికులు హెూటల్ తలుపులు బద్దలు చేసి రే దగ్గరకు వస్తారు. రే ఇద్దరినీ చంపేస్తాడు. రాచెల్ మరియు రేల మధ్య కొత్త భయం మొదలౌతుంది. రే తరువాత షాహ్‌ని ట్రాప్ చేయడానికి ప్రయత్నం చేస్తాడు. షాహ్‌రే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి నిరాకరిస్తాడు. చివరికి షాహ్ సాక్‌తాస్‌తో చంపబడతాడు. రే మరియు రాచెల్ సాన్‌తో సాంతాస్‌ని ఒక విందులో కలుసుకొంటారు. సాంతాస్ మార్గాన్ తన ఎంప్లాయర్ అని చెబుతాడు. పిఎన్‌పి పార్కు దగ్గర మీకర్ రేతో మాట్లాడడానికి ప్రయత్నం చేస్తాడు. రేనే రాచల్ అని తెలుస్తుంది. రే సబ్‌వే దగ్గర జరిగిన పోరాటంలో మరణించాడని తెలుస్తుంది. రాచల్ పిటిఎస్‌డి డిసోసియేటివ్ ఇన్‌డెన్‌టిటీతో బాధపడుతుంది. పగ తీర్చుకోవడానికి తనను తాను అర్పించడానికి కూడా సిద్ధపడుతుందని తెలుస్తుంది. చివరికి ఆమె నిరాశతో అల్లెఘేనీ నది లో దూకి గాయపడుతుంది. తరువాత ఆమె స్పృహ వచ్చాక మార్గాన్ కార్యాలయాన్ని గుర్తిస్తుంది. చివరికి రాచెల్ ఆరోగ్యాన్ని పొంది మార్గాన్ దగ్గరకు వెడుతుంది. మార్గాన్ ఆమె బయోప్రైమ్‌లో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యక్రమాలను గురించి మాట్లాడినపుడు రాచెల్ రికార్డ్ చేస్తుంది. ఆ రికార్డ్ చేయబడ్డ సమాచారాన్ని ఎఫ్‌బిఐకి పంపి ఒక నకిలీ పాస్‌పోర్ట్ ద్వారా ఆమె విదేశానికి పోవడానికి నిర్ణయించుకుంటుంది. తన దగ్గర డబ్బంతా క్రిప్టో కరెన్సీగా మార్చుకుంటుంది.



కవిత

# యాస్ ఐ గ్రూ ఓల్డర్



డా॥ బాణాల శ్రీనివాసరావు, 79890 69211

ఆంగ్లం : లాంగ్స్టన్ హ్యూస్

జేమ్స్ మెర్సెర్ లాంగ్స్టన్ హ్యూస్ అమెరికాలోని మిస్సోరిలో 1 ఫిబ్రవరి 1902లో జన్మించి 22 మే 1967లో మరణించిన ప్రఖ్యాత సాహితీవేత్త. లాంగ్స్టన్ హ్యూస్ అమెరికన్ కవిగా, సామాజిక కార్యకర్తగా, నవలాకారునిగా, నాటకకర్తగా, కాలమిస్టుగా ప్రసిద్ధుడు. జాజ్ పోయెట్రీ ఆర్ట్ ఫార్మ్ ఆద్యుల్లో ఒకడిగా పేరొందాడు. హార్లేమ్ రినైస్సాన్స్ ఆలోచనాపరుడిగా, లీడర్‌గా కూడా పేరు పొందాడు. లాంగ్స్టన్ హ్యూస్ విద్యాభ్యాసం లింకన్ యూనివర్సిటీ, కొలంబియా యూనివర్సిటీలో జరిగింది. హ్యూస్ పిన్నవయస్సులోనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించి "ద వియరీబ్లూస్" 1926 "ఫైన్ క్లోత్స్ టు ద జ్యూస్" 1927 కవిత్వ సంకలనాలతో ప్రసిద్ధుడయ్యాడు. హార్లేమ్ మదర్ టు సన్, మంటేజ్ ఆవ్ డ్రీమ్ డిఫర్డ్, ద నీగ్రో స్పీక్స్ ఆఫ్ రివర్స్, అనే కవితలు ప్రఖ్యాతమైనవిగా పేర్కొనవచ్చు.

చాలా కాలం క్రితం
నేను నా కలను మర్చిపోయాను
కానీ ఇప్పటికీ అక్కడే వుంది
నా ముందే
సుర్యునిలా ప్రకాశిస్తూ నా కల
అక్కడొక గోడ మొలిచింది
నెమ్మదిగా మొలిచింది
నెమ్మదిగా...
నాకు నా కల మధ్య
ఆకాశాన్ని అంటుకునే వరకు లేచింది
గోడ...
నీడ...
నేను నల్లవాణ్ణి
నేను ఆ నీడకింద పడుకొని ఉన్నాను
నా కల యొక్క కాంతి ఎంతో కాలం నా ముందు లేదు
నా మీద
కేవలం మందపాటి గోడ ఉంది
కేవలం నీడ మాత్రమే
నా చేతులు
నా నల్లని చేతులు
గోడను పగలగొట్టి నా కలను కనుగొనాలని
ఈ దట్టమైన చీకటిని ముక్కలు చేయడానికి సహాయం చేయండి
ఈ రాత్రిని నాశనం చేయడానికి
ఈ నీడను పగలగొట్టేందుకు
వేల కాంతుల సూర్యుని కోసం
వేనవేల సుడులు తిరిగే కలల సూర్యుని కోసం

# సాహితీ కృషీవలుడు యస్.ఆర్. భల్లం కన్నుమూత



ఉభయ రాష్ట్రాలలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన ప్రసిద్ధ సాహితీవేత్త యస్.ఆర్. భల్లం 21-12-2021 రోజున బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు. వారికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిటీ న్యూరో అండ్ కార్డియో హాస్పిటల్ వారం రోజుల క్రితం బైపాస్ సర్జరీ జరిగింది. భల్లం ఉపాధ్యాయుడుగా పాలకొల్లు తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాలలో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. కవిగా రచయితగా ప్రసిద్ధులైన ఆయన ప్రసంగాలలో కూడా దిట్ట. పల్లెనుంచి ఢిల్లీవరకు ఎన్నో సాహితీ ప్రసంగాలలో ప్రశంసలు పొందారు. ఈయన కథలు, వ్యాసాలతో కలిసి ఇరవైకి పైగా పుస్తకాలు ముద్రితమయ్యాయి. సి.నా.రె. సాహిత్యాన్ని భల్లం విస్తారంగా ప్రచారం చేశారు. ఉత్తమ జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. స్నేహశీలి, నిరంతర సాహితీ కృషీవలుడు భల్లం మరణానికి తంగేడు అశ్రు నివాళి అర్పిస్తున్నది.

# మూడవ బాల సాహిత్య సమాలోచన..

తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, సాహిత్య అకాడమీ సౌజన్యంతో ప్రతి నెల నాల్గవ ఆదివారం రోజున తెలుగు భాషా చైతన్య సమితి లక్ష్యసాధన ఫౌండేషన్ నిర్వహిస్తున్న బాలసాహిత్య వికాస కార్యక్రమంలో భాగంగా 26.12.2021న మూడవ బాల సాహిత్య సమాలోచన అంతర్జాల కార్యక్రమం జరిగింది. అంతర్జాల కార్యక్రమాలకు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న డా॥ జయప్రకాశ్ సారథ్యంలో జరిగిన అంతర్జాల సదస్సుకు బాలసాహితీవేత్త డా॥ పత్తిపాక మోహన్ అధ్యక్షత వహించారు. చర్చాంశమైన 'బాలల సాహిత్య రచన- అనుభవాలు' అంశంపై చర్చను ప్రారంభిస్తూ నేడు రెండు రాష్ట్రాల్లో 'కొత్త విప్లవం'లాగా రాస్తున్న బాలల రచనల గురించి, పుస్తకాలు వేసుకోవాల్సిన విధానం, ఫాంటు ఇతర అంశాల గురించి మాట్లాడారు. ఇంకా వస్తువు, నేపథ్యాల వంటివి ఎలా ఉండాలి. పిల్లలను రచనలవైపు ప్రోత్సహించినప్పుడు ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న డా.వి.ఆర్. శర్మ మూడున్నర దశాబ్దాలుగా బాలలతో రచనలు చేయిస్తున్న పద్ధతులను, సాధకబాధకాలను ఆయన వివరించారు. బాలలతో రచనలు చేయించేటప్పుడు భాష, వస్తువు వంటి విషయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, గురించి మాట్లాడారు. మరో వక్త కన్నెగంటి వెంకటయ్య తాను అచ్చువేసిన పిల్లల పుస్తకాల గురించి వివరించగా డా॥ అమరవాది నీరజ పిల్లల రచనల పట్ల చూపించాల్సిన ఆసక్తి గురించి తెలిపారు. ఒంగోలు నుండి మంచికంటి శాంతి వనం చేస్తున్న కార్యకలాపాల గురించి, డా॥ వీరాచారి తన బాల్యంలోని పాఠశాలలు తెచ్చిన సంకలనాల గురించి తెలుపగా, షఫీ, మన్మధరావు, పాలడుగు సరోజన, యెల్ది సుదర్శన్‌లు తమ అనుభవాలు పంచుకున్నారు. శీలం భద్రయ్య ముగింపు మాటలు పలికారు.

# 'నాది దు:ఖం వీడని దేశం' ఆవిష్కరణ...

కవితా సంకలనం ఆవిష్కరణ 21 డిసెంబర్ 2021 నాడు రవీంద్రభారతి మినీ హాలులో హనీఫ్ రచించిన 'నాది దు:ఖం వీడని దేశం' కవితా సంకలనం. సరస్వతీ సమ్మాన్ గ్రహీత కె. శివారెడ్డి ఆవిష్కరించారు. సతీష్ చందర్, యన్.వేణుగోపాల్ హనీఫ్ నిర్మాణ దృక్పథాన్ని ప్రశంసిస్తూ ప్రసంగించారు. సభకు యాకూబ్ అధ్యక్షత వహించారు. వేముగంటి మురళి స్వాగతం పలికారు. అతని కవిత్వంలో నిశ్శబ్దం ప్రధాన లక్షణమని వక్తలు పేర్కొన్నారు.



## హైదరాబాద్ బుక్ ఫేర్‌లో ప్రత్యేక ఆకర్షణగా

# "జాగృతి – తంగేడు" బుక్‌స్టాల్







కరోనా ఒమిక్రాన్‌ల విజృంభణకు ఎదురొడ్డి తగు జాగ్రత్తలు తీసుకొంటూ డిసెంబర్ 18, 2021 నుండి డిసెంబర్ 28 వరకు ఎన్.టి.ఆర్. స్టేడియంలో పదిరోజుల పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో జాగృతి - తంగేడు బుక్‌స్టాల్ ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొట్టమొదటి రోజు తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సాహిత్య అకాడెమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్‌ల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. జూలూరి గౌరీశంకర్‌తో పాటు తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీనా చారి, తంగేడు సహసంపాదకుడు కాంచనపల్లి గోరా, జాగృతి మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, భాసిత్, వినోద్ మరియు ఇతర జాగృతి బాధ్యులు పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి సాహిత్య పక్షపత్రిక తంగేడు మరియు జాగృతి ప్రచురించిన ఇతర కవితా సంకలనాలు, చరిత్ర పుస్తకాలు, పరిశోధక గ్రంథాలు ఇక్కడ ప్రదర్శించడం జరిగింది. చాలామంది ప్రముఖులు ఈ స్టాల్‌ని సందర్శించి తమ అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తెలంగాణ జాగృతి స్టాల్‌ని దర్శించిన భారత ప్రధాన న్యాయమూర్తి యన్వీ రమణ గారికి, రంగు నవీనాచారి పూల సింగిడి కవితాసంకలనం బహూకరించారు. హర్యానా గవర్నర్ దత్తాత్రేయ ఈ స్టాల్‌ని దర్శించి "తంగేడు" పత్రికను అభినందించారు. ఇంకా స్టాల్‌ని దర్శించిన వారిలో ఎం.ఎల్.సి. గోరేటి వెంకన్న ప్రముఖ కవి, అందెశ్రీ, దేశపతి శ్రీనివాస్, (సి.యం. ఓ.ఎస్.డి.) మిట్టపల్లి సురేందర్ ఉన్నారు. సందర్శించిన ప్రముఖులంతా తెలంగాణ జాగృతి అధ్యక్షులు, ఎం.ఎల్.సి. కల్వకుంట్ల కవిత సాహితీ సేవను కొనియాడారు.





## స్వీకారం




### నసాబ్

వడ్త్య పంతులు నాయక్
ఫోన్ : 9441997162
వెల : రూ. 50/-




### సంస్కృత సహ ఆర సాహస్త్రీ

సంస్కృత భారతి - తెలంగాణ
సెల్ : 9440557722

**సంస్కృతభారతి**
హైదరాబాద్
వెల : రూ.50/-




### రామ్ రామ్ నాయక్

వడ్త్య పంతులు నాయక్
హైదరాబాద్
వెల : రూ. 116/-




### ఊడల మర్రి

పి. చిన్నయ్య
సెల్ : 95533 58569

**సామాజిక అధ్యయన వేదిక**
భువనగిరి
వెల : రూ. 150/-




### బాలబోధిని - 1

కళాప్రపూర్ణ: స్వర్గీయ:
కాశీ కృష్ణాచార్య:

**సర్వస్వామ్య సంకలితా**
గుంటూరుపురీ, ఆంధ్రప్రదేశ్
వెల : రూ.9/-




### బాలబోధిని - 2

కళాప్రపూర్ణ: స్వర్గీయ:
కాశీ కృష్ణాచార్య:

**సర్వస్వామ్య సంకలితా**
గుంటూరుపురీ, ఆంధ్రప్రదేశ్
వెల : రూ.18/-




### బాలబోధిని - 3

కళాప్రపూర్ణ: స్వర్గీయ:
కాశీ కృష్ణాచార్య:

**సర్వస్వామ్య సంకలితా**
గుంటూరుపురీ, ఆంధ్రప్రదేశ్
వెల : రూ.40/-




### రఘువంశ మహాకావ్యము

సంస్కృత వ్యాఖ్యా - ఆంధ్ర
ప్రతిపదార్థ సహితము

**ఎమెస్కో బుక్స్**
హైదరాబాద్
వెల : రూ.400/-




### కోకిల

ప్రొ॥ మసన చెన్నప్ప
సెల్ : 9885654381

**తెలంగాణ సారస్వత పరిషత్**
హైదరాబాద్
వెల : రూ.100/-


2022
HAPPY NEW YEAR